




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 28 సోమవారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 224


Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# విలన్ కాంగ్రెస్సే

- గోల్‌మాల్ చేయడంలో కాంగ్రెస్‌ను మించినోడు లేడు
- ఉన్న గాంధీలు.. లేని గాంధీలు.. డూప్లికేటు గాంధీలు వచ్చి హామీలు
- సిగ్గు లేకుండా ప్రజలకు బాండ్ పేపర్ రాసి ఇచ్చారు
- తెలంగాణలోని అన్ని దేవుళ్లపై ఒట్టు వేశారు..
- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నో త్యాగాలు చేశాం
- అద్భుతమైన తెలంగాణను నిర్మించుకుంటూ వచ్చాం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టం..తప్పుల్ని ప్రజల్లోకి తీసుకెళ్తం
- బీఆర్ఎస్ రజతోత్సవ సభలో పార్టీ అధినేత,మాజీ సీఎం కేసీఆర్

2



**ఎల్కతుర్తి నుంచి నవభూమి ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రానికి నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ విమర్శించారు. ఆనాడు కాంగ్రెస్ వాళ్లు పదవులు కోసం నాటకాలాడారని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చి ఏడాదైంది.. మాయరోగం వచ్చినట్లయిందని వ్యంగ్యంగా అన్నారు. గోల్‌మాల్ చేయడంలో కాంగ్రెస్‌ను మించినోడు లేడని అన్నారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్‌ను మించినోడు లేడని పేర్కొన్నారు. ఉన్న గాంధీలు.. లేని గాంధీలు.. డూప్లికేటు గాంధీలు వచ్చి హామీలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. పెన్షన్లు ఇద్దరికి ఇస్తామని హామీ ఇచ్చి ఏం చేశారు?.. దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?.. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?.. విద్యార్థులకు రూ.5 లక్షల గ్యారెంటీ కార్డు ఇస్తామన్నారు.. ఇచ్చారా?.. ప్రతి పంటకు బోనస్ ఇస్తామన్నారు.. ఇచ్చారా?.. 420 అబద్ధపు హామీలు ఇచ్చారు..కల్యాణలక్ష్మి రూ.లక్ష సహా తులం బంగారం ఇస్తామన్నారు.. ఇచ్చారా? సిగ్గు లేకుండా ప్రజలకు బాండ్ పేపర్ రాసి ఇచ్చారన్నారు. తెలంగాణలోని అన్ని దేవుళ్లపై ఒట్టు వేశారు.. ఏమైనా చేశారా?..మహిళలకు ఉచిత బస్సు.. జుట్లు పట్లుకుని కొట్టుకునేందుకు పనికొచ్చిందంటూ రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేసీఆర్ తనదైన ప్రశ్నలను సంధించారు. బీఆర్ఎస్‌పై అడ్డదిడ్డమైన మాటలు మాట్లాడుతూ.. చేయాల్సిన పనులు చేయట్లేదని.. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు బోల్తా పడ్డారన్నారు. బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ఆనాడు తెలంగాణ పదం ఎత్తకుండా చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎన్నో త్యాగాలు చేశామని చెప్పారు. తెలంగాణ ఇవ్వకుండా 14 ఏళ్ల పాటు వేధించారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కాంగ్రెస్ పార్టీ మెడలు వంచేందుకు కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశానని కేసీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మంత్రి పదవులకు సైతం రాజీనామాలు చేశామన్నారు. దేశంలో ఉన్న

# భారీ ఎన్‌కౌంటర్

- 38 మంది మావోయిస్టుల మృతి
- తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై భద్రతా బలగాలు బాంబుల వర్షం
- కర్రె గుట్టల్లో ఆపరేషన్ కగార్
- గుట్టల చుట్టూ మోహరించిన పదివేల మంది భద్రతా బలగాలు
- ఆధునాతన ఆయుధాలు,శాటిలైట్స్,డ్రోన్స్ ఉపయోగిస్తూ బాంబుల వర్షం

2



**ములుగు-నవభూమిబ్యూరో:** తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఎదురుకాల్పుల్లో ఓ జవాన్‌కు గాయాలయ్యాయి. ప్రస్తుతం కర్రెగుట్టల్లో కాల్పులు కొనసాగుతున్నాయి. ఆపరేషన్ కగార్‌లో భాగంగా తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం నివురుగప్పిన నిప్పులా మారింది. కర్రెగుట్టలే టార్గెట్‌గా భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. భద్రతాబలగాలు బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. దీంతో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. దీంతో ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే టెన్షన్ వాతావరణం నెలకొంది.
మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌తో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అంతా వార్‌జోన్‌గా మారింది. మావోయిస్టుల అగ్రనేతలే టార్గెట్‌గా సాగుతున్న ఆపరేషన్ కర్రెగుట్టల్లో గత నాలుగు రోజులుగా పెద్ద ఎత్తున కూంబింగ్ కొనసాగుతోంది. దీనిలో భాగంగా పెద్ద ఎత్తున మావోయిస్టులు హతమయ్యే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇక మావోయిస్టులకు పెట్టని కోటలాగా కర్రెగుట్టలు ప్రాంతం ఉంది. 145 ఎకరాల విస్తీర్ణం ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టు సుప్రీం కమాండర్ హిడ్మాతో పాటు వేలాది మంది మావోయిస్టులు ఉన్నట్లు భద్రతాబలగాలు గుర్తించాయి. వారి లక్ష్యంగానే కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. ములుగు జిల్లా సరిహద్దు నుంచి ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా వరకు అలాగే మహారాష్ట్రలో గడ్చిరోలి ప్రాంతంలో ఉన్న నదుల నుంచి మావోయిస్టులు తప్పించుకోకుండా మూడు వైపుల నుంచి భద్రతా బలగాలు చుట్టుముట్టాయి. దాదాపు కొద్ది రోజులుగా కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం

# కడుపంతా విషమే

- కేసీఆర్ పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది
- అప్పులున్నా.. తాము ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం
- సోనియా లేకుండా వందమంది కేసీఆర్‌లు వచ్చినా తెలంగాణ రాకపోయేది
- కేసీఆర్ తెచ్చిన ధరణిలో ఎన్ని కుంభకోణాలు జరిగాయో తెలిసిందే..
- కేసీఆర్ చేసిన విమర్శలకు తెలంగాణ మంత్రులు స్ట్రాంగ్ కౌంటర్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

కాంగ్రెస్ పార్టీపై వరంగల్ సభలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన విమర్శలకు తెలంగాణ మంత్రులు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్న ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయిందని విమర్శించారు. కేసీఆర్ ప్రసంగం మొత్తంలో కాంగ్రెస్ పార్టీని విలన్‌లా చిత్రీకరించం తప్ప ఇంకేమీ లేదన్నారు. కేసీఆర్ పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైందని

# ప్రధాని సభకు ఏర్పాట్లు

- మే 2న అమరావతికి రానున్న ప్రధాని మోదీ
- ప్రధానికి అరుదైన స్వాగతం పలకనున్న రైతులు
- ప్రధాని సభలో రైతులకు ప్రసంగించే ఛాన్స్
- ఇప్పటికే అమరావతిలో అన్ని ఏర్పాట్లు పూర్తి

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** రాజధాని అమరావతి కేంద్రంగా కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి. అమరావతి పనుల ప్రారంభం కోసం ప్రధాని మోదీ మే 2న రానున్నారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. రోడ్ షో ఏర్పాటు చేసారు. రైతులు ప్రధానికి అరుదైన స్వాగతం పలికేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రధాని సభలో అమరావతి రైతులకు ప్రత్యేకంగా అవకాశం కల్పిస్తున్నారు. బహిరంగ సభలోనూ ప్రధాని ప్రసంగించనున్నారు. కాగా, ప్రధాని పర్యటన వేళ రాజధాని లో చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. కొత్త లెక్కలతో ముందుకు వెళ్తున్నారు. ప్రధాని రాక వేళ ప్రధాని మోదీ మే 2న అమరావతి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తాజాగా ఢిల్లీలో ప్రధానితో సీఎం చంద్రబాబు కలిసిన సమయంలో అమరావతి ప్రణాళికలను వివరించారు. ఆ సమయంలోనే పీఎం మోదీ అమరావతిలో జపాన్ 'మియావాకి' విధానం అమలు చేయాలని సూచించారు. ఇక, ఇటు అమరావతి విస్తరణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పుడున్న 54 వేల ఎకరాలకు తోడు అదనంగా 44,676 ఎకరాలు సమీకరించనున్నారు. దీనికోసం మూడు మండలాల పరిధిలో 11 గ్రామాలను గుర్తించారు. కొత్తగా సేకరించే గ్రామాలతో కలిపి రాజధాని ప్రాంతం మొత్తం లక్ష ఎకరాలకు చేరుకుంటుంది. వారం రోజుల్లో

# కొత్త సీఎస్‌గా కే రామకృష్ణారావు

- 30 పదవీ విరమణ చేయనున్న సీఎస్ శాంతి కుమారి
- సీఎస్ రేసులో ఆరుగురు సీనియన్ ఐఏఎస్‌లు
- సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రామకృష్ణారావు ఎంపిక
- రామకృష్ణారావును సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కే రామకృష్ణారావును నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతి కుమారి ఏప్రిల్ 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు, ముఖ్యమంత్రి కార్యాలయంలో మార్పులు చేర్పులు చేపట్టింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. పరిపాలన ప్రక్షాళన దిశగా అడుగులు వేసింది. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుతవం తీవ్ర కసరత్తులు చేస్తున్న విషయం తెలిసింతే. శాంతి కుమారిని కొనసాగించాలని

# పాక్‌కు షాక్

- వివిధ వీసాలపై భారత్‌లో ఉన్న పాక్ దేశీయులు
- దేశం విడిచేందుకు కేంద్రం ఇచ్చిన గడువు పూర్తి
- దేశాన్ని వీడని పాక్ దేశీయులకు మూడేళ్ల జైలు 3 లక్షల జరిమానా..కేంద్ర హెూంశాఖ హెచ్చరిక

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** జమ్మూకశ్మీర్ పహల్గాం దాడి తర్వాత వివిధ వీసాలపై భారత్‌లో ఉంటున్న పాకిస్థానీయులకు దేశం విడిచి వెళ్లేందుకు కేంద్రం ఇచ్చిన గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో దేశంలో ఉంటున్న పాక్ పౌరులపై చర్యలు తీసుకోవడానికి కేంద్రం సిద్ధమవుతోంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉంటున్న దాయాది పౌరులకు కేంద్ర హెూంశాఖ సూచన మేరకు ఆయా రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు నోటీసులు ఇచ్చారు. మరో వైపు హెల్త్ వీసాపై భారత్‌కు వచ్చిన వారికి మాత్రం ఈ నెల 29 వరకు అవకాశం ఉంది. జమ్మూకశ్మీర్ పహల్గామ్ బసరన్ ప్రాంతంలోని ఆహ్లాదకరమైన,

# మా ఆర్థిక వ్యవస్థ భేష్

2

- పెట్టుబడులతో రండి: ఆర్‌బీఐ గవర్నర్
- భారత అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య వేదికలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్



**వాషింగ్టన్-నవభూమిబ్యూరో:** కొన్ని సమస్యలున్నా, భారత ఆర్థిక వ్యవస్థ భవిష్యత్‌కు ఢోకా లేదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్‌లో పెట్టుబడులుపెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా పారిశ్రామిక వర్గాలను కోరారు. సిఐఐ-భారత అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ అంతర్జాతీయ ఫైనాన్సియల్ మార్కెట్లలో ఆటుపోట్లు,

# విచారణకు రాలేను

- ఈడీకి షాకిచ్చిన మహేశ్ బాబు
- సాయి సూర్యా డెవలపర్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా బెట్టింగ్ యాప్ కేసులో మహేశ్‌బాబుకు ఈడీ నోటీసులు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు , సూపర్‌స్టార్ మహేశ్ బాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు ఇచ్చిన వ్యవహారం చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. సురానా గ్రూప్, సాయి సూర్య డెవలపర్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసిన మహేశ్ ఎంత పారితోషికం తీసుకున్నారు? దాని చెల్లింపులు ఎలా చేశారు? అనేది ఆరా తీయడానికే ఈడీ నోటీసులు ఇచ్చినట్లుగా వార్తలు వచ్చాయి. తాజాగా ఈ వ్యవహారం కీలక మలుపు తిరిగింది.
సినిమాలతో బిజీగా ఉంటూనే బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తో కోట్లు సంపాదిస్తున్నారు మహేశ్ బాబు. టాలీవుడ్‌లోనే కాదు.. దక్షిణాది ఇండస్ట్రీలోనూ బ్రాండ్ ప్రమోషన్ విషయంలో మహేశ్ దరిదాపుల్లో ఏ హీరో లేరు. ఐదు సెకన్ల యాడ్‌లో నటించినందుకు రూ.5 కోట్లు తీసుకున్న సూపర్‌స్టార్ అప్పట్లో మౌంటేన్ డ్యూ కోసం రూ.12 కోట్ల

# బావిలో దూకిన వ్యాన్

- విషపూరితమైన వాయువుతో ఊపిరి ఆడక 10 మంది మృతి
- మధ్యప్రదేశ్‌లోని కచారియాలో విషాదకర ఘటన
- రోడ్డు పక్కన ఉన్న పాడుబడిన బావిలోకి దూసుకెళ్ళిన వ్యాన్
- ప్రమాద సమయంలో వ్యాన్‌లో 13 మంది..

2

**మంద్‌సౌర్-నవభూమి:** మధ్యప్రదేశ్‌లో అత్యంత విషాదకర సంఘటన చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళుతున్న ఓ వ్యాన్ అదుపుతప్పి బావిలో పడిపోవడంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ పాడుబడిన బావిలో విషపూరితమైన వాయువు నిండి ఉండడమే వారి మృతికి కారణమని భావిస్తున్నారు. మంద్‌సౌర్ జిల్లాలోని కచారియా గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఈ ఘోర దుర్ఘటన జరిగింది. ప్రమాద సమయంలో వ్యాన్‌లో మొత్తం 13 మంది ఉన్నట్లు అధికారులు



# కాంగ్రెస్ నేత దారుణ హత్య

- లారీతో గుద్ది, వేటకోడవళ్లతో నరికి దారుణ హత్య
- అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణ శివారులో ఆలూరు రోడ్డు చిప్పగిరి రైల్వే బ్రిడ్జి వద్ద ఘటన
- గుంతకల్ నుంచి చిప్పగిరికి లక్ష్మీనారాయణ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి

2



మొదట కారును లారీతో గుద్ది, ఆ తర్వాత వేటకోడవళ్లతో దాడి చేసి.. కాంగ్రెస్ నేతను దారుణంగా నరికి హత్య చేసిన ఘటన అనంతపురం జిల్లాలో చోటు చేసుకుంది. ఈ ఊహించని ఘటనతో రాయలసీమలో మళ్లీ ఒక్కసారిగా పాతకక్షలు భగ్గుమన్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే... కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గం ఇంఛార్జ్‌గా ఉన్న లక్ష్మీనారాయణ దారుణ హత్యకు గురయ్యారు. ఆయన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గానే కాకుండా ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడుగా కూడా వ్యవహరిస్తున్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణ శివారులో ఆలూరు రోడ్డు చిప్పగిరి రైల్వే బ్రిడ్జి వద్ద ఈ ఘటన జరిగింది. గుంతకల్ నుంచి చిప్పగిరికి లక్ష్మీనారాయణ వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. మొదట లక్ష్మీనారాయణ ప్రయాణిస్తున్న ఇన్నోవా వాహనాన్ని టిప్పర్‌తో ఢీ కొట్టారు. ఆ తర్వాత కారులో చిక్కుకున్న లక్ష్మీనారాయణపై కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అయితే తీవ్రగాయాలైన లక్ష్మీనారాయణను వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే ఆయన చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. అంతే కాకుండా ఈ ఘటనలో జరిగేటప్పుడు కారులో ఉన్న ఆయన కుమారుడు కూడా తీవ్రంగా గాయపడినట్టు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## ఫుడ్ స్ట్రీట్ తరలింపు.. ఎక్కడికి మార్చుతున్నారంటే..?

**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ మహానగరంలో నైట్ టైమ్ ఫుడ్ కు గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ ఫుడ్ స్ట్రీట్ చాలా ఫేమస్. నగరంలోని యువతకు, ఆహార ప్రియులకు, ఐటీ ఉద్యోగులకు ఒక ముఖ్యమైన హాట్‌స్పాట్‌గా మారింది. 200కు పైగా స్టాళ్లతో దాదాపు కిలోమీటరు విస్తీర్ణంలో ఉన్న డీఎల్ఎఫ్ ఫుడ్ స్ట్రీట్‌లో వివిధ రకాల ఆహారాలు అందుబాటులో ఉంటాయి. స్థానిక తెలంగాణ వంటకాల నుండి నార్త్ ఇండియన్, చైనీస్, ఇటాలియన్, ఇతర అంతర్జాతీయ రుచుల వరకు ప్రతి ఒక్కరి అభిరుచికి తగిన ఫుడ్ లభిస్తుంది. ముఖ్యంగా లేట్ నైట్ బిర్యానీ, ఫాస్ట్ ఫుడ్, చాట్, దోసెలు, ఇడ్లీలు, మ్యాగీ, స్వీట్లకు ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. సాయంత్రం వేళల్లో డీఎల్ఎఫ్ రోడ్డు చాలా సందడిగా ఉంటుంది. అనేక ఫుడ్ స్టాల్స్, చిన్న చిన్న రెస్టారెంట్లు ఆహార ప్రియులతో నిండిపోయి ఉత్సాహభరితమైన వాతావరణాన్ని కలిగి ఉంటాయి.అయితే ఎంతో మంది ఫుడ్ లవర్స్‌కు ఇష్టమైన డీఎల్ఎఫ్ ఫుడ్ స్ట్రీట్ మరో నెల రోజుల్లో మూతపడనుంది. ఇందుకు ప్రధాన కారణం అక్కడ జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులే. రాత్రి వేళ ఫుడ్ స్ట్రీట్ వద్ద భారీగా జనం ఉండటం వల్ల గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వాహనదారుల ఇబ్బందులను తగ్గించేందుకు రోడ్డు విస్తరణ చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో డీఎల్ఎఫ్ ఫుడ్ స్ట్రీట్ తొలగించనున్నట్లు షాప్ యజమానులకు ఇప్పటికే అధికారికంగా సమాచారం అందింది. రోడ్డు పనులు రానున్న నెల రోజుల వ్యవధిలో ప్రారంభం కానుండగా.. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.డీఎల్ఎఫ్ ఫుడ్ స్ట్రీట్‌లోని దుకాణాలను ఐటీసీ కోహినూర్ రోడ్డుకు సమీపంలో ఉన్న మైదానానికి తరలించే ప్రణాళికను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ రూపొందిస్తోంది.

## ఫ్యామిలీ అంతా లొట్టలేసుకుంటూ బోటి కూర లాగించేశారు.. మిగిలింది ఫ్రిజ్‌లో పెడదామని చూస్తే.. వామ్మో..!



**హైదరాబాద్-నవభూమి:**ఆహా ఏమి రుచి.. అనరా మైమరచి.. అంటూ లొట్టలేసు కుంటూ బోటి కూర లాగించేశారు. అది కూడా పేరు మోసిన ఓ హోటల్ నుంచి తెచ్చుకుని మరీ తిన్నారు. ఒక్కరో ఇద్దరో కాదు.. ఫ్యామిలీ ఫ్యామిలీ అంతా తినేశారు. అంతా అయిపోయాక.. పార్శిల్‌లో ఇంకాస్త కూర మిగిలిపోవటంతో.. రాత్రికి తినొచ్చనుకున్నారు. పార్శిల్‌లో ఉన్న కూరను ఓ గిన్నెలో వేసి ఫ్రిజ్‌లో పెడదామని చూసేసరికి.. అక్కడ కనిపించింది చూసి పేగులన్నీ దేవేసినట్టయింది. మరి ఆ బోటి కూరలో బొద్దింకో, ఈగో, దోమో కనిపించి ఉంటే కాస్త దిగులు పడేవారు. పోనీలే తినేశాంగా అని సర్దిచెప్పుకుని.. మిగిలిన దాన్ని పడేసి సైలెంట్‌గా ఉండేవారు. కానీ.. అక్కడ కనిపించింది బొద్దింకో, ఈగో, దోమో కాదండీ.. ఏకంగా ఓ ఎలుక. దాన్ని చూసి.. అప్పటివరకు లొట్టలేసుకుంటూ తిన్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. యాక్.. యాక్.. అంటూ నోట్లో వేళ్లేసి కక్కటం మొదలుపెట్టారు. హాస్పిటల్‌కు పరుగులు తీశారు. ఈ షాకింగ్ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో జరిగింది.వివరాల్లోకి వెళితే.. అచ్చంపేటకు చెందిన హరీష్ అనే వ్యక్తి ఏప్రిల్ 25న సాయంత్రం నాలుగు గంటల సమయంలో పట్టణంలోని ఓ ప్రముఖ హోటల్‌కు వెళ్లాడు. అక్కడ తన అభిమాన వంటకం బోటి కూరను పార్శిల్ చేయించుకున్నాడు. ఇంటికి వెళ్లి.. కుటుంబ సభ్యులందరూ కలిసి ఆ కూరను ఆరగించారు. కడుపు నిండా తిన్న తర్వాత.. కాస్తంత కూర పార్శిల్ కవర్‌లో మిగిలగా.. కూరను ఫ్రిజ్‌లో పెట్టేందుకు గిన్నెలో వేయగా.. పేగులు నోట్లోకి వచ్చినంత పనైంది. కూర అడుగు భాగంలో మసాలాల మధ్య ఓ ఎలుక కళేబరం స్పష్టంగా కనిపించింది.దీంతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన హరీష్ తన కుటుంబ సభ్యులతో కలిసి వెంటనే ఆస్పత్రికి పరుగులు తీశాడు. ఆ తర్వాత ఆగ్రహంతో రగిలిపోయిన హరీష్.. అదే రాత్రి 10 గంటల సమయంలో హోటల్‌కు వెళ్లి నిర్వాహకులను నిలదీశాడు. అయితే వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో హరీష్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.వెంటనే స్పందించిన పోలీసులు హోటల్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. హరీష్ ఫిర్యాదు మేరకు జిల్లా ఆహార తనిఖీ అధికారి మనోజ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి హోటల్‌పై మెరుపు దాడి చేశారు. హోటల్‌లోని బిర్యానీ పాయింట్‌తో పాటు వంటగది పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆహార నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఈ ఘటనకు సంబంధించిన ఫోటోలను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి విచారణ చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. అంతేకాకుండా హోటల్ యాజమాన్యానికి సమన్లు జారీ చేశారు.పట్టణంలో పేరున్న హోటల్‌లో ఇంత దారుణమైన ఘటన జరగడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ విషయం క్షణాల్లో పట్టణమంతా వ్యాపించడంతో ఒక్కసారిగా అంతా ఉలిక్కిపడ్డారు. కడుపు నిండా బోటి కూర తిన్నామని సంతోషించిన కుటుంబ సభ్యులు ఆ ఎలుక కళేబరాన్ని చూసి ఆందోళనతో వణికిపోతున్నారు. అయితే.. వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోగా.. ఎవరికీ ఏం జరగకపోవటంతో కాస్త ఊపిరిపీల్చుకున్నారు.

## ఈఎన్‌సీ హరి రామ్‌కు 14 రోజుల రిమాండ్..

**హైదరాబాద్-నవభూమి:**కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ చీఫ్ ఈఎన్‌సీ హరి రామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిసాయి. అనంతరం పోలీసులు ఆయనను అర్ధరాత్రి సమయంలో జడ్జి ముందు ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. రూ. 200 కోట్లకుపైగా అక్రమ ఆస్తులు కలిగి ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. హరి రామ్ ఇంటితోపాటు ఏకకాలంలో బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏక కాలంలో 14 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. గజ్వేల్‌లో భారీగా అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. మార్కుర్‌లో 28 ఎకరాల భూమి, కొండాపూర్ షేక్స్‌పేట్, శ్రీనగర్, మాదాపూర్ ప్రాంతాల్లో ఖరీదైన ఫ్లాట్లను ఏసీబీ అధికారులు గుర్తించారు. పటాన్ చెరువులో 20 గుంటల భూమి, ఆరెకరాల మామిడి తోట, ఫామ్ హౌస్‌ను గుర్తించారు.

%కాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్) భూక్యా హరిరామ్ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శనివారం అరెస్టు అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల మార్పు వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, ఇందులో హరిరామ్ కీలకపాత్ర షోషించారనే ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. మరోపక్క, కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎసఏ) నివేదిక ఇటీవల వెలువడింది. ఈ నేపథ్యంలో హరిరామ్ ఇల్లు, జలసౌధ కార్యాలలయం, హరిరామ్ బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఇళ్లు సహా 14 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు శనివారం ఉదయం నుంచి తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో ఏసీబీ అధికారులు కళ్లుచెదిరే ఆస్తులను గుర్తించారు. ఏసీబీ ప్రకటన ప్రకారం.. హరిరామ్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న మర్కూక్ మండలంలోనే 28 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం ఉంది. అంతేకాక, హైదరాబాద్‌లోని షేక్‌పేట్, కొండాపూర్‌లో విల్లాలు, మాదాపూర్, శ్రీనగర్‌కాలనీ, నార్సింగ్‌లో ఫ్లాట్లు ఉన్నాయి. పటాన్‌చెరులో 20 గుంటల భూమి, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు కూడా ఉన్నాయి.బొమ్మలరామారంలో ఆరు ఎకరాలలో ఫామ్‌హౌస్, మామిడి తోట, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న భవనం, కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇక, బీఎండబ్ల్యూ సహా రెండు కార్లు, ఉన్నాయి. ఇవే కాక, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లను కూడా గుర్తించారు. ఆయా ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో భారీగా ఉంటుందని పేర్కొంది. సోదాలు కొనసాగుతున్నాయని, హరిరామ్ ఆస్తుల చిట్టా మరింత పెరిగే అవకాశముందని ఏసీబీ పేర్కొంది. కాగా, హైదరాబాద్, షేక్‌పేటలోని ఆదిత్య టవర్స్‌లో హరిరామ్ నివసిస్తున్న ఇంట్లో సోదాలు చేసిన అధికారులు.. అక్కడి కంప్యూటర్లు, లాప్‌టాపలను పరిశీలించారు. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. హరిరామ్ భార్య అనిత ఇరిగేషన్ విభాగంలో డిప్యూటీ ఈఎన్‌సీగా పనిచేస్తున్నారు. దీంతో ఏసీబీ అధికారులు ఆమెను కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ గ్రామం.. హరిరామ్ స్వగ్రామం. ఎదురగడ్డలోని హరిరామ్ నివాసంతోపాటు ఆయన బంధువుల ఇంట్లో ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలోని బృందం సోదాలు చేసింది. నిజానికి, ఏసీబీ దాడులు జరుగుతాయనే సమాచారం చాలా రోజుల నుంచే ఉండడంతో హరిరామ్ ఇప్పటికే జాగ్రత్తలు తీసుకున్నారని, చాలా ఆస్తులు బినామీల పేర్లతో పెట్టారని సమాచారం.

# ప్రధాని సభకు ఏర్పాట్లు

(1వపేజీ తరువాయి)నోటిఫికేషన్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. గుంటూ రు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు సమీకరణకు నోటిఫికేషన్ ఇవ్వగానే సిఆర్‌డిఏ సమీకరణ ప్రక్రియ చేపట్టనుంది. ప్రధానితో భేటీ అమరావతి రాజధానిగా ప్రకటించిన సమయంలో 2015లో తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలో ప్రస్తుత రాజధానిగా నిర్ణయించిన ప్రాంతంలో సమీకరించిన భూముల్లో రైతులకు ఇప్పటి వరకూ ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వలేదు. కొత్తగా మరోసారి పూలింగు అంటే రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇన్నర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న అన్ని ప్రాంతాలతోపాటు, ఎర్రుపాలెం, నంబూరు రైల్వేలైన్‌కు అవసరమైన భూములను కలిపి సమీకరణ చేయనున్నారు. ఇటీవల మంత్రి నారాయణ రాజధాని చుట్టుపక్కల స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు భూ సమీకరణ చేస్తామని, ప్రజలు అంగీకరించకపోతే సేకరణకు వెళతామనీ ప్రకటించారు. ఆయన అన్నదే తడవుగా పూలింగు పరిధిలోకి వచ్చే గ్రామాల్లో కూటమి పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సమావేశాలు ఏర్పాటు చేశారు. అభ్యంతరాలున్నా రైతులందరూ అంగీకరించినట్లు ప్రకటించారు. కొత్తగా పూలింగు చేపట్టబోయే గ్రామాల్లో తుళ్లూరు మండల పరిధిలోని హరిశ్చంద్రాపురం, వడ్డమాను రెవెన్యూ గ్రామాలను పూర్తిగా చేర్చారు. 11 గ్రామాల పరిధిలో హరిశ్చంద్రా పురంలో 2,429 ఎకరాలు, వడ్డమానులో 1,937 ఎకరాలను సమీకరించనున్నారు. పెద రిమిలో 6,513 ఎకరాలు తీసుకోనున్నారు. అమరావతి మండల పరిధిలోని వైకుంఠ పురంలో 3,360 ఎకరాలు, ఎండ్రాయిలో 2,167, కర్లపూడిలో 2,947, మోతడకలో 2,345, నిడుముక్కలలో 2,013 ఎకరాలు సమీకరణ కింద తీసుకోనున్నారు. తాడికొండ మండల పరిధిలో తాడికొండలో 12,797 ఎకరాలు సమీకరణ పద్ధతిలో తీసుకోనున్నారు. కంతేరులో 3,671, మంగళగిరి మండలం కాజలో 4,492 ఎకరాలు మొత్తం 44,676 ఎకరాలు సమీకరణ కింద తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్ ఇచ్చిన వెంటనే కార్యాచరణ ప్రారంభించేందుకు వీలుగా సిఆర్‌డిఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను రైతులతో సమావేశాలు నిర్వహించి ముందుగా వారిని సిద్ధం చేయాలని సూచించింది. ఈసారి పూలింగులో కొత్త జాతీయ రహదారి వరకూ చేపట్టనున్నారు.

## విచారణకు రాలేను

(1వపేజీ తరువాయి)రెమ్యునరేషన్ తీసుకుని ఇండస్ట్రీకి షాకిచ్చారు. సినిమాలు, వ్యాపారాలు, బ్రాండ్ ప్రమోషన్‌తో ఏడాదికి రూ.200 కోట్ల పైనే సంపాదిస్తున్నారు మహేశ్.ఇటీవలి కాలంలో సినీతారలు , ఇతర సెలబ్రిటీలు బ్రాండ్ ప్రమోషన్ విషయంలో చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. బెట్టింగ్ యాప్ కేసులో టాలీవుడ్ యాంకర్లు, సినీతారలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. గతేడాది మహదేవ్ బెట్టింగ్ యాప్, క్యూనెట్ వంటి సంస్థలకు ప్రమోషన్ చేసిన సెలబ్రిటీలు ఇప్పటికీ కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే మహేశ్ బాబు కూడా ఇబ్బందుల్లో పడ్డారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ భార్య ప్రసవం.. హ్యాట్సాఫ్ సార్, సర్కార్ దవాఖానాలపై నమ్మకం పెంచిన్రు..!



**హైదరాబాద్-నవభూమి:**ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందదు, సరిగ్గా పట్టించుకోరు అనే అపోహ చాలా మందిలో ఉంటుంది. సర్కార్ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండటం వల్ల సరైన శ్రద్ధ లభించడం లేదనే భావన చాలా మందికి కలుగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రులతో పోలిస్తే.. ప్రైవేట్ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు, తక్కువ రద్దీ, ఎక్కువ వ్యక్తిగత శ్రద్ధ ఉంటుందని అటువైపే మొగ్గుచూపేవారు. అయితే ఈ అపోహలో పూర్తిగా నిజం లేదని చెప్పాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ చాలా మంది అంకితభావంతో పనిచేసే, నైపుణ్యం కలిగిన వైద్యులు, సిబ్బంది ఉన్నారు.తాజాగా.. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయా శ్రీహర్ష సతీమణి విజయ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించారు. శనివారం రాత్రి ఆమెకు పురిటి నొప్పులు రాగా.. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ ద్వారా ప్రసవం చేశారు. కలెక్టర్ సతీమణి విజయ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. గర్భధారణ నాటి నుంచి ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు, చికిత్స తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కలెక్టర్ తీరు ఇతరులకు ఆదర్శంగా మారి ప్రశంసలు అందుకుంటోంది. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా చేశారని వారిని ప్రశంసిస్తున్నారు.కాగా, తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు అనేక చర్యలు తీసుకుంటోంది. ఆసుపత్రుల్లో కొత్త భవనాల నిర్మాణం, ఉన్న వాటికి మరమ్మతులు, ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు వంటి చర్యలు చేపడుతున్నారు. పెద్దపల్లి జిల్లాలో 55 లక్షలతో 40 పడకల ప్రత్యేక వార్డును, 12 లక్షలతో మెకానైజ్డ్ లాండ్రీని ఏర్పాటు చేశారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కొరతను అధిగమించడానికి కొత్త నియామకాలు చేపడుతున్నారు.ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించేందుకు మరిన్ని ప్రైవేట్ ఆసుపత్రులను నెట్‌వర్క్‌లో చేర్చుతున్నారు. ఇటీవల 164 కొత్త ప్రైవేట్ ఆసుపత్రులను చేర్చడానికి సూత్రప్రాయంగా అంగీకరించారు. ఇలా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి, నాణ్యతను మెరుగుపరచడానికి కృషి చేస్తోంది. దీంతో సర్కార్ దవాఖానాల్లో ట్రీట్మెంట్ చేయించుకునేవారి సంఖ్య పెరుగుతోంది.

# కడుపంతా విషమే

(1వపేజీ తరువాయి)విమర్శించారు. అప్పులున్నా.. తాము ప్రజలకు సంక్షేమం అందిస్తున్నామని మంత్రులు తెలిపారు. తెలంగాణను ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? అని ప్రశ్నించారు. సోనియా లేకుండా వందమంది కేసీఆర్‌లు వచ్చినా తెలంగాణ రాకపోయేదన్నారు. కడుపంతా విషం నింపుకొని కేసీఆర్ మాట్లాడటం బాధ కలిగించిందన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మంచి సలహాలు ఇస్తారనుకుంటే అలా జరగలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ కేవలం రెండుసార్లు మాత్రమే అసెంబ్లీకి వచ్చారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయం కూడా కేసీఆర్ రాలేదని మండిపడ్డారు. కేసీఆర్ దొర మాదిరిగా పరిపాలిస్తే.. తమ ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అందుబాటులో ఉందని మంత్రులు తెలిపారు. ” ప్రజలకు కాంగ్రెస్ అందిస్తున్న మంచి పాలన గురించి తట్టుకోలేక కేసీఆర్ విషం కక్కారని విమర్శించారు. గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పింది కేసీఆర్ అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ. 82 వేల కోట్లు బకాయిలు పెట్టిందన్నారు. అధికారంలోకి రావాలని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని మంత్రులు ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సభకు ఆటంకాలు సృష్టించామని కేసీఆర్ ఆరోపించారు.. అలా చేస్తే సభ జరిగేదా? అని ప్రశ్నించారు. యూనివర్సిటీ ఆస్తులు అమ్ముతున్నామని కేసీఆర్ ఆరోపించారు.. అసలు తాము యూనివర్సిటీ ఆస్తులు ఎక్కడ విక్రయించామని మంత్రులు నిలదీశారు.ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తుందన్నారు. కేసీఆర్ తెచ్చిన ధరణిలో ఎన్ని కుంభకోణాలు జరిగాయో అందరికీ తెలుసన్నారు. కేసీఆర్ అనేక హామీలిచ్చి నెరవేర్చలేదని అన్నారు. అధికారం పోయిందనే అక్కసుతోనే కేసీఆర్ విమర్శలు చేస్తున్నారన్నారు. “కాంగ్రెస్ సర్కారును పడగొట్టం, కానీ! పోలీసులూ డైరీలో రాస్కోండి” కేసీఆర్ తన హయాంలో నియంతలా వ్యవహరించారని మంత్రులు మండిపడ్డారు. ధర్నా చౌక్ ను తొలగించింది కేసీఆర్ అని గుర్తు చేశారు. అసెంబ్లీలో మాట్లాడే సమస్యలను ఉత్తికబుర్లని అవమానించారు. అలాంటి వ్యక్తికి మళ్లీ అసెంబ్లీలో అడుగుపెట్టే నైతిక హక్కు ఉందా? అని కేసీఆర్ పై మంత్రులు విరుచుకుపడ్డారు. ప్రజలు ఓడించి ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన కేసీర్ గర్వం పోలేదన్నారు. కేసీఆర్ అవకాశవాదిగా మాట్లాడారన్నారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అనలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించినవారికి ఆ సభా వేదికపై ఎందుకు నివాళి అర్పించలేదన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వగలరా? అని కేసీఆర్ ను మంత్రులు ప్రశ్నించారు.

## కొత్త సీఎస్‌గా కే రామకృష్ణారావు

(1వపేజీ తరువాయి)అనుకున్నప్పటికీ.. చివరకు కొత్త సీఎస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. సీనియరిటీ జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని నిర్ణయించింది. ఈయన 2014 నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడం, కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో కీలకంగా వ్యవహరించారు రామకృష్ణారావు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఇతర అవసరాల దృష్ట్యా ఆయన్ని సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత సీఎస్ శాంతి కుమారి పదవీ విరమణ అనంతరం రామకృష్ణారావును సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

మరోవైపు, రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలను చేపట్టింది ప్రభుత్వం. తెలంగాణలో బదిలీ అయిన ఐఏఎస్ అధికారుల వివరాలు గుడ్ గవర్నెన్స్ వైఎస్ ఛైర్మన్‌గా శశాంక్ గోయల్ ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవోగా జయేశ్ రంజన్ పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ముఖ్యకార్యదర్శిగా సంజయ్ కుమార్ ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా స్మితాసభర్వాల్ కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా దానకిశోర్ పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి(హెచ్‌ఎండీఏ వెలుపల)- టీకే శ్రీదేవి పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి( హెచ్‌ఎండీఏ పరిధి)- ఇలంబర్తి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా కె. శశాంక రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవోగా నిఖిల ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణ దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవోగా ఎస్. వెంకటరావు జెన్‌కో సీఎండీగా ఎస్.హరీశ్.

## భారీ ఎన్‌కౌంటర్

(1వపేజీ తరువాయి)వేట కొనసాగుతోంది. అధునాతన ఆయుధాల తో శాటిలైట్స్, డ్రోన్స్‌ను ఉపయోగిస్తూ మావోయిస్టులపై పై నుంచి బాంబుల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ భీకరమైన కాల్పుల్లో ఇప్పటి వరకు 38 మంది మావోయిస్టుల చనిపోయినట్లు తెలుస్తోంది.

కాగా.. ఇప్పటి వరకు కర్రెగుట్టల్లో జరుగుతున్న భీకరకాల్పులపై ప్రజాస్వామ్య వాదులు, పౌరహక్కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కర్రెగుట్టల నుంచి భద్రతాబలగాలు వెనక్కి తగ్గాలని చెబుతున్నారు. అయినప్పటికీ ఆపరేషన్ కగార్ మాత్రం కొనసాగుతోంది.

# విలన్ కాంగ్రెస్సే

(1వపేజీ తరువాయి)అనేక పార్టీలను సైతం కూడగట్టామని తెలిపారు.ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీ గొంతు పట్టుకున్నామని చెప్పారు. విధిలేని పరిస్థితుల్లో కాంగ్రెస్ దిగి వచ్చి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించిందన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత.. రాష్ట్రాన్ని బాగు చేసేందుకు నడుం బిగించామని.. అందులోభాగం పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేశాన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కొత్తగా కట్టుకున్నామని.. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలు సైతం చేపట్టామని వివరించారు. రైతులను కడుపులో పెట్టుకుని చూసుకున్నామని గుర్తు చేశారు. దేశంలోనే ఎక్కడా లేని రైతుబంధు అమలు చేశామన్నారు. తెలంగాణ వస్తే కరెంట్ రాదన్నారు.. కానీ ప్రత్యేక రాష్ట్రంలో అద్భుతంగా ఉచిత కరెంట్ అందించామని కేసీఆర్ పేర్కొన్నారు.అద్భుతమైన తెలంగాణను నిర్మించుకుంటూ వచ్చామని.. తెలంగాణ రాక ముందు రైతులను పట్టించుకునే నాథుడే లేడన్నారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా రైతుల దగ్గర ధాన్యం సేకరించామని చెప్పారు. ఎవరు అడగకపోయినా తెలంగాణ చెరువుల్లో చేపలు పెంచామన్నారు. లక్షలాది గొర్రెలు పంపిణీ చేశామని చెప్పారు. ఎప్పుడూ లేని విధంగా పారిశ్రామిక రంగం అభివృద్ధి జరిగిందని చెప్పుకొచ్చారు. ఐటీ రంగంలో 7 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చాయని.. అలాగే రాష్ట్రంలో తెలంగాణలో 3 నుంచి 33 మెడికల్ కాలేజీకు పెంచామని వివరించారు.

## పాక్‌కు షాక్

(1వపేజీ తరువాయి)అందమైన ప్రాంతాలను ఆశ్వాదిస్తున్న పర్యాటకులపై పాక్ ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. భారత్ ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యాటకులపై విచక్షణరహితంగా కాల్పులు జరిపి 26 మంది ప్రాణాలను బలికొన్నారు. దీంతో ప్రధాని మోదీ నేతృత్వంలో అత్యవసర సమావేశం నిర్వహించిన కేంద్ర కేబినెట్ కమిటీ పాక్ పై ఒత్తిడి తీసుకురావటానికి 5 కీలక నిర్ణయాలు తీసుకుంది.ఈ నిర్ణయాల్లో భాగంగా వివిధ వీసాలతో భారత్ లో జీవిస్తున్న పాక్ పౌరులను ఈ నెల 27లోగా తమ స్వదేశానికి వెళ్లాలని ఆదేశించింది. దీంతో నేటితో ఆ గడువు ముగియడంతో భారత్ ఉంటున్న వారిపై ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్ 2025 ప్రకారం వారిపై విచారణ చేపట్టి గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష.. లేదా రూ.3లక్షల జరిమానా విధించనుంది. మరికొన్ని సందర్భాల్లో రెండూ విధించే అవకాశం ఉంది. కేంద్రం ఆదేశాలతో ఇప్పటికే చాలా మంది పాక్ పౌరులు వాఘా అట్టారీ బోర్డర్ నుంచి దేశాన్ని వీడి స్వదేశానికి వెళ్లిపోయారు. మిగిలి ఉన్న వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవటానికి ఆయా రాష్ట్రాల పోలీసులు సన్నద్ధమయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు పహల్గామ్ ఉగ్రవాదుల దాడి ఘటనను జాతీయ దర్యాప్తు సంస్థ టేకోవర్ చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఎన్ఐఏ దర్యాప్తు మొదలు పెట్టింది. పహల్గామ్‌లో ఉగ్రవాదులు కాల్పులు జరిపిన బైసారన్ మీడోస్‌ను సందర్శించారు. అణువణువూ పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ జనరల్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ర్యాంక్ అధికారులతో కూడిన ప్రత్యేక టీమ్ బైసారన్‌ను సందర్శించింది. యాంటీ- టెర్రర్ ఏజెన్సీ నుంచ పోలీస్ సూపరింటెండెంట్ స్థాయి అధికారులు ఇందులో ఉన్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఈ దర్యాప్తులో భాగస్వామ్యం అయ్యాయి. పహల్గామ్, బైసారన్‌లో క్షేత్రస్థాయిలో భద్రత వ్యవస్థను పరిశీలించారు.

## మా ఆర్థిక వ్యవస్థ భేష్

(1వపేజీ తరువాయి)అనిశ్చితి ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా భారత్ 6.5 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో మరే దేశ జీడీపీ ఈ స్థాయిలో పెరిగే అవకాశం లేదని చెప్పార్ను. స్థిరమైన ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని చెప్పారు. దీర్ఘకాలిక లాభాలు, అవకాశాలు కోరుకునే పారిశ్రామికవేత్తలకు భారత్ చక్కటి మార్కెట్ అని స్పష్టం చేశారు.

**భాగస్వామి కూడా :** విదేశీ పెట్టుబడులకు భారత్ గమ్య స్థానమేగాక, వారి ఐశ్వర్యంలోనూ భాగస్వామిగా ఉంటుందని మల్హోత్రా అన్నా రు. ఈ భాగస్వామ్యం భారత భవిష్యత్‌నే గాక ప్రపంచ భవిష్యత్‌నూ మార్చివేస్తుందన్నారు. 2010-19 మధ్యకాలంలో భారత జీడీపీ ఏటా సగటున 6.6 శాతం చొప్పున పెరిగితే గత నాలుగేళ్లలో ఏటా సగటున 8.2 శాతం వృద్ధిరేటు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవిర్భవించబోతోందని చెప్పారు.

## కాంగ్రెస్ నేత దారుణ హత్య

(1వపేజీ తరువాయి)లక్ష్మీనారాయణపై దాడి చేసింది ఎవరు.. దాడి చేయడానికి గల కారణాలు ఏంటి ? అనే వివరాలను ఆరా తీస్తున్నారు. ఘటన జరిగిన ప్రదేశానికి సమీపంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజ్, లారీ ఓనర్ గురించి తెలుసుకుంటున్నారు. ఇక ఈ ఘటనపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇంతటి దారుణమైన రీతిలో ఒక రాజకీయ నాయకుడిని హత్య చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. లారీతో ఢీ కొట్టి, వేట కొడవళ్లతో నరికి చంపడం అంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం అవుతుందని అన్నారు. ఈ ఘటనపై పోలీసు శాఖ అత్యున్నత విచారణ జరిపించాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలానే లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు షర్మిల పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా నిలుస్తుందని.. వారికి అన్ని విధాలా సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టి.. ఏపీ పోలీసులతో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లను ట్యాగ్ చేశారు.

## మానసిక రోగులకు దూరంగా ఉండండి: సజ్జనార్

**హైదరాబాద్-నవభూమి:**సోషల్ మీడియాలో వైరల్ అవ్వాలనే ఉద్దేశ్యంతో కొందరు యువత చేసే పనులు ఆందోళన కలిగిస్తున్నాయి. హద్దులు దాటి పిచ్చి వేషాలు వేయడమే కాకుండా, చట్టవిరుద్ధమైన చర్యలకు కూడా పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో త్వరగా పాపులర్ అవ్వాలనే కోరిక, ఎక్కువ లైకులు, ఫాలోవర్లను పొందాలనే ఆత్రుత వారిని ఇలాంటి విపరీతమైన పనులు చేయడానికి ప్రేరేపిస్తోంది. ఎక్కువ మంది దృష్టిని ఆకర్షించడానికి కొందరు అసాధారణమైన, కొన్నిసార్లు ప్రమాదకరమైన కంటెంట్‌ను సృష్టిస్తున్నారు. చట్టవిరుద్ధమైన పనులు చేస్తూ.. ఇతరులకు తప్పుడు సంకేతాలు పంపుతున్నారు. తాజాగా అందుకు సంబంధించిన ఓ వీడియోను టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ, సీనియర్ ఐఏఎస్ సజ్జనార్ ట్వీట్ చేశారు.ఆ వీడియోలో ఓ యువకుడి బైక్‌పై కూర్చొని ఉండగా.. అతడి దగ్గరకి ఓ స్నేహితుడు వస్తాడు. గంజాయి తీసుకొచ్చి తాగాలని సూచిస్తాడు. అయితే ఆ యువకుడు తనకు అలవాటు లేదని వద్దని తిరస్కరిస్తాడు. అయినా వదలిపెట్టకుండా బలవంతంగా గంజాయి ఇస్తాడు. గంజాయి సేవించిన తర్వాత సదరు యువకుడు పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తుంటాడు. తనను 200 ఏళ్ల క్రితం 2000 మంది కలిసి చంపారని.. తాను ఇప్పుడు ఆ 2000 వేల మందిని చంపుతానంటూ పిచ్చగా వాగుతాడు. దీంతో గంజాయి ఇచ్చిన స్నేహితుడు ‘వీడికి అనవసరంగా గంజాయి ఇచ్చాను..? బుర్ర పాడు చేస్తున్నాడు.’ అంటూ తల పట్టుకొని కూర్చుంటాడు. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ కాగా.. సజ్జనార్ ఘాటుగా ట్వీట్ చేశారు. వెర్రి వేయి రకాలు అంటే ఇదేనని.. ఇలాంటి మానసిక రోగులకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు.‘ పిచ్చి పలురకాలు.. వెర్రి వేయి రకాలు.. అంటే ఇదే! సోషల్ మీడియాలో పాపులర్ కావడానికి ఎంతకైనా తెగిస్తారా!? ఎంతో మంది యువత భవిష్యత్‌ను చిత్తు చేస్తున్న నిషేధిత డ్రగ్స్ పై వీడియోలు చేస్తూ.. సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు..పేర్కొన్నారు.



# లవ్ మ్యారేజ్ ..పెళ్లి వేడుకలో కాల్చి చంపిన తండ్రి



**ముంబై- నవభూమి:** ఒక మహిళ తన తండ్రి ఇష్టానికి వ్యతిరేకంగా ప్రేమ పెళ్లి చేసుకున్నది. బంధువుల ఇంట్లో జరిగే పెళ్లి వేడుక కోసం భర్తతో కలిసి వెళ్లింది. ఈ సంగతి తెలుసుకున్న మహిళ తండ్రి అక్కడకు వచ్చాడు. రివాల్వర్‌తో కాల్పులు జరిపి కుమార్తెను హత్య చేశాడు. మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 24 ఏళ్ల తృప్తి, 28 ఏళ్ల అవినాష్ వాగ్ రెండేళ్ల కిందట లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. తృప్తి తండ్రైన రిటైర్డ్ సీఆర్పీఎఫ్ ఎస్ఐ కిరణ్ మాంగ్లే వారి ప్రేమ పెళ్లిని వ్యతిరేకించాడు.కాగా, శనివారం రాత్రి చోప్డాలో అవినాష్ సోదరి హల్దీ కార్యక్రమం జరిగింది. తృప్తి, అవినాష్ ఈ వేడుకకు హాజరయ్యారు. తృప్తి తండ్రి కిరణ్‌కు ఈ విషయం తెలిసింది. దీంతో పెళ్లి జరిగే ఆ ప్రాంతానికి అతడు చేరుకున్నాడు. తన సర్వీస్ రివాల్వర్‌తో కుమార్తె తృప్తిపై కాల్పులు జరుపడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. భార్యను కాపాడే ప్రయత్నంతో అవినాష్ కూడా కాల్పుల్లో గాయపడ్డాడు.మరోవైపు పెళ్లి వేడుకలో పాల్గొన్న అతిథులు ఇది చూసి ఆగ్రహానికి గురయ్యారు. కాల్పులు జరిపిన కిరణ్‌ను పట్టుకుని కొట్టారు. దీంతో అతడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. కాల్పుల సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. తృప్తి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాల్పుల్లో గాయపడిన అవినాష్‌తోపాటు పెళ్లి అతిథులు కొట్టడంతో గాయపడిన కిరణ్‌ను జల్గావ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## యుద్ధం అవసరం లేదన్న సిద్ధరామయ్య.. పాక్ మీడియాలో కథనాలు



**బెంగళూరు - నవభూమి:** కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలు వివాదస్పదమయ్యాయి. పహల్గామ్ ఉగ్రదాడిపై ఆయన మాట్లాడారు. పాకిస్థాన్‌పై యుద్ధం చేయాల్సిన అవసరం లేదని అన్నారు. 'కఠినమైన భద్రతా చర్యలు చేపట్టాలి. మేం యుద్ధానికి అనుకూలం కాదు. శాంతి ఉండాలి. ప్రజలు సురక్షితంగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి' అని అన్నారు.కాగా, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యలను జియో న్యూస్‌తో సహా పాకిస్థాన్ మీడియా కవర్ చేశాయి. 'భారతదేశంలో యుద్ధానికి వ్యతిరేకంగా స్వరాలు' అన్న హెడ్డింగ్‌తో వార్తలు ప్రసారం చేశాయి. దీంతో సిద్ధరామయ్యపై విమర్శలు వెల్లువెత్తాయి. కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఆయనపై మండిపడ్డారు. 'సిద్ధరామయ్యకు సరిహద్దుల నుంచి పెద్ద చీర్స్! పాకిస్థానీ మీడియా సిద్ధరామయ్యను ప్రశంసించింది' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. పాక్ మీడియా వీడియో క్లిప్‌ను షేర్ చేశారు.మరోవైపు తన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్ని రేపడంతో సీఎం సిద్ధరామయ్య స్పందించారు. యుద్ధానికి వెళ్లకూడదని తాను ఎప్పుడూ చెప్పలేదన్నారు. 'పాకిస్థాన్‌తో మనం యుద్ధం చేయకూడదని నేను ఎప్పుడూ చెప్పలేదు. యుద్ధం పరిష్కారం కాదని మాత్రమే నేను చెప్పా. పర్యాటకులకు రక్షణ కల్పించాలి. ఇది ఎవరి బాధ్యత? ఇంటెలిజెన్స్ వైఫల్యం ఉంది. భారత ప్రభుత్వం తగినంత భద్రత కల్పించలేదు. యుద్ధానికి సంబంధించినంత వరకు, అది అనివార్యమైతే, మనం యుద్ధానికి దిగాలి' అని అన్నారు.

## మా 130 అణ్వాయుధాలు భారత్ కోసమే..! పాక్ మంత్రి అబ్బాసి ప్రేలాపనలు..!



**జమ్ము కశ్మీర్:నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారాయి. భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంటుండడంతో దాయాది దేశం ఆందోళనకు గురవుతున్నది. అయితే, ఆ దేశ నాయకులు మాత్రం భారత్‌పై ప్రేలాపనలు పేలుతూనే ఉన్నారు. తాజాగా పాకిస్తాన్ మంత్రి హనీఫ్ అబ్బాసి అణుదాడి చేస్తామంటూ భారత్‌కు హెచ్చరికలు చేశారు. పాకిస్తాన్ వద్ద భారత్ కోసం 130 అణ్వాయుధాలను సిద్ధం చేసి ఉంచామన్నారు. భారత్ సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దుచేసి నీటి సరఫరాను నిలిపివేస్తే.. యుద్ధానికి సిద్ధంగా ఉండాలన్నారు. మన వద్ద ఉన్న సైనిక పరికరాలు, మన వద్ద ఉన్న క్షిపణులు ప్రదర్శన కోసం కాదని.. మన అణ్వాయుధాలను ఎక్కడ మోహరించామో ఎవరికీ తెలియదతెలియదన్నారు.నేను మళ్లీ చెబుతున్నాను ఈ బాలిస్టిక్ క్షిపణులు అన్నీ భారతదేశాన్ని లక్ష్యంగానే ఉన్నాయన్నారు. వాణిజ్య సంబంధాలు, భారత్ తన చర్యల కఠిన పరిణామాలను గ్రహించడం ప్రారంభించిందని హనీఫ్ అబ్బాసి పేర్కొన్నారు. పాకిస్తాన్ వైమానిక ప్రాంతాన్ని మూసివేయడంతో రెండు రోజుల్లోనే భారత విమానయాన రంగంలో గందరగోళం నెలకొందని.. పరిస్థితి ఇలాగే కొనసాగితే, భారత విమానయాన సంస్థలు పది రోజుల్లోనే దివాళా తీస్తాయన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి భారతదేశం తన భద్రతా వైఫల్యాలను అంగీకరించడానికి బదులుగా పాకిస్తాన్‌ను నిందిస్తోందన్నారు. భారతదేశం నిర్ణయాల తర్వాత పాకిస్తాన్ సైతం అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## తిరువనంతపురం ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు..



**చెన్నై- నవభూమి:** కేరళ లోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. ఎయిర్‌పోర్టును బాంబులతో పేల్చివేయబో తున్నామని ఉదయం ఓ ఆగంతకుడు ఎయిర్‌పోర్టు వెబ్‌సైట్‌కు మెయిల్ పంపించాడు. దాంతో ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది అప్రమత్తయ్యారు.బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌ను పిలిపించి ఎయిర్‌పోర్టు అంతటా అణువణువూ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎక్కడా బాంబు లేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించే పనిలోపడ్డారు.

## ఢిల్లీలో ఎంత మంది పాకిస్తాన్ జాతీయులు ఉన్నారంటే..? ఐబీ జాబితాలో షాకింగ్ గణాంకాలు..!

**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాం దాడి ఘటన అనంతరం పాకిస్తాన్‌పై భారత్ కఠినంగా వ్యవహరిస్తూ వస్తున్నది. ఈ క్రమంలో పాకిస్తానీలను స్వదేశానికి పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనేక రాష్ట్రాల్లో ఆయా ప్రాంతాల్లో ఉంటున్న పాకిస్తానీ పౌరులను తిరిగి ఆ దేశానికి పంపే పనిలో పడ్డాయి. అయితే, దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 5వేల మంది పాకిస్తానీలు పౌరులు ఉన్నట్లుగా గుర్తించారు. భారత నిఘా విభాగం ఈ మేరకు జాబితాను ఢిల్లీ పోలీసులకు అందించింది.ఢిల్లీలో నివాసం ఉంటున్న 5వేల మంది పాకిస్తానీ పౌరుల జాబితాను ఐబీ ఢిల్లీ పోలీసులకు అందించి.. స్వదేశానికి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నది. విదేశీయుల ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఈ జాబితాను ఢిల్లీ పోలీసుల ప్రత్యేక శాఖకు అందించింది. జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. జాబితాలో దీర్ఘకాలిక వీసాలు కలిగి ఉన్న, మినహాయింపు పొందిన హిందూ పాకిస్తానీ జాతీయుల పేర్లు సైతం ఉన్నారు. ఈ జాబితా ధ్రువీకరణ కోసం సంబంధిత జిల్లా అధికారులకు అందించి.. వారంతా స్వదేశానికి తిప్పి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్య, ఈశాన్య జిల్లాల్లో పాకిస్తానీ జాతీయుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. ఈ విషయంపై సమావేశం ఏర్పాటు చేశామని.. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించినట్లు ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు.పరిస్థితిని సీనియర్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లుగా తెలిపారు. ఢిల్లీలో నివసిస్తున్న ఈ పాకిస్తానీ పౌరుల గురించి సమాచారాన్ని సేకరించి, వీలైనంత త్వరగా భారతదేశం విడిచి వెళ్లేలా ఢిల్లీ పోలీస్, ఇంటెలిజెన్స్ బ్యూరో ప్రత్యేక శాఖ అధికారులు అప్పగించారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీసిన విషయం తెలిసిందే.

# భారత్-పాక్ మధ్య యుద్ధ భయాలు.. బంకర్లు సిద్ధం చేసుకుంటున్న సరిహద్దు ప్రజలు



**జమ్ము కశ్మీర్:నవభూమి:** భారత్, పాక్ మధ్య ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణంతో సరిహద్దుల్లోని ప్రజలు అలర్ట్ అయ్యారు. జమ్మూ కాశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో ఉండే ప్రజలు.. ఇప్పుడు బంకర్లను శుభ్రం చేసి.. వాటిని సిద్ధంగా ఉంచుకుంటున్నారు. ఏ క్షణమైనా యుద్ధం వచ్చే అవకాశాలు ఉన్నాయనే వార్తలు రావడంతో వారు అప్రమత్తం అవుతున్నారు. ప్రస్తుతం భారత్ పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక సరిహద్దుల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో నిత్యం కాల్పుల మోతలతో దద్దరిల్లే సరిహద్దు గ్రామాలు గత కొన్నేళ్లుగా ప్రశాంతంగా ఉన్నాయి. 2021లో భారత్, పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతో ఆ ప్రాంత ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. కానీ ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడితో మళ్లీ వారి భయాలు మొదటికి వచ్చాయి. దీంతో బంకర్లను సిద్ధం చేసుకుంటున్నారు.ఇక పంట కోతల సమయం కావడంతో.. ఒకవైపు పొలాల్లో పంటలు కోసుకుంటునే.. మరోవైపు తమను కాపాడుకునేందుకు ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన బంకర్లను శుభ్రం చేసి వాటిలో తలదాచుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బంకర్లను మహిళలు శుభ్రం చేస్తుండగా.. పురుషులు మాత్రం వ్యవసాయ పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు. తాము నిరాయుధులమైన సైనికులమని.. దేశం కోసం పోరాడటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని.. పాక్ ఉగ్రదాడికి తగిన బుద్ధి చెప్పాలని సరిహద్దు ప్రజలు కోరుతున్నారు. గతంలో భద్రతా దళాల నుంచి "కాల్పులు విరమించండి" అనే హెచ్చరికలు వచ్చేవని.. ఇప్పుడు మళ్లీ అలాంటి పరిస్థితులు వస్తాయేమోనని భయంగా ఉందని స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత్, పాక్ ఉద్రిక్తతల మధ్య క్షణక్షణానికి పరిస్థితులు మారుతున్నాయని.. సరిహద్దు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బల్బీర్ కౌర్ పేర్కొన్నారు. సరిహద్దు అవతలి నుంచి కాల్పులు జరిగితే తలదాచుకోవడానికి తాము బంకర్లను సిద్ధం చేసుకుంటున్నామని చెప్పారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని.. పహల్గామ్ వంటి దుర్ఘటనలను తాము ఎప్పటికీ సహించేది లేదని.. ఉగ్రవాదులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఉగ్రవాదంపై చేస్తున్న పోరాటంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దానికి.. తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

మరోవైపు.. ప్రస్తుతం సరిహద్దుల్లో పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. పాక్ సైన్యం వరుసగా రెండో రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. అయితే ఈ దాడులను భారత సైన్యం ధీటుగా తిప్పికొడుతోంది. సరిహద్దు గ్రామాల్లో ఉగ్రదాడులు, కాల్పుల నుంచి ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం గత కొన్నేళ్లుగా బంకర్లను నిర్మిస్తోంది. 2017లోనే దాదాపు 14 వేల బంకర్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వగా.. ఆ తర్వాత మరో 4 వేల బంకర్లు నిర్మించాలని నిర్ణయం తీసుకుంది.

## పహల్గామ్ ఉగ్రదాడికి.. స్టూడెంట్ వీసాకు ఉన్న లింక్ ఏంటి?



**జమ్ము కశ్మీర్:నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడిపై భద్రతా బలగాలు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. ఈ దాడిలో స్థానిక ఉగ్రవాది అదిల్ అహ్మద్ థోకర్‌ను కీలక పాత్రధారుల్లో ఒక్కడిగా భావిస్తున్నారు. మిని స్విట్జర్లాండ్‌గా గుర్తింపు పొందిన బైసరన్ లోయలో మారణహోమానికి తెగబడి.. 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీసిన ఐదుగురు ముష్కరుల్లో అతడూ ఉన్నాడు. అనంత్‌నాగ్ జిల్లా బిజ్‌బేహారా మండలంలోని గుర్రే గ్రామానికి చెందిన థోకర్ 2018లో విద్యార్థి వీసాతో పాకిస్థాన్ వెళ్లినట్టు గుర్తించారు. ఇంటెలిజెన్స్ అధికారుల ప్రకారం.. పాక్ వెళ్లడానికి ముందే అతడు తీవ్రవాద భావజాలానికి లోనయ్యాడని గుర్తించారు. థోకర్ ఇప్పటికే పాక్ ఆధారిత నిషేధిత ఉగ్ర సంస్థలతో సంబంధాలు కొనసాగిస్తున్నాడని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.

పాకిస్థాన్ వెళ్లిన తర్వాత, అదిల్ అహ్మద్ థోకర్ కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులతో సంబంధాలను పూర్తిగా తెంచుకున్నాడు. ఎనిమిది నెలలపాటు ఆయన కదలికలపై ఎలాంటి సమాచారం లభ్యం కాలేదు. అతడిన డిజిటల్ ట్రాక్‌ను కూడా నిఘా సంస్థలు కనుగొనలేకపోయాయి. బిజ్‌బేహారాలోని ఆయన ఇంటిపై ప్రత్యేక నిఘా కూడా ఫలితం ఇవ్వలేదు. నిఘా వర్గాల ప్రకారం... అజ్ఞాత కాలంలో థోకర్ లష్కరే తొయిబా ఉగ్రవాద సంస్థ హ్యాండ్లర్లతో ప్రభావితమై ఆయుధ శిక్షణ పొందాడు. అయితే, భారత్‌లోనే 2024 చివరినాటికి థోకర్ మళ్లీ ఇంటెలిజెన్స్ రాడార్‌లోకి వచ్చాడు.

**భారత్‌కు రాక**

అధికారుల వెల్లడించిన వివరాల ప్రకారం.. 2024 అక్టోబరులో థోకర్ పూంఛ్-రాజౌరీ సెక్టార్ నుంచి నియంత్రణ రేఖ దాటి భారత్‌లో ప్రవేశించాడు. ఈ ప్రాంత భూభాగం దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు కారణంగా నిఘాకు క్లిష్టమైన ఈ మార్గాన్ని అక్రమచొరబాటు దారులు వాడుతున్నారు.

థోకర్‌తో పాటు మరో ముగ్గురు ఉగ్రవాదులు ఉన్నారు. వారిలో ఒకరు పాకిస్థాన్ పౌరుడైన హాషిమ్ ముసా అలియాస్ సులేమాన్. పహల్గామ్ ఉగ్రదాడిలో అతడ్ని కూడా ప్రధాన నిందితుడిగా గుర్తించారు. ముసా భారతదేశంలోకి ప్రవేశించడానికి థోకర్ కీలక పాత్ర పోషించాడని నమ్ముతున్నారు.

జమ్మూ కశ్మీర్‌లో ప్రవేశించిన తర్వాత, థోకర్ అడవి మార్గాల ద్వారా ఎవరికి కంటపడకుండా తప్పించుకుంటూ ప్రయాణించాడు. కిష్టావర్‌లో కొద్దివారాలు పాటు కనిపించిన తర్వాత అనంతనాగ్ వైపు చేరినట్టు ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానిస్తున్నాయి. అతడు త్రాల్ లేదా పాత ఉగ్ర మార్గాల ద్వారా ప్రయాణించి ఉండొచ్చని భావిస్తున్నాయి.

**విదేశీ ఉగ్రవాదికి ఆశ్రయం**

అనంతనాగ్ చేరుకున్న తర్వాత థోకర్ అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయాడు. అతడు తనతో వచ్చిన పాకిస్థానీయుల్లో కనీసం ఒకరిని అడవిలో గుహలలో లేదా వేరొక గ్రామాలలో ఆశ్రయం ఇచ్చినట్టు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి.

ఈ సమయంలో థోకర్ పాత నిద్రాణంగా ఉన్న ఉగ్రవాద సమూహాలతో తిరిగి సంబంధాలు పునరుద్ధరించినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. భారీ ఎత్తున దాడికి సన్నాహకాలు చేశాడని నమ్ముతున్నారు. ఈ కాలంలో వార్షిక అమరనాథ్ యాత్ర ముగిసిన తర్వాత పహల్గామ్ వంటి ప్రాంతాలు మళ్లీ సందర్శకులను ఆకర్షించడం ప్రారంభమైంది. 2025 మార్చిలో బైసరన్ లోయలో పర్యాటకుల కోసం పునః ప్రారంభమైంది. ఇది థోకర్, అతడి బృందానికి అవకాశాన్ని అందించిందని నమ్ముతున్నారు.

**బైసరన్ దాడి**

2025 ఏప్రిల్ 22న మధ్యాహ్నం 1:50 గంటల సమయంలో థోకర్ తదితరులు బైసరన్ చుట్టూ ఉన్న దట్టమైన సుసూనిత పైన్స్ అడవుల నుంచి ప్రవేశించారు. తుపాకులతో పర్యాటకులు గుమికూడిన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రత్యక్షసాక్షుల ప్రకారం, దాడి సమయంలో వారు కొంత మందిని వారి మతం గురించి ప్రశ్నించారు. కొన్నిసార్లు ఇస్లాంలోని కల్మాలు చదవమని అడిగి, చదవలేకపోయినవారిని కాల్చి చంపారు. చాలా మంది తలపై కాల్చిన గాయాలతో మరణించారు.

భద్రతా వర్గాల ప్రకారం, దాడిలో కనీసం ఐదుగురు ఉగ్రవాదులు పాల్గొన్నారు. వారు మూడు విభిన్న జోన్‌లను లక్ష్యంగా చేసుకున్నారు. మొత్తం దాడి 10 నిమిషాల కన్నా తక్కువ సమయంలో ముగిసిపోయింది. బాధితులకు సహాయం ఆలస్యం కావడంతో మృతుల సంఖ్య పెరిగింది మొత్తం 25 మంది పర్యాటకులు, ఒక స్థానిక హార్స్ రైడర్ ప్రాణాలు కోల్పోయారు.

**ప్రధాని నిందితుడు థోకరే**

జమ్మూ కశ్మీర్ పోలీసులు థోకర్‌ను బైసరన్ మారణకాండలో ప్రధాన నిందితులలో ఒకరిగా ప్రకటించారు. మిగిలిన ఇద్దరు పాకిస్థానీయులు హాషిమ్ ముసా అలియాస్ సులేమాన్, అలీ భాయ్ అలియాస్ తల్హా భాయ్. ఈ ముగ్గురి స్కెచ్‌లను విడుదల చేసిన పోలీసులు.. వారికి సంబంధించి సమాచారం ఇచ్చిన వారికి రూ. 20 లక్షల బహుమతి ప్రకటించారు. అనంతనాగ్, పహల్గామ్, పరిసర అడవి ప్రాంతాల్లో విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది.గురువారం రాత్రి, థోకర్, మరో నిందితుడు ఆసిఫ్ షేక్‌కు చెందిన ఇళ్లు పేలుళ్లలో ధ్వంసమయ్యాయి. అక్కడ దొరికిన పేలుడు పదార్థాలు భవిష్యత్తులో ఉపయోగించేందుకు గానీ లేదా రక్షణ చర్యలకుగానీ ఉంచినట్టుగా అధికారులు చెప్పారు. ఆసిఫ్ షేక్ కూడా దాడిలో లాజిస్టిక్‌కు సహాయపడినట్టు అనుమానిస్తున్నారు. ఆయన పాత్రపై విచారణ కొనసాగుతోంది.

# ఒక్క మహారాష్ట్రలోనే 5 వేలమంది పాకిస్తాన్ పౌరులు




**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణహోమానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ-సీసీఎస్ సమావేశమై 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగానే భారత్‌లోని పాక్ వాసుల వీసాలు రద్దు చేసి.. వారిని వెనక్కి వెళ్లిపోవాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాకిస్తాన్ పౌరుల వివరాలు సేకరించి.. కేంద్ర ప్రభుత్వానికి అందించాలని కేంద్రమంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఇటీవల సూచించారు. దీంతో అన్ని రాష్ట్రాల్లో ఉన్న పాకిస్తాన్ పౌరులను గుర్తించే పనిలో రాష్ట్ర ప్రభుత్వాలు పడ్డాయి. ఈ నేపథ్యంలోనే ఒక్క మహారాష్ట్రలోనే 5 వేల మంది పాకిస్తాన్ వాసులు ఉన్నారని.. ఇందులో వెయ్యి మంది స్వల్పకాలిక వీసాల మీద వచ్చినట్లు మహారాష్ట్ర మంత్రి యోగేష్ కదమ్ తెలిపారు.దేశవ్యాప్తంగా ఉన్న పౌక్ దేశస్థులు ఈనెల 27వ తేదీ(ఆదివారం) లోపు తిరిగి తమ దేశానికి వెళ్లిపోవాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇక మెడికల్ వీసాల మీద వైద్యం కోసం వచ్చిన వారికి మాత్రం మరో రెండు రోజుల సమయం ఇచ్చారు. ఇలాంటి వారు ఈనెల 29వ తేదీ లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. ఇప్పటికే భారత్, పాక్ సరిహద్దుల్లో ఉన్న అట్టారీ బోర్డర్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం మూసివేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ 5 వేల మంది పాకిస్తాన్ పౌరులు.. దేశం విడిచి వెళ్లాలని సూచించినట్లు మంత్రి యోగేష్ కదమ్ స్పష్టం చేశారు.

మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలో దీర్ఘకాలిక వీసాలపై దాదాపు 4 వేల మంది పాకిస్థానీయులు ఉండగా.. సార్క్ వీసా కింద మరో 1000 మంది ఉన్నారని తెలుస్తోంది. ఈ వెయ్యి మందిలో సినిమా ఇండస్ట్రీ, మెడికల్, జర్నలిజం, వ్యక్తిగత పనుల కోసం మహారాష్ట్రకు వచ్చిన వారు ఉన్నారని మంత్రి వెల్లడించారు. ఇందులో మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. వీరిలో కొందరు గత 8 నుంచి 10 ఏళ్లుగా మన దేశంలోనే ఉంటున్నారని మంత్రి యోగేష్ తెలిపారు. అంతేకాకుండా కొందరు పాకిస్తాన్ పౌరులు.. స్థానికంగా వివాహాలు చేసుకోగా.. మరికొందరు తమ పాకిస్తాన్ పాస్‌పోర్ట్‌ను సరెండర్ చేసి భారత పౌరసత్వం కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారని వెల్లడించారు.


ఈ సందర్భంగా.. షార్ట్ టెర్మ్ వీసాలపై భారత్‌కు వచ్చిన పాకిస్తాన్ వాసులు ఆదివారం లోగా తప్పనిసరిగా దేశం విడిచి వెళ్లిపోవాలని మంత్రి యోగేష్ కదమ్ తేల్చి చెప్పారు. అయితే మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం వచ్చిన వారికి మాత్రం మానవతా దృక్పథంతో అదనంగా మరో 2 రోజులు మాత్రమే సమయం ఇస్తామని తెలిపారు.

## ముంబై ఈడీ కార్యాలయంలో భారీ అగ్ని ప్రమాదం..



**న్యూఢిల్లీ-నవభూమి:** మహారాష్ట్ర రాజధాని ముంబై లోని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దక్షిణ ముంబైలో ఈడీ కార్యాలయం ఉన్న కైసర్-ఐ-హింద్ భవనంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తెల్లవారుజామున 2.31 గంటల సమయంలో బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ప్రమాదం చోటుచేసుకుంది.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మొత్తం 12 ఫైరింజన్‌లు, జెట్టీలు, వాటర్ ట్యాంకర్‌ల సాయంతో మంటలను ఆర్పే చర్యలు చేపట్టారు. అగ్నికీలకు పెద్ద ఎత్తున ఎగిసి పడటంతో మంటలను ఆర్పేందుకు ఫైర్ టీమ్స్ కొన్ని గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది. ఈ ప్రమాదంలో కార్యాలయంలోని పలు దస్త్రాలు కాలిపోయాయి. కాగా ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

## ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధమైన ఇండియన్ నేవీ



**జమ్ము కశ్మీర్:నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇప్పుడు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత నౌకాదళం సిద్ధమైంది. ఈ మేరకు తాజాగా అరేబియా సముద్రంలో నౌకా విధ్వంసక క్షిపణులను పరీక్షించింది. అంతేగాక ఈ విషయాన్ని సోషల్ మీడియాలో ప్రకటించింది. పహల్గాంలో ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో తన సన్నద్ధతను చాటేందుకు ఇండియన్ నేవీ తాజా పరీక్షలు నిర్వహించింది.సముద్రజలాల్లో ఎప్పుడైనా, ఎక్కడైనా భారత ప్రయోజనాలను కాపాడేందుకు తాము సిద్ధమని ఇండియన్ నేవీ ప్రకటించింది. మూడు రోజుల క్రితం కూడా భారత్ ఇదే సముద్రంలో మీడియం రేంజ్ సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్ (ఎంఆర్-ఎస్ఏఎం) తో సీ స్కిమ్మింగ్ పరీక్షను నిర్వహించింది. గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్ అయిన ఐఎన్ఎస్ సూరత్ తొలిసారి గగనతలంలో వస్తున్న లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది.ఈ విషయాన్ని ఇండియన్ నేవీ సోషల్ మీడియాలో తెలిపింది. సీ స్కిమ్మింగ్ టార్గెట్‌ను కచ్చితమైన సమన్వయంతో విజయవంతంగా ఛేదించినట్లు వెల్లడించింది. సముద్ర మార్గంలో రాడార్లను తప్పించుకోవడానికి నీటిపై అతితక్కువ ఎత్తులో వచ్చే డ్రోన్లు, క్షిపణులు లాంటి వాటిని సీ స్కిమ్మింగ్ లక్ష్యాలుగా పేర్కొంటారు.

## హక్కుల గురించి ప్రతి పౌరుడు తెలుసుకోవాలి



**న్యూఢిల్లీ-నవభూమి:** రాజ్యాంగ, చట్టబద్ధ హక్కుల గురించి తెలుసుకోవడం ప్రతి పౌరునికి చాలా ముఖ్యమని, వారి హక్కుల గురించి వారికి అవగాహన కల్పించకుంటే వాటిని అమలు చేయమని ఒత్తిడి చేయడానికి ముందుకు రారని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. గుజరాత్‌లో జరిగిన నల్సా మూడు దశాబ్దాల వేడుకలో ఆయన శనివారం ప్రసంగించారు.ప్రతి పౌరుడికి న్యాయం, ప్రతి పౌరుడికి ఉచిత న్యాయ సహాయం కోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ప్రయత్నాలు చేస్తున్నదని నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కూడా అయిన గవాయ్ పేర్కొన్నారు. పౌరులకు చట్టబద్ధంగా, రాజ్యాంగపరంగా లభించిన హక్కుల గురించి వారు తప్పనిసరిగా తెలుసుకోవాలని అన్నారు. మారుమూల ప్రాంతాలకు సేవలందించాలన్న నల్సా లక్ష్యాన్ని నెరవేరుస్తున్నామని అన్నారు.


### హక్కుల గురించి ప్రతి పౌరుడు తెలుసుకోవాలి

**న్యూఢిల్లీ-నవభూమి:** రాజ్యాంగ, చట్టబద్ధ హక్కుల గురించి తెలుసుకోవడం ప్రతి పౌరునికి చాలా ముఖ్యమని, వారి హక్కుల గురించి వారికి అవగాహన కల్పించకుంటే వాటిని అమలు చేయమని ఒత్తిడి చేయడానికి ముందుకు రారని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. గుజరాత్‌లో జరిగిన నల్సా మూడు దశాబ్దాల వేడుకలో ఆయన శనివారం ప్రసంగించారు.ప్రతి పౌరుడికి న్యాయం, ప్రతి పౌరుడికి ఉచిత న్యాయ సహాయం కోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ప్రయత్నాలు చేస్తున్నదని నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కూడా అయిన గవాయ్ పేర్కొన్నారు. పౌరులకు చట్టబద్ధంగా, రాజ్యాంగపరంగా లభించిన హక్కుల గురించి వారు తప్పనిసరిగా తెలుసుకోవాలని అన్నారు. మారుమూల ప్రాంతాలకు సేవలందించాలన్న నల్సా లక్ష్యాన్ని నెరవేరుస్తున్నామని అన్నారు.

## 48 గంటల్లో పొలాలు ఖాళీ చేయండి.. పంజాబ్ రైతులకు బీఎస్ఎఫ్ సూచన

**పహల్గాం-నవభూమి:** దాడికి ప్రతీకారంగా భారత్ యుద్ధ సన్నాహాల్లో మునిగిపోయింది. త్రివిధ దళాలను రెడీ చేసింది. ఏ క్షణమైనా దాయాది దేశం పాకిస్థాన్ కు బుద్ధి చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇందులో భాగంగా పంజాబ్ రైతులకు బీఎస్ఎఫ్ తాజాగా నోటీసులు జారీ చేసింది. ఇండో-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో48 గంటల్లో జీరో లైన్ వెంబడి పొలాలను క్లియర్



చేయండి అని రైతులకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సూచించింది. సరిహద్దు భద్రతా దళం జీరో లైన్ వెంబడి ఉన్న రైతులకు ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. వేలాది మంది పంజాబ్ రైతులు జీరో లైన్ వెంబడి సరిహద్దు ప్రాంతాలకు సమీపంలో తమ పొలాలను కలిగి ఉన్నారు. వారు పండించిన పంటలు ఇప్పుడు చాలా వరకూ చేతికందాయి. దీంతో వెంటనే పంటను కోసి ఇళ్లకు తెచ్చుకోవాలని, లేదంటే, నిలువెత్తు పంటల్లో విద్రోహులు దాక్కుని దాడి చేసే ప్రమాదముందని సదరు రైతులకు ఇచ్చిన నోటీసుల్లో బీఎస్ఎఫ్ దళం వివరణ ఇచ్చింది. ఇండియా - పాకిస్తాన్ మధ్య 530 కి.మీ పొడవైన అంతర్జాతీయ సరిహద్దు ఉంది. దీని వెంబడి దాదాపు 45,000 ఎకరాల భూమిని మన రైతులు సాగు చేస్తున్నారు. అమృత్‌సర్‌లోని రౌడా వాలా ఖుర్ద్‌లోని స్థానిక గురుద్వారా కూడా %దీూఖీ% నోటీసుకు సంబంధించి ప్రకటన చేసింది.



## వర్గీకరణలో 'వాటా'లు సరిచేయాలి!

వర్గీకరణ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ముందడుగు వేయడం హర్షించదగ్గ విషయమే అయినప్పటికి జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ నివేదికలో ఉన్న అంశాల మీద ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయకపోవడం, అమలు చేయాల్సిన అంశాల మీద చర్చించి నిర్దిష్ట నిర్ణయాలను తీసుకోకపోవడం విచారకరం.ఏకసభ్య కమిషన్ నాలుగు ప్రధానమైన సిఫారసులలో క్రిమిలేయర్ ప్రతిపాదనను తిరస్కరించి మిగతా మూడు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. దీని ప్రకారం గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3గా ఎస్సీ వర్గీకరణ జరిగింది. 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను మూడు గ్రూపులుగా వర్గీకరించి వాటాలు కేటాయించారు. మొదటి గ్రూప్‌కు అత్యంత వెనుకబడిన షెడ్యూల్డు కులాలుగా, రెండవ గ్రూప్‌కు మధ్యస్థంగా లబ్ధి పొందిన షెడ్యూల్డు కులాలుగా, మూడవ గ్రూప్‌కు మెరుగైన ప్రయోజనాలు పొందిన షెడ్యూల్డు కులాలుగా కమిషన్ పేరు పెట్టింది. ఈ మూడు గ్రూపుల్లో గ్రూప్-1 కేటగిరీలో 15 కులాలను గుర్తించి వారికి 1శాతం (జనాభా 1,71,625), గ్రూప్-2లో మధ్యస్థంగా లబ్ధి పొందిన 18 కులాలను గుర్తించి వారికి 9 శాతం (జనాభా 32,74,377), మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలుగా 26 కులాలను గుర్తించి వారితో గ్రూప్-3 ఏర్పాటు చేసి 5శాతం (జనాభా 17,71,682) రిజర్వేషన్లు కల్పించారు. ఈ నివేదికలో ఒక గ్రూప్‌కు వెనుకబాటుతనం ఆధారంగా, మరొక గ్రూప్‌కు జనాభా ఆధారంగా, మరొక గ్రూప్‌కు ఏ ఆధారం లేకుండా వర్గీకరణ చేశారు. అందువల్ల ఈ మొత్తం వర్గీకరణ ప్రక్రియలో కమిషన్ నిష్పక్షపాత కొలమానాన్ని, సూత్రబద్ధతను ఎంచుకోలేదనేది స్పష్టం.ఎస్సీ వర్గీకరణలో గ్రూప్-1లో చేర్చబడ్డ 15 కులాలలో ప్రధానంగా మాదిగ అనుబంధ కులాల్కెన బేడ బుడగ జంగం, దక్కలి, మాతంగిలతో పాటు మరికొన్ని కులాలను తీసుకున్నారు. అయితే ఇదే గ్రూపులో మాల అనుబంధ కులాల్కెన మన్నే, పంబాల కులాలను కూడా చేర్చారు. దీనివల్ల గ్రూప్-1కు కేటాయించబడిన 1శాతం రిజర్వేషన్ కూడా మాల అనుబంధ కులాల్కెన పంబాల, మన్నె కులాలకు చెందేలా కుట్రపూరితమైన వ్యూహ రచన జరిగింది. 1998లోనే మూడవ శ్రేణి అయిన 'సి' గ్రూపులో చేర్చబడ్డ మాల, పంబాల కులాలను నేడు 2025లో అత్యంత వెనుకబడ్డ కులాలుగా గుర్తించి గ్రూప్-1లో చేర్చడం అతిపెద్ద తప్పిదం.ఇక రెండో విషయానికొస్తే రిజర్వేషన్లలో మధ్యస్థంగా లబ్ధి పొందిన 18 కులాలను గుర్తించారు. గ్రూప్-2లో ఉన్న ఈ కులాలకు రిజర్వేషన్లు కేటాయించడంలో మధ్యస్థమైన సూత్రబద్ధతను ఎంచుకోలేదు. అత్యంత వెనుకబడిన వారికి, అత్యంత అభివృద్ధి చెందినవారికి మధ్యగా ఉన్న ఈ మధ్యస్థ కులాల గ్రూప్‌కు రిజర్వేషన్లు కేటాయింపులు కూడా సగటు మధ్యస్థంగానే ఉండడం ఏ కోణంలో చూసినా న్యాయబద్ధం. కానీ ఆ సగటు మధ్యస్థమైన విధానాన్ని రిజర్వేషన్ల కేటాయింపుల్లో పాటించలేదు. గ్రూప్-2లో ఉన్న మధ్యస్థ కులాలకు 1శాతం రిజర్వేషన్ కేటాయించడానికి 3,63,819 జనాభాను ఆధారంగా తీసుకున్నారు. అదే మెరుగైన ప్రయోజనాలు పొందిన గ్రూప్-లో ఉన్న కులాలకు 1శాతం రిజర్వేషన్ కేటాయించడానికి 3,54,336 జనాభాను ఆధారంగా తీసుకున్నారు. ఇక్కడ రెండింటికి మధ్య వ్యత్యాసం దాదాపు 10 వేల జనాభా. న్యాయబద్ధంగా అయితే మెరుగైన కులాలకు రిజర్వేషన్ కేటాయించడానికి ఎక్కువ జనాభాను, మధ్యస్థంగా లబ్ధి పొందిన కులాలకు రిజర్వేషన్ కేటాయించడానికి తక్కువ జనాభాను పరిగణనలోకి తీసుకోవాలి. దీనికి విరుద్ధంగా మెరుగైన ప్రయోజనాలు పొందిన కులాలకు తక్కువ జనాభాను (3,54,336), మధ్యస్థంగా ప్రయోజనాలు పొందిన కులాలకు (3,63,819) జనాభాను ఎక్కువగా పరిగణలోకి తీసుకున్నారు. ఇది సహజ న్యాయ సూత్రాలను పూర్తి విరుద్ధచర్య.గ్రూప్-3 కేటగిరిలో మాలలతో పాటు మిగతా 25 కులాలను చేర్చి 5శాతం రిజర్వేషన్లు కేటాయించారు. ఇక్కడ ఎస్సీలలో జనాభా ప్రకారం మూడవ అత్యంత జనాభా కలిగి ఉన్న నేతకాని కులానికి మరికొన్ని కులాలను కలిపి ఒక ప్రత్యేకమైన గ్రూపును ఏర్పాటు చేయడానికి అవకాశం, ఆస్కారం ఉన్నాయి. మాల సామాజిక వర్గంతో పోల్చితే ఈ గ్రూపులోని నేతకాని, మహార్, హొలియదాసరి, మాల దాసరి, మితయల్వార్ మొదలగు కులాలు తీవ్ర వెనుకబాటుతనంతో ఉన్నాయి. కానీ కమిషన్ వీరి ఆకాంక్షను పట్టించుకోలేదు. గతంలో మాదిగలతో కలిసి ఉన్న బుడగ జంగం కులానికి 1,11,710 జనాభా ఉందనే కారణంతో ప్రత్యేకంగా వేరు చేసి వారికి తోడుగా మరికొన్ని వెనుకబడిన కులాలను చేర్చి గ్రూప్-1 ఏర్పాటు చేసి ఒక శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడు బుడగజంగం కులం కన్నా ఎక్కువ జనాభా 1,33,072 ఉన్న నేతకాని కులాన్ని మాలల నుండి వేరు చేసి వారికి మరికొన్ని వెనుకబడ్డ కులాలను కలిపి ఒక ప్రత్యేకమైన గ్రూపు చేసి వారికి కూడా ఒక శాతం రిజర్వేషన్ ఎందుకు ఇవ్వలేదు?మాలల్ని ఇంకొన్ని మెరుగైన కులాలను గ్రూప్-4గా ఏర్పాటు చేసి వారికి ఎంత శాతం రిజర్వేషన్లు న్యాయబద్ధంగా చెందుతాయో ఆ ప్రకారం కేటాయింపులు చేయాలి. ఈ ప్రకారం గతంలో మాదిరిగా ఎస్సీ వర్గీకరణను నాలుగు గ్రూపులుగా అమలు చేయవచ్చు. మాలల జనాభా, మాల అయ్యవార్లతో కలిపి 15,27,143 మాత్రమే. కానీ వీరి రిజర్వేషన్ శాతాన్ని పెంచడం కోసం పక్షపాత దృష్టితో ఆలోచించి నేతకానితో పాటు మరికొన్ని కులాలను కలిపి గ్రూపులు ఏర్పాటు చేశారని నివేదికను బట్టి అర్థమవుతుంది.కమిషన్ సిఫారసుల ప్రకారం ప్రభుత్వం ఆమోదించిన ఎస్సీ వర్గీకరణలో అనేక లోపాలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాలలకు 6శాతం రిజర్వేషన్లు ఎస్సీ వర్గీకరణలో కేటాయించబడ్డాయి. ఇప్పుడు తెలంగాణలోనూ 6శాతం రిజర్వేషన్లు (గ్రూప్-3లో 5శాతం, పంబాల, మన్నె కులాలు ఉన్న గ్రూప్-1లో 1శాతం మొత్తం 6శాతం) కేటాయించబడ్డాయి. అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభా యూనిట్‌గా తీసుకుంటే 6శాతం రిజర్వేషన్లు లభించాయి. కానీ తెలంగాణ జనాభాను యూనిట్‌గా తీసుకుంటే యథావిధిగా 6శాతం ఎలా కేటాయించబడ్డాయనేది అర్థం కాని అంశం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాలల జనాభాతో పోల్చితే తెలంగాణలో మాలల జనాభా చాలా తక్కువ. అందువల్ల రిజర్వేషన్ల వర్గీకరణ కేటాయింపుల్లో 6శాతం కన్నా తక్కువ వాటా రావాలి.ఎవరికి సంతృప్తి మిగల్చని పద్ధతిలో ఎస్సీ వర్గీకరణ చేయడం వల్ల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాధించేది ఏమి ఉన్నదో ఆలోచన చేసుకోవాలి. ఈ మొత్తం నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్టమైన అంచనాకు వచ్చిన ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ వివిధ కులాల నేతలతో ముఖ్యమంత్రిని స్వయంగా కలిశారు. కమిషన్ నివేదికలో లోపాలను ముఖ్యమంత్రికి సవివరంగా వివరించారు. ముఖ్యమంత్రి సానుకూల దృక్పథంతో ఏకసభ్య కమిషన్ గడువును పొడగించి మంచి నిర్ణయం తీసుకున్నారు. అయితే అంతిమంగా లోపాలు సవరించబడాలి. మార్పులు లేకుండా మళ్లీ పాత నివేదికనే అమలు చేస్తే ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డెడ్ అన్నట్లుగా ఉంటుంది.

# సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ - భారతదేశ భవితకు నూతన పథం



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు వేగంగా మారిపోతున్నాయి. గతంలో వ్యవసాయం, పరిశ్రమలు మాత్రమే ఆర్థిక ప్రగతికి పట్టుకొమ్మలు అనుకునేవాళ్లం. ఆ తర్వాత సేవల రంగం, సమాచార సాంకేతికత రంగం ఆధిపత్యం చెలాయించాయి. ఇప్పుడు 21వ శతాబ్దంలో, మానవ మేధస్సు, కల్పన, ప్రతిభ నుంచి ఉద్భవించే సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఒక నూతన శక్తిగా ఆవిర్భవిస్తోంది. ఇది కేవలం కళలు, సంస్కృతికి సంబంధించిన అంశం కాదు. ఇది ఆర్థికాభివృద్ధికి, లక్షలాది మందికి ఉపాధి కల్పనకు, దేశం యొక్క అంతర్జాతీయ ప్రతిష్టను పెంచడానికి ఒక శక్తిమంతమైన సాధనం. అపారమైన సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యం, విశాలమైన యువ జనాభా కలిగిన భారతదేశానికి ఈ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఒక అద్భుతమైన అవకాశాల గని. అయితే, ఈ అవకాశాన్ని మనం ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటున్నామనేది మనందరం ప్రశ్నించుకోవాల్సిన అంశం.సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ అంటే ఏమిటి. దాని విస్తృతి ఎంత ?

ఇది వ్యక్తిగత సృజనాత్మకత, నైపుణ్యం, ప్రతిభ ఆధారంగా అభివృద్ధి చెందే అన్ని రకాల పరిశ్రమల సమూహం.మేధో సంపత్తి ద్వారా ఆర్థిక విలువను సృష్టిస్తుంది. హస్తకళలు, పెయింటింగ్, శిల్పకళ, మ్యూజియంలు, చారిత్రక ప్రదేశాలు వంటి కళలు సాంస్కృతిక వారసత్వంబీ సంగీతం, నృత్యం , థియేటర్, ఒపేరా వంటి ప్రదర్శన కళలు, పుస్తకాలు , వార్తాపత్రికలు, మ్యాగజీన్స్, రేడియో , టెలివిజన్ వంటి మీడియా ప్రచురణలుబీ చలనచిత్రాలు , యానిమేషన్, డాక్యుమెంటరీలు, వీడియో కంటెంట్‌బీ ఆర్కిటెక్చర్, డిజైన్, గ్రాఫిక్, ఫ్యాషన్, ఇంటీరియర్, ప్రకటనలు , మార్కెట్ రీసెర్చ్‌బీ కంప్యూటర్ గేమ్స్, సాఫ్ట్‌వేర్ డిజైన్, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ వంటి సాఫ్ట్ గేమింగ్ లాంటి విభిన్న రంగాలు ఈ వ్యవస్థలో ఇమిడి ఉన్నాయి. డిజిటల్ విప్లవం, ఇంటర్నెట్ వ్యాప్తి సృజనాత్మక ఉత్పత్తులు సేవలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా చేరడానికి మార్గం సుగమం చేశాయి.

**ప్రపంచంలో...**

యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యు.ఎన్.సి.టి.ఎ.డి) క్రియేటివ్ ఎకానమీ ఔట్‌లుక్ 2024 ప్రకారం సృజనాత్మక సేవలలో ప్రపంచ వాణిజ్యం 2022లో 1.4 ట్రిలియన్లకు చేరుకుంది ఇది 2017 నుండి 29% పెరుగుదల నమోదు చేసింది.



సృజనాత్మక వస్తువుల ఎగుమతులు కూడా 19% పెరిగి, మొత్తం 713 బిలియన్లకు చేరుకున్నాయి. సమిష్టిగా, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు వార్షిక ఆదాయాలలో \$-2 ట్రిలియన్లకు పైగా ఉత్పత్తి చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇస్తుంది. ఈ రంగానికి అత్యంత ప్రముఖ సహకారులు సాఫ్ట్‌వేర్ సేవలు (41.3%), పరిశోధన-అభివృద్ధి (30.7%), ప్రకటనలు , మార్కెట్ పరిశోధన నిర్మాణం (15.5%)గా ఉన్నాయి. కోవిడ్ అనంతర కాలంలో డిజిటలైజేషన్ వేగవంతం కావడంతో ఈ రంగం ఊపందుకుంది. ఈ గణాం కాలు సృజనాత్మకత అనేది ఎంత శక్తిమంతమైన ఆర్థిక వనరో తెలియజేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుం టున్నాయి.

**భారతదేశానికి ఎందుకు కీలకం?**

మన దేశం అపారమైన సాంస్కృతిక వారసత్వం, విభిన్న కళారూపాలు, నైపుణ్యం కలిగిన హస్తకళాకారులుతో ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. మనదేశంలో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తూ ఇప్పుడు దాని విలువ %వి%30 బిలియన్లుగా ఉంది. దేశ జిడిపికి దాదాపు 2.5% తోడ్పడుతుంది. 8% మంది శ్రామిక శక్తికి జీవనోపాధిని అందిస్తుంది. ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ రంగం మాత్రమే 3,375 కోట్ల రూపాయిలుగా ఉంది. రెండు లక్షల కంటే ఎక్కువ మంది పూర్తి-సమయ కంటెంట్ సృష్టికర్తలు భారతదేశం యొక్క ప్రపంచ ఉనికికి దోహదపడుతున్నారు. గౌహతి, కొచ్చి, ఇండోర్ వంటి నగరాలు దేశవ్యాప్తంగా వికేంద్రీకృత సృజనాత్మక విప్లవానికి ఆజ్యం పోస్తూ సృజనాత్మక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇది పట్టణ ప్రాంతాలలోనే కాదు, గ్రామీణ ప్రాంతాలలో నివసించే కళాకారులు, హస్తకళాకారులకు కూడా ఉపాధి కల్పిస్తుంది. ముఖ్యంగా యువతకు, మహిళలకు ఇది పెద్ద ఎత్తున అవకాశాలు కల్పిస్తుంది. పర్యాటకం వంటి అనుబంధ రంగాలను కూడా ప్రోత్సహిస్తుంది. మన సృజనాత్మక ఉత్పత్తులు సేవలకు అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ ఉంది. దీన్ని సరైన మార్గంలో నడిపిస్తే ఎగుమతులను గణనీయంగా పెంచవచ్చు.

**ఎక్కడ వెనుకబడ్డాం?**

అవకాశాలు పుష్కలంగా ఉన్నప్పటికీ మనదేశం తన సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడంలో కొన్ని కీలక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ రంగం ఎక్కువగా అసంఘటితంగానే ఉంది. చిన్న తరహా హస్తకళాకారులు, కళాకారులు సరైన ప్రోత్సాహం, మార్కెటింగ్ మద్దతు లేకుండా తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. దీనిని సమగ్రంగా గుర్తించి, ప్రోత్సహించడానికి ఒక స్పష్టమైన, ఏకీకృత జాతీయ విధానం లేకపోవడం పెద్ద లోటు. చిన్న సృజనాత్మక సంస్థలు, వ్యక్తులకు పెట్టుబడిని పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్యాంకులు సాధారణంగా సృజనాత్మక ప్రాజెక్టులను ఆర్థికంగా మద్దతు ఇవ్వడానికి వెనుకాడుతున్నాయి. కాపీరైట్ ఉల్లంఘనలు (పైరసీ), పేటెంట్, ట్రేడ్‌మార్క్‌ల ఉల్లంఘనలు సృజనకారుల ఆదాయాన్ని ప్రోత్సాహాన్ని దెబ్బతీస్తున్నాయి. బలహీనమైన చట్ట అమలు ఒక సమస్య. సృజనాత్మక కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు (మెరుగైన స్టూడియోలు, ప్రదర్శన వేదికలు), సాంకేతిక పరిజ్ఞానం అన్ని చోట్లా అందుబాటులో లేవు. సాంప్రదాయ కళారూపాలలో నైపుణ్యం ఉన్నప్పటికీ, డిజిటల్ యుగానికి అవసరమైన కొత్త నైపుణ్యాలు (డిజిటల్ మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్ టూల్స్, గేమ్ డెవలప్‌మెంట్) పెద్ద సంఖ్యలో అందుబాటులో లేవు.

స్థానిక అంతర్జాతీయ మార్కెట్లకు సృజనాత్మక ఉత్పత్తులను అనుసంధానం చేయడంలో ఇబ్బందులు ఉన్నాయి. సరైన మార్కెటింగ్, బ్రాండింగ్ లేకపోవడం ఒక లోటు. అంతేకాకుండా ఈ రంగం యొక్క కచ్చితమైన పరిధి, ఆర్థిక సహకారం, ఎగుమతులు దిగుమతులపై సమగ్రమైన, నిరంతర గణాంకాలు ఇంకా అంతగా అందుబాటులో లేవు. నిర్దిష్ట రంగాలపై (ఉదా: రత్నాభరణాలు, వస్త్రాలు, ఐటీ సేవలు) ఎగుమతి గణాంకాలు ఉన్నా, మొత్తం సృజనాత్మక ఆర్థిక వ్యవస్థపై కచ్చితమైన శాతం చెప్పడం కష్టం. ఈ డేటా కొరత విధానాల రూపకల్పనకు ఆటంకం కలిగిస్తోంది.

సవాళ్లను అధిగమించడం:

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ఒక కీలక రంగంగా గుర్తించి దాని అభివృద్ధికి ఒక సమగ్ర జాతీయ విధానాన్ని రూపొందించాలి. ఇది వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించాలి.

సృజనాత్మక ప్రాజెక్టుల కోసం ప్రత్యేక నిధులు, గ్రాంట్లు, సులభ వడ్డీకి రుణాలు అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వెంచర్ క్యాపిటల్, ప్రైవేట్ ఈక్విటీలను ఈ రంగంలోకి ఆకర్షించాలి. కఠినమైన చట్టాలు, వాటి సమర్థవంతమైన అమలు ద్వారా పైరసీని అరికట్టాలి. సృజనకారులకు వారి హక్కులపై అవగాహన కల్పించాలి. సృజనాత్మక కేంద్రాలు, ఇంక్యుబేటర్లు, సహోద్యోగ స్థలాలు, ప్రదర్శన వేదికలు, డిజిటల్ ల్యాబ్‌లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాలి. సాంప్రదాయ నైపుణ్యాలతో పాటు, డిజిటల్ కంటెంట్ క్రియేషన్, గ్రాఫిక్ డిజైన్, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ అందించే ప్రత్యేక కోర్సులను రూపొందించాలి. పాఠశాల స్థాయి నుంచే సృజనాత్మకతను ప్రోత్సహించాలి..సృజనాత్మక ఉత్పత్తులను ప్రదర్శించడానికి, విక్రయించడానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లను ప్రోత్సహించాలి. అంతర్జాతీయ ప్రదర్శనలలో పాల్గొనడాన్ని సులభతరం చేయాలి. ఈ రంగంపై సమగ్రమైన, కచ్చితమైన డేటాను సేకరించడానికి విశ్లేషించడానికి ఒక పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

**భవిష్యత్ చిత్రం:**

రేపటి ప్రపంచంలో మన స్థానం భవిష్యత్తులో సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ మరింత కీలక పాత్ర పోషించనుంది. డిజిటలైజేషన్, కృత్రిమ మేధస్సు, వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి సాంకేతికతలు సృజనాత్మక ప్రక్రియలను, పంపిణీని సమూలంగా మార్చివేయనున్నాయి. ఇది కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. అదే సమయంలో మేధో సంపత్తి రక్షణ వంటి కొత్త సవాళ్లను కూడా తీసుకువస్తుంది. భారతదేశం తన సాంస్కృతిక శక్తిని, యువ జనాభా నైపుణ్యాలను సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ ద్వారా ఆర్థికాభివృద్ధికి ఉపయోగించుకోవచ్చు. ఇది కేవలం ఆర్థిక వృద్ధికి మాత్రమే కాకుండా, సామాజిక సమ్మిళితానికి, ప్రాంతీయ అభివృద్ధికి, దేశం 'సాఫ్ట్ పవర్'ను ప్రపంచ వేదికపై ప్రదర్శించడానికి కూడా దోహదపడుతుంది. భారతదేశం తన 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో సృజనాత్మక రంగం ఒక కీలక చోదక శక్తి కాగలదు.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# ఎవరు చొరబాటు దారులు?

భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశించిన ఇంట్రూడర్స్ (చొరబాటుదారులు) అంటూ ముస్లిమ్స్‌ని హిందుత్వ వాదులు పదే పదే పేర్కొంటారు. ఈ దేశంలో దాదాపు ఆరేడు శతాబ్దాలుగా జీవిస్తూ, ఇక్కడే పుట్టి ఇక్కడే మరణిస్తున్న సాటి మనిషిని ఈదేశానికి చొరబాటు దారుడు అని మాట్లాడటం మన చుట్టూ జరుగుతున్న కమ్యూనల్ విభజన రాజకీయాలకు అద్దంపడుతుంది. నిజానికి చారిత్రికంగా మధ్య ఆసియా స్టెప్పీ గడ్డి భూములనుంచి గుర్రాలపై గత 3000 సంవ త్సరాలలో భారతదేశంలోకి మూడు దఫాలుగా చొరబా టుదారులు ప్రవేశించారు. సనాతనులు ఆరేడు వందలేళ్ల క్రితం వచ్చిన ముస్లిమ్స్ గురించి మాత్రమే మాట్లాడతారు తప్ప వారికంటే ముందు రెండుదఫాలుగా వచ్చిన ఇతరజాతులకు చెందిన చొరబాటుదారుల గురించి మాట్లాడరు.

**1. మొదటి దశ, ఆర్యుల చొరబాటు.**

మధ్య ఆసియనుంచి **BCE** 1500 ప్రాంతంలో ఆర్యులు అనే యోధ జాతి భారత ఉపఖండానికి వలస వచ్చి ఈ ప్రాంతంపై ఆధిపత్యం పొందారు. వీరు తమతో పాటు వేదసంస్కృతి, సంస్కృత భాషను తెచ్చారు ఇవి ఆనాటి భారత ఉపఖండంలోని స్థానిక సంస్కృతులపై ప్రభావం చూపాయి. జన్యుశాస్త్రంలో **DNA Sequencing** పద్ధతి ఖచ్చితమైన ఫలితాలను ఇవ్వగలుగుతుంది. దీని ఆధారంగా ఒక జన్యువు వివిధ జనాభాలలో, వివిధ కాలాలలో ఎలా ప్రయాణం చేసింది అనే విషయం చాలా సులువుగా మేప్పింగ్ చేయగలుగుతున్నారు. ఈ అధ్యయనాలద్వారా, మధ్య ఆసియా నుండి కొన్ని జన్యువులు భరతఖండంవైపు కాలానుగుణంగా కదులుతూ వచ్చాయని కొన్ని పదుల సైంటిఫిక్ పేపర్లు నిర్ధారించాయి. అవే ఆర్యజనువులు. అలా వలసవచ్చిన వారే ఆర్యులు.

మరొక ఆశ్చర్యం కలిగించే అంశం- ఆర్యులలో ఉండే జన్యువు ఆధునిక భారతసమాజంలో బెంగాలు బ్రాహ్మణులలో అత్యధికంగా 72.22 శాతం, ఇతర రాష్ట్రాల బ్రాహ్మణులలో 70-30% మధ్యలో కనిపించింది. ఇక భారతదేశ క్రిందితరగతి ప్రజలలో ఈ ఆర్య జన్యువు 15.7 శాతం మందిలో కనిపించింది. అదే విధంగా భారతీయ గిరిజనులలో ఈ జన్యువు 7.9% మందిలో మాత్రమే గుర్తించారు.

ఈ గమనింపు ద్వారా నేటి బ్రాహ్మణులు మధ్య ఆసియా నుంచి వచ్చిన విదేశీ ఆర్యులని, దళిత బహుజన గిరిజన ప్రజలు భరతఖండంలో సింధునాగరికతా కాలంనుండి జీవిస్తున్న స్థానికులని భావించవచ్చు. ఆర్యులు వర్ణవ్యవస్థను ఏర్పరచారు. సమాజాన్ని బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అంటూ 4 శ్రేణులుగా విభజించారు. వీరిలో బ్రాహ్మణులు ఉన్నతులుగాను, మిగిలిన మూడు వర్ణాలు వారికి సేవచేయాలని ధర్మశాస్త్రాల ద్వారా నిర్ణయించారు. ధర్మశాస్త్రాలనేవి ఒకనాటి రాజ్యాంగం. ఇక వీరికి వెలుపల అతిశూద్రులు ఉండేవారు అతిశూద్రులు వూరివెలుపల నివసించే అంటరానివారు. ధర్మ శాస్త్రాలప్రకారం వీరసలు మనుషులే కార్చు ఆర్యులు వారి స్త్రీలతో కాకుండా పురుషులు ఒక్కరే భరతఖండానికి వచ్చి స్థానిక అనార్య స్త్రీలను పెళ్ళాడారు. ఈ సందర్భంగా స్థానిక పురుషులను ఓడించి లేదా నిర్మూలించటం ద్వారా వారి స్త్రీలను గ్రహించటం జరిగి ఉండాలి. ఆర్యులు ప్రవేశపెట్టిన జన్మ ఆధారిత హెచ్చుతగ్గుల వర్ణవ్యవస్థ (కులవ్యవస్థ), బ్రాహ్మణాధిక్యత, మంత్రాలు, క్రతువులు, స్వర్గనరకాలు, పాపం పుణ్యం లాంటి అభౌతిక భావనలు నేటికీ సమాజంలో తమప్రభావాన్ని చూపుతూనే ఉన్నాయి. ఆర్యులు భారతదేశానికి చెందిన స్థానికులే అని సనాతనులు వాదిస్తారు కానీ అలా నిరూపించే జన్యు ఆధారాలు లేవు. ఇదొక సంకట స్థితిగా మారింది సనాతన హిందూ చరిత్రకారులకు.

2. రెండవ దశ యవనులు, శకులు, పార్థియన్లు, కుషాణులు చొరబాటు.

**BCE 300 - CE** 100 మధ్యలో యవనులు (ఇండో గ్రీక్స్), శకులు (సిథియన్స్) పార్థియన్స్, కుషాణులు మధ్య ఆసియానుంచి భారతదేశంలోకి చొరబడిన యోధులు. అలెగ్జాండర్ మరణం తరువాత అతని సైన్యంలో కొంతమంది గ్రీకులు **BCE** 300 లలో ఇక్కడే ఉండిపోయి పంజాబ్, గాంధార ప్రాంతాలను పాలించారు. వీరిని ఇండో గ్రీక్స్ (యవనులు అని పిలిచారు). వీరు బౌద్ధాన్ని స్వీకరించారు. గాంధారకళలో బౌద్ధ శిల్పాలను చెక్కించారు. మనుస్మృతి వీరిని మ్లేచ్చులుగా పరిగణించి, "తక్కువరకం క్షత్రియులు"గా గుర్తించింది. శకులు (సిథియన్స్) **BCE** 100 లో మధ్య ఆసియా స్టెప్పీలనుండి గుర్రాలపై వచ్చిన సంచార తెగలు. వీరు గాంధార, పంజాబ్, ఉజ్జయిని ప్రాంతాలను పాలించారు. వీరు బౌద్ధ, హైందవ మతాలను స్వీకరించారు. వీరిలో ప్రముఖుడైన రుద్రదమనుడు సంస్కృతాన్ని ఆదరించాడు. వీరిని పతనమైన క్షత్రియులు **(Second class kshatriyas)** గా మనుస్మృతి పరిగణించింది.

పార్థియన్స్, **BCE** 100 లో ఇరాన్ నుంచి వచ్చిన యోధులు. వీరు ఇండో పార్థియన్ సామ్రాజ్యాన్ని స్థాపించారు. వీరు సింధ్ పంజాబ్ ప్రాంతాలను (ప్రస్తుత పాకిస్తాన్) పాలించారు. ఈ వంశంలో గోండో ఫరిస్ ప్రసిద్ధిగాంచిన రాజు. వీరి పాలనలో గాంధార శిల్పకళ అభివృద్ధిచెందింది. వీరు జొరాస్ట్రియన్ మతాన్ని అనుసరించినా, క్రమేపీ భారతీయమతాలతో విలీనం అయిపోయారు. పార్థియన్లను కూడా మనుస్మృతి పతనమైన క్షత్రియులుగా గుర్తించింది.

కుషాణులు, **CE** 100 మధ్య ఆసియానుంచి వచ్చారు. కనిష్కుడు పేరుగాంచిన రాజు. కుషాణులు బౌద్ధమతాన్ని వ్యాప్తిచేసారు. వీరినాణాలపై బుద్ధుడు, శివుడు, గ్రీకుదేవతల చిహ్నాలు ఉండటం వీరి మతసహనాన్ని చూపుతుంది. వీరు వాసుదేవవంటి భారతీయ కల్ట్ పేర్లను ఉపయోగించారు. వీరు కూడా క్షత్రియులుగానే గుర్తింపబడ్డారు.

మధ్యఆసియానుంచి భారతఖండంలోకి చొరబడిన స్టెప్పీ యోధులైన, యవనులు శకులు, పార్థియన్లు, కుషాణులు భారతదేశంలో స్థిరపడి, స్థానిక బౌద్ధ, హైందవ మతాలను స్వీకరించి క్రమేపీ భారతదేశ సమాజంలో మమేకం అయిపోయారు. కాలక్రమేణా వీరు స్థానిక కులాలుగా విలీనమయ్యారు. ఉదాహరణకు శకులు గుజరాత్ మధ్యప్రదేశ్ లోని క్షత్రియకులాలలోకి (రాజ్ పుత్రులు) కుషాణులు ఉత్తరదేశ రాజవంశాలలోకి కలిసిపోయారు.

3. మూడవ దశ చొరబాటు , ఐబక్, ఖిల్జీ, తుగ్లక్, సయ్యిది లోడి, ముఘల్స్. 12-15 శతాబ్దాలమధ్య మధ్యఆసియా నుంచి కుతుబుద్దీన్ ఐబక్, ఖిల్జీ, తుగ్లక్, సయ్యద్, లోడీ వంశాలు వచ్చి భారతదేశాన్ని పాలించాయి. వీరి రాజ్యాలు ఉత్తరభారతదేశానికే పరిమితం అయిన బలహీనమైన రాజ్యాలు. 1526 లో మధ్య ఆసియాకు చెందిన బాబర్ పానిపట్టు యుద్ధంద్వారా ఇబ్రహిం లోడీని ఓడించి భారతదేశంలో ముఘల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఇతనిని మేవాడ్ రాజపుత్రరాజు రాణా సంగా లోడిని గద్దెదించటానికి ఇండియాకు ఆహ్వానించినట్లు కొందరు చరిత్రకారులు చెబుతారు. బాబర్ బలమైన కేంద్రీకృతపాలన కలిగిన విశాలమైన మొఘల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. దీన్ని అక్బర్ విస్తరించాడు. ఔరంగజేబు ముఘల్ సామ్రాజ్యాన్ని పతాకస్థాయికి తీసుకొని వెళ్ళి అఖండ భారతదేశం ఒక రూపాన్ని ఇచ్చాడు. ఇతని పాలనలో ముఘల్ సామ్రాజ్యం ఉచ్ఛస్థితిని పొందింది. అశోకుని మౌర్యసామ్రాజ్యం ఎంతైతే విస్తరించి ఉండేదో దాదాపు అంత భూభాగాన్ని ఔరంగజేబు తిరిగి సాధించగలిగాడు. ఇది అంతకు పూర్వ ఢిల్లి సుల్తానేట్, హిందూ రాజవంశాలకు సాధ్యం కానిది. ముఘలులు హిందూ ముస్లిమ్ సమాజాల మధ్య సమన్వ యాన్ని ప్రోత్సహించారు. ముఖ్యంగా అక్బరు ద్వారా సూఫీ సాధువులైన చిస్టీ, భక్తి సంప్రదాయ గాయకులు ఐన కబీర్ నానక్ వంటివారు ఈ సంగమానికి దోహదపడ్డారు. అక్బర్ యొక దీన్ ఇ ఇలాహీ సిద్ధాంతం సమస్త మతాల ఐక్యతను కోరుకొంది. ముఘల్ పాలకులు రాజపుత్రులు, హిందూ జమిందారులు, ఇతర స్థానిక నాయకులను పరిపాలనలో భాగస్వామ్యం చేసారు. బ్రిటిష్ వారి రాకతో ఒత్తిడి, అంతర్గ అస్థిరతలు ఆర్థిక సంక్షోభం కారణంగా ముఘల్ సామ్రాజ్యం క్షీణించింది. 1857 సైనికుల తిరుగుబాటు తరువాత చివరి ముఘల్ చక్రవర్తి బహదూర్ షా జఫర్ ను గద్దె దించి, సామ్రాజ్యాన్ని బ్రిటిష్ వారు అధికారికంగా తీసుకోవటం జరిగింది. నేటి భారతదేశంలోని ముస్లిములు చివరగా గత 500 ఏళ్ళ క్రితం భారతదేశంలోకి ప్రవేసించినవారు. నిజానికి వీరిలో ఎక్కువశాతం హిందూమతంలో స్థానికదళిత బహుజనులపట్ల ఊపిరాడనివ్వని ఆంక్షల వలన ఇస్లామ్ లోకి మారినవాళ్ళే ఎక్కువమంది ఉండొచ్చు.

**ఎవరు చొరబాటు దారులు?**

ఆర్యులు, యవనులు, ముస్లిములు భారతదేశంలోకి చొరబాటుదారులుగా వచ్చినప్పటికీ, వారు స్థానిక సంస్కృతులతో కలిసిపోయి, భారతీయ సమాజ బహుళతను రూపొందించారు. ఆర్యులు బ్రాహ్మణ సమాజంలో ఎక్కువగా ఉన్నట్లు జన్యు ఆధారాలు చెబుతున్నాయి. యవనులు శకులు, కుషాణులు ఉత్తరభారత రాజపుత్రులుగా ఈ దేశ చరిత్రలో ముఖ్యమైన పాత్ర పోషించారు. మధ్య ఆసియానుండి వచ్చిన ముస్లిములతో పాటు స్థానిక దళిత, బహుజన సమూహాల నుండి ఇస్లాంలోకి మారినవారై ఉండవచ్చని ఒక అభిప్రాయం ఉంది.

నేటి రాజకీయ సందర్భంలో, "చొరబాటుదారులు" అనే పదం ముస్లిములను లక్ష్యంగా చేస్తూ, వారిని విదేశీయులుగా చిత్రీకరించడానికి ఉపయోగించ బడుతుంది. ఇది చరిత్రను ఏకపక్షంగా వక్రీకరించే ప్రయత్నం, ఎందుకంటే ఇది ఆర్యులు, యవనులు, శకులు ఇతర జాతుల చొరబాట్లను విస్మరిస్తుంది. భారతదేశంలోని ముస్లిములు గత 700 సంవత్సరాలుగా ఇక్కడ నివసిస్తున్నారు. ఇక్కడే పుట్టి ఈ మట్టిలోనే కలిసిపోతున్నారు. వారిలో ఎక్కువ మంది స్థానిక మూలాలు కలిగినవారే.

"చొరబాటుదారులు" అనేది చారిత్రక సంఘటనలను వివరించే పదం, కానీ ఆధునిక సమాజంలో దీనిని విభజనాత్మక రాజకీయాలకు ఉపయోగించడం తప్పుదారి పట్టిస్తుంది. విభజన, ద్వేషం కాకుండా ఐక్యత సామరస్యం వైపు మనం ప్రయాణం చేయాలి.



-బొల్లోజు బాబా

## ఏది అసలైన ధ్యానం?

భక్తి



'ధ్యానం' అంటే రోజూ ఒక భంగిమలో కాసేపు కళ్ళు మూసుకొని, శ్వాస లాంటి ఏదో ఒక విషయం మీద దృష్టి నిలపడం అనే అభిప్రాయం చాలా బలంగా ఉంది. ఈ ప్రక్రియ వల్ల తాత్కాలికమైన ప్రశాంతత కలుగుతుందేమో కానీ... మనసులోని సంఘర్షణలు, జీవితంలో దుఃఖం మాత్రం తొలగిపోవడం లేదు. ఈ వాస్తవం మనందరికీ తెలుస్తూనే ఉంది. మరి ఏది అసలైన ధ్యానం? మనం ఏ విషయాన్నైనా మనసుతోనే గ్రహిస్తాం. అందుకే జీవితం గురించి స్పష్టత రావాలంటే... మనసు గురించి లోతుగా తెలియాలి. శరీరాన్ని అద్దంలో చూసుకోవడం మనకు అలవాటే. ఆ సమయంలో మన ఆకార వికారాలు మన అవగాహనలోకి వస్తాయి. అలాగే, మన మనసును మనమే అద్దంలో చూసుకోగలమా? దాని తీరుతెన్నులను సాక్షిలా గమనించగలమా? అవును. అటువంటి నిశితమైన, నిరంతరమైన పరిశీలనే ధ్యానం. మనసు మాయలు కనిపెట్టడమే ధ్యానం

**అరువు తెచ్చుకున్న జ్ఞానం**

దేవుడు, మత విశ్వాసాలు, జీవితం పట్ల దృక్పథం... ఇలా మన జీవితాన్ని నడిపే ముఖ్యమైన విషయాల పట్ల మనకున్న అభిప్రాయాల్లో ఎక్కువ శాతం మన అనుభవం లోంచి వచ్చినవి కావు. ఇది ఇతరుల నుంచి వచ్చిన 'సెకెండ్ హ్యాండ్' జ్ఞానం. అలా అనేకానేక ప్రభావాలు, నమ్మకాలు, అరువు తెచ్చుకున్న జ్ఞానంతో మన మనసు కండిషన్ (నిబద్ధీకరణ) అయిపోయింది. అలాంటి మనసు... దుమ్ము పట్టిన కళ్ళద్దాలలాంటిది. కళ్ళద్దాల మీద మురికి పేరుకుపోతే వాటి ద్వారా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని సరిగ్గా చూడలేం. అలాగే, రకరకాల నిబద్ధీకరణలతో నిండిన మనసు వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్టుగా చూడలేదు. సరైన నిర్ణయాలు తీసుకోవడంలో మనకు సహకరించలేదు. అలాంటి మనసు ఉన్నంతవరకూ... దుఃఖం, సంఘర్షణల నుంచి మనకు విముక్తి లేదు. సత్యం వైపు మనం ప్రయాణించే అవకాశమే లేదు.



నిద్రలో గొంతులోని కండరాలు రిలాక్స్ అవుతూ, శ్వాస మార్గానికి అడ్డుపడి, శ్వాస పీల్చుకోడానికి వీలుగా తరచూ నిద్ర మెలకువ అవుతూ ఉండే సమస్యే, అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా. ఈ అంతరాయం శరీరంలో ఆక్సిజన్ మోతాదులను తగ్గించి, మెదడు పనితీరును ప్రభావితం చేస్తుంది. అయితే ఈ సమస్యకు పరిష్కారంగా సిపాప్ థెరపీ అందుబాటులోకొచ్చింది. మాస్క్ ద్వారా గాలి శ్వాసమార్గంలోకి ప్రవహిస్తూ, శ్వాసమార్గాన్ని తెరిచి ఉండే ఈ పరికరం వల్ల నిద్రాభంగం కలగకుండా కంటి నిండా నిద్రపోయే వీలుంటుంది. అయితే స్లీప్ ఆప్నియా సమస్యతో బాధపడేవారు, ఈ సమస్యను సకాలంలో గుర్తించలేక చికిత్సను ఆలస్యం చేస్తూ ఉంటారు.



## నిద్రాభంగంతో పార్కిన్సన్స్

ఫలితంగా దీర్ఘ కాలంలో కేంద్ర నాడీ వ్యవస్థకు సంబంధించిన పార్కిన్సన్స్ రుగ్మత బారిన పడే ప్రమాదం ఉందని తాజా అధ్యయనాల్లో తేలింది. ఇందుకోసం పరిశోధక బృందం, స్లీప్ ఆప్నియాను కలిగిన ఉన్న 15 లక్షల మందికి చెందిన వైద్య నివేదికలను, ఆ సమస్య లేని వ్యక్తుల వైద్య నివేదికలతో సరిపోల్చినప్పుడు, స్లీప్ ఆప్నియాతో బాధపడుతూ సిపాప్ పరికరాన్ని ఉపయోగించని వ్యక్తులు అంతిమంగా పార్కిన్సన్స్ రుగ్మతకు గురవుతున్నట్టు తేలింది.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్
సోమవారం
28 । ఏప్రిల్ । 2025


# ఈ ఐదు మాటలు అనొద్దు!



సంసారంలో భార్యభర్తల మధ్య తగువులు వస్తూనే ఉంటాయి. వాటికి పరిష్కారాలు కూడా దొరుకుతూనే ఉంటాయి. ఇది సర్వసాధారణం. కానీ ఒకరినొకరు అనుకొనే మాటలు మాత్రం ఎప్పటికీ మిగిలిపోతాయి. అందువల్ల ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని రిలేషన్‌షిప నిపుణులు సూచిస్తున్నారు. దెబ్బలాడుకొనే సమయంలో కొన్ని మాటలు వాడవద్దని హితవు చెబుతున్నారు. ఆ మాటలేమిటంటే...

**ఎక్కువగా రియాక్ట్ అవుతున్నావు!**

ఒక అనుబంధం బలపడాలంటే ఒకరినొకరు గౌరవించుకోవాలి. అభిప్రాయాలను స్పష్టం చెప్పాలి. వారు చెప్పే అభిప్రాయాలను అర్థం చేసుకోవాలి. దీనికి చాలా సహనం అవసరం. కొన్ని సార్లు వాదన పెరిగినప్పుడు ఇతరుల అభిప్రాయాలను మొగ్గలోనే తుంచివేయాటానికి చేసే వ్యాఖ్యలివి. దీని వల్ల వాదన పెరుగుతుంది తప్ప తగ్గదు.

**మా వాళ్లైతే ఇలా చేయరు...**

ప్రతి వ్యక్తి జీవితంలో తల్లితండ్రులు చాలా ముఖ్యమైనవారే! వారికి పిల్లలపై అపారమైన ప్రేమ ఉంటుంది. తప్పు చేసినా దానిని సరిదిద్దటానికి ప్రయత్నిస్తారు. కానీ భార్యభర్తల బంధం భిన్నమైనది. భార్యభర్తలిద్దరూ కలిసి నిర్ణయాలు తీసుకోవాలి. ఎప్పుడైనా ఒకరు అన్న మాట నెగ్గకపోతే వెంటనే అవతల వ్యక్తి తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ చేసే వ్యాఖ్యలివి. దీనివల్ల సమస్యలు పెరుగుతాయి తప్ప తరగవు.

**ఐ డోంట్ కేర్!**

వాదిస్తే పర్వాలేదు. కానీ అవతల వ్యక్తి అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా 'ఐ డోంట్ కేర్' అంటే మాత్రం సమస్య జటిలమైపోతుంది. ఇతరులతో మనకు అభిప్రాయ భేదాలు ఉండచ్చు. అభిప్రాయ భేదాలు ఉన్నాయనే విషయాన్ని కూడా గౌరవంగా చెప్పాలి. లేకపోతే ఇతరుల మనస్సు దెబ్బతింటుంది.

**నువ్వెప్పుడూ ఇంతే!**

చాలామంది ఇళ్లలో వినిపించే డైలాగ్ ఇది. 'నువ్వు ఎప్పుడూ మర్చిపోతావు', 'నువ్వు ఎప్పుడూ నా మాట వినవు' లాంటి వ్యాఖ్యలు ఇతరుల వ్యక్తిత్వాన్ని కించపరచటమే. ఇలాంటి వ్యాఖ్యల వల్ల భార్యభర్తల మధ్య దూరం పెరుగుతుంది.

**నేనిష్టం లేదు కాబట్టే...**

ఇతరుల పట్ల ప్రేమ, అభిమానం ఉన్నా కొన్ని సార్లు వ్యవహారికంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇవి ప్రేమకు కొలమానం కాదు. మనకు ఇష్టం లేని పని జరిగితే 'నేనిష్టం లేదు కాబట్టే ఇలా చేశావు' అని నిందించటంవల్ల ఎటువంటి ప్రయోజనం లేదు.

# అధ్యయనం చేయకుండానే రాసేస్తున్నారు!

నా అనుభవంలో అనువాదమే కష్టమనిపిస్తుంది. ఎందుకంటే - కొన్ని ఆలోచనలు, భావోద్వేగాలు, అనుభవాల సమాహారమే స్వతంత్ర రచన. వీటికి అనుగుణంగానే మన రచన సాగుతుంది. కానీ అనువాదంలో ఇంకో రచయిత ఆలోచనలు, భావోద్వేగాలు, అనుభవాలను ఆవాహన చేసుకోవాలి. వాటిని మన భాషలోకి తీసుకురావాలి. మూల రచన భావం చెడకూడదు. ఒక్క మాటలో చెప్పాలంటే మూల రచనలో పూర్తిగా నిమగ్నమైపోవాలి. మూల రచయిత భావనలలోనే బతకాలి. చాలా సందర్భాలలో అనువాద రచన పూర్తయినా... ఆ పాత్రలు ఇంకా వెంటాడుతూ ఉంటాయి. ఇప్పుడు నాకు అవార్డు వచ్చిన 'ఈతచెట్టు దేవుడు'నే తీసుకుందాం. ఈ నవలలోని పాత్రలు చాలా లోతుగా ఉంటాయి. దీని రచన పూర్తయిన కాలం ఆ పాత్రలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. అందుకే మూల రచన ఒడియా పాఠకులకు అంత దగ్గరయింది.

తెలుగు, ఒడియాలు మాత్రమే కాదు. ఇతర భారతీయ భాషా సాహిత్యంలో కూడా చాలా పోలికలు ఉంటాయి. భాషపరంగా ఎటువంటి సంబంధం ఉండకపోవచ్చు. కానీ సామాజికంగా అనేక విషయాలు ఒకే విధంగా ఉంటాయి. ఉదాహరణకు మనం తెలుగు ఆధునిక సాహితీ యుగానికి గురజాడను యుగకర్తగా చెప్పుకుంటాం కదా! గురజాడ జీవించిన సమయంలో ఒడియాలో ఫకీర్ మోహన్ సేనాపతి అని ఒక రచయిత ఉండేవారు. ఆయనను ఒడియా సాహితీ దిగ్గజంగా చెప్పుకోవచ్చు. ఆయన 'రేవతి' అనే ఒక కథ రాశారు. ఈ కథలో చిన్న చిన్న అమ్మాయిలను ముసలివాళ్లకు ఇచ్చి పెళ్లిచేయటం, డబ్బుల కోసం అమ్మాయిలను అమ్ముకోవటం ప్రధానమైన అంశాలు. గురజాడ 'కన్యాశుల్కం'లోని పాత్రల లాంటివే దీనిలో కూడా ఉంటాయి. వాస్తవానికి భాషాపరంగా తెలుగుకు, ఒడియాకు ఎటువంటి సంబంధం లేదు. కానీ ఒకే సమయంలో రెండు ప్రాంతాల్లో ఒకే రకమైన దురాచారాలు ఉన్నాయి. వాటిపై రచయితలు స్పందించారు. కేవలం ఈ రెండు భాషల్లోనే కాదు. ఇతర భాషాల్లో రచయితలు కూడా ఈ తరహా దురాచారాలపై స్పందించే ఉంటారు.

మంచి కృషి జరుగుతోంది. జరగటం లేదని చెప్పలేం. కానీ ఈ తరం వాళ్లు తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి దూరం అవుతున్నారనేది నా అభిప్రాయం. గత మూడు దశాబ్దాలుగా తెలుగు చదివేవారి సంఖ్య తగ్గుతోంది. చిన్నప్పటి నుంచి ఇంగ్లీషు కాన్వెంట్స్‌లో చదువుతున్నారు. దీని వల్ల తెలుగు చదివేవారి సంఖ్య, రాసేవారి సంఖ్య తగ్గిపోతోంది. నా ఉద్దేశంలో ప్రస్తుతం ఎక్కువగా తెలుగు చదివేవారు 50లు దాటినవారే! ఎక్కువ మంది చదవకపోవటం వల్ల మంచి సాహిత్యం రావటం లేదు. అదే సమయంలో సాహితీపరంగా లోతైన అధ్యయనం చేసేవారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. కొద్దిమంది చేస్తున్నారు. కానీ అది ప్రభావవంతంగా, సంతృప్తికరంగా ఉండటం లేదు. నా ఉద్దేశంలో పాతను ఎప్పుడూ మనం గౌరవించాలి. పాత మన భవిష్యత్తుకు పునాదిలాంటి. అందుకే తెలుగు సాహిత్యంలో ఉన్న రామాయణ, భారత, భాగవత గ్రంథాలతో పాటు ఇతర సాహిత్యాన్ని కూడా చదవాలి. ఆ గ్రంథాలలో ఉన్న మంచిని గ్రహించాలి. మంచిని గ్రహించాలంటే ముందు అధ్యయనం చేయాలి. అధ్యయనం చేయటానికి బాగా చదవాలి. ఇప్పుడు కొందరు అధ్యయనం చేయకుండా రాసేస్తున్నారు. ఈ విషయం తలుచుకున్నప్పుడు బాధగా అనిపిస్తుంది.





# అధిక చక్కెర చేటు



చక్కెరలో పోషకాలు ఉండవు. అయినా అందరం తీపిని ఇష్టంగా తింటాం. అయితే కొందరు తీపి పదార్థాలను విపరీతంగా తింటూ ఉంటారు. ఇలాంటి అలవాటుతో ఒరిగే నష్టాల గురించి తెలుసుకుందాం!

**ఆకలి పెరుగుతుంది**

చక్కెర ద్వారా శరీరంలోకి ఎక్కువ క్యాలరీలు చేరడం వల్ల ఆకలి పెరుగుతుంది. తీపితో రుచి మొగ్గలు సంతృప్తి పడినా పొట్ట నిండదు. ప్రాథమిక పోషకాలు లోపించే శుద్ధి చేసిన పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల శరీరం చక్కెరను ఖర్చు చేసుకుని వెంటనే ఆకలిని పెంచుతుంది. దాంతో అదనపు ఆహారంతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకుంటాయి.

**చికాకు పెరుగుతుంది**

అదనపు చక్కెరతో చికాకు, ఆందోళనలు పెరుగుతాయి. అలాగే అదనపు చక్కెరలు జోడించిన పదార్థాలు తినడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. భావోద్వేగాలు అదుపు తప్పుతాయి. మానసిక కుంగుబాటు కూడా వేధిస్తుంది

**నిస్సత్తువ ఆవరిస్తుంది**

శరీరం చక్కెరను సులభంగా శోషించుకుంటుంది. త్వరగా జీర్ణమైపోతుంది. దాంతో సులభంగా నిస్సత్తువ ఆవరిస్తుంది. త్వరిత శక్తిని అందిస్తుంది కాబట్టే ఎంత తీపి తిన్నా తిన్న అరగంటకే నిస్సత్తువ వేధిస్తుంది.

**తీపి మీద యావ**

మనసు చక్కెర వైపే లాగుతోందంటే మనం చక్కెరకు బానిసలమయ్యామని అర్థం. చక్కెర మెదడులో ఉత్పత్తయ్యే హ్యాపీ హార్మోన్‌ను ప్రేరేపిస్తుంది. కాబట్టి చక్కెర తిన్న వెంటనే కలిగే సంతృప్తికి వ్యసనపరులుగా మారిపోతాం! పదే పదే ఆ సంతృప్తిని పొందడం కోసం మళ్లీ మళ్లీ తీపి కోసం ఆరాటపడతాం!

**అధిక రక్తపోటు**

అధిక చక్కెర అ?ధిక రక్తపోటుకు దారి తీస్తుంది. చక్కెర వల్ల, కొలెస్ట్రాల్ లాంటి కొవ్వులు రక్తనాళాల్లోని లోపలి గోడలకు అతుక్కుపోయి, రక్తనాళాలను గట్టిపరుస్తాయి. దాంతో రక్తపోటు పెరుగుతుంది.

**కీళ్ల నొప్పులు**

చక్కెర కీళ్ల నొప్పులను పెంచుతుంది. వాపు, నొప్పులకు దారి తీస్తుంది. తీపి పదార్థాల వల్ల కీళ్ల నొప్పుల సమస్య మరింత పెరిగినట్టు, రుమటాయిడ్ ఆర్థ్రయిటిసతో బాధపడే వారు పేర్కొన్నట్టు అధ్యయనాలు చెప్తున్నాయి.

# బూడిద గుమ్మడితో భలే భలేగా

బూడిద గుమ్మడికాయ... అనగానే మనకి కరకరలాడే వడియాలు, తీయని పేఠా గుర్తుకు వస్తాయి. దీనితో రకరకాల కూరలు, కమ్మని పులుసు కూడా చేసుకుంటూ ఉంటాం. ఇవి కాక బూడిద గుమ్మడికాయతో చేసే వెరైటీ వంటకాలు మీ కోసం...

మజ్జిగ పులుసు

**కావాల్సిన పదార్థాలు**

పెరుగు- రెండు కప్పులు, బూడిద గుమ్మడికాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చి కొబ్బరి ముక్కలు- అర కప్పు, అల్లం ముక్కలు- రెండు చెంచాలు, ధనియాలు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, మిరియాలు- ఒక చెంచా, పచ్చి మిర్చి- నాలుగు, శనగపిండి- రెండు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, కరివేపాకు- రెండు రెమ్మలు, ఇంగువ- చిటికెడు, నూనె- రెండు చెంచాలు, నెయ్యి- ఒక చెంచా, మెంతులు- అర చెంచా, ఆవాలు- పావు చెంచా, ఎండు మిర్చి- రెండు, కొత్తిమీర తరుగు- ఒక చెంచా

తయారీ విధానం

స్టవ్ మీద గిన్నె పెట్టి ధనియాలు, అర చెంచా జీలకర్ర, మిరియాలు వేసి రెండు నిమిషాలపాటు దోరగా వేయించాలి.

మిక్సీలో కొబ్బరి ముక్కలు, అల్లం ముక్కలు, వేయించిన ధనియాలు-జీలకర్ర-మిరియాలు, పచ్చిమిర్చి, శనగపిండి వేసి కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకుని రెండు కప్పుల పెరుగు వేసి బాగా కలపాలి.స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో బూడిద గుమ్మడికాయ ముక్కలు వేసి రెండు గ్లాసుల నీళ్లు పోసి ఉడకనివ్వాలి. మెత్తగా ఉడికాక అందులో కొబ్బరి-శనగపిండి, పెరుగు మిశ్రమాన్ని పోసి ఉప్పు వేసి బాగా కలపాలి. మూడు పొంగులు రానిచ్చి స్టవ్ మీద నుంచి దించాలి.

స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నూనె, నెయ్యి వేసి వేడిచేయాలి. తరవాత ఆవాలు, అర చెంచా జీలకర్ర, మెంతులు, ఇంగువ, ఎండు మిర్చి ముక్కలు, పసుపు, కరివేపాకు వేసి వేగనివ్వాలి. ఈ తాలింపుని గుమ్మడికాయ ముక్కలు-పెరుగు మిశ్రమంలో వేసి కలపాలి. తరవాత కొత్తిమీర తరుగు చల్లాలి. ఈ బూడిద గుమ్మడికాయ మజ్జిగ పులుసు అన్నంలోకి రుచిగా ఉంటుంది.

**జాగ్రత్తలు**

బూడిద గుమ్మడికాయ ముక్కలను మరీ పెద్దగా లేదా మరీ చిన్నగా కోయకూడదు.

కొబ్బరి-శనగపిండి-పెరుగు మిశ్రమం కలిపిన తరవాత పులుసు చిక్కగా ఉందనిపిస్తే మరోగ్లాసు నీళ్లు పోసి చిన్న మంట మీద మరగించాలి.

మజ్జిగ పులుసు చల్లారే కొద్దీ చిక్కగా అవుతుంది. కాబట్టి పలుచగా ఉన్నప్పుడే స్టవ్ మీద నుంచి దించాలి.

శనగపిండికి బదులు బియ్యప్పిండి లేదా కార్న్‌ఫ్లోర్ వాడుకోవచ్చు.

ఆవకాయ

**కావాల్సిన పదార్థాలు**

బూడిద గుమ్మడికాయ ముక్కలు- మూడు కప్పులు, ఆవపిండి- అర కప్పు, కారం- అర కప్పు, ఉప్పు- పావు కప్పు, నిమ్మకాయలు- రెండు, ఉల్లిపాయ- ఒకటి, నూనె- అయిదు చెంచాలు, ఆవాలు- అర చెంచా, మెంతులు- అరచెంచా, ఇంగువ- చిటికెడు, పసుపు- చిటికెడు

**తయారీ విధానం**

ఒక గిన్నెలో గుమ్మడి కాయ ముక్కలు, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలిపి మూతపెట్టి అరగంటసేపు ఉంచాలి. తరవాత ఈ ముక్కలను చేతిలోకి తీసుకుని గట్టిగా నీటిని పిండి వెడల్పాటి గిన్నెలోకి వేయాలి. ఇందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, ఆవపిండి, కారం, ఉప్పు వేసి బాగా కలపాలి. తరవాత ఇందులో నిమ్మరసం వేసి కలపాలి.స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. ఇందులో ఆవాలు, మెంతులు, ఇంగువ, పసుపు వేసి దోరగా వేపాలి. ఈ తాలింపును గుమ్మడికాయ ముక్కల మిశ్రమంలో వేసి బాగా కలపాలి. దీని మీద మూతపెట్టి ఒక పూట ఊరనివ్వాలి. తరవాత ఒకసారి ఉప్పు, పులుపు సరిచూసుకోవాలి. ఈ ఆవకాయ వేడి అన్నంలోకి రుచిగా ఉంటుంది.

**జాగ్రత్తలు**



బూడిద గుమ్మడికాయను వీలైనంత చిన్న ముక్కలుగా తరిగితే ఆవకాయ రుచి బాగుంటుంది. గింజలు తీసివేయాలి. తొక్క తీయనవసరం లేదు. గుమ్మడికాయ ముక్కల నుంచి పిండిన నీటిలో కొద్దిగా నిమ్మ రసం కలుపుకుని తాగవచ్చు. ఇది ఆరోగ్యానికి మంచిది.

ఈ ఆవకాయ నాలుగు రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. కాబట్టి కొద్ది పరిమాణంలో మాత్రమే తయారు చేసుకోవడం మంచిది.

కూటు

కావాల్సిన పదార్థాలు

బూడిద గుమ్మడికాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చి శనగపప్పు- పావు కప్పు, చింతపండు- కొద్దిగా, మినప్పప్పు- ఒక చెంచా, జీలకర్ర- అర చెంచా, ఆవాలు- పావు చెంచా, ఇంగువ- చిటికెడు, ఎండు మిర్చి- అయిదు, మిరియాలు- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, పచ్చి కొబ్బరి ముక్కలు- పావు కప్పు, నూనె- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, కరివేపాకు- రెండు రెమ్మలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

**తయారీ విధానం**



ఒక గిన్నెలో పచ్చి శనగపప్పు వేసి బాగా కడిగి నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. మరో గిన్నెలో చింతపండును కూడా నానబెట్టి రసం తీసి ఉంచుకోవాలి.

స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో మినప్పప్పు, జీలకర్ర, ఎండు మిర్చి, మిరియాలు వేసి దోరగా వేపాలి. వీటిని మిక్సీ గిన్నెలో వేయాలి. అలాగే పచ్చి కొబ్బరి ముక్కలు కూడా వేసి కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి.

స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడిచేయాలి. ఇందులో ఆవాలు, ఇంగువ, పసుపు, కరివేపాకు, నానబెట్టిన పచ్చి శనగపప్పు వేసి దోరగా వేపాలి. తరవాత బూడిద గుమ్మడికాయ ముక్కలు వేసి బాగా కలిపి మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత మూత తీసి చింతపండు రసం పోసి ఉడికించాలి. పచ్చి శనగపప్పు, గుమ్మడికాయ ముక్కలు మెత్తగా ఉడికిన తరవాత ముందుగా గ్రైండ్ చేసుకున్న కొబ్బరి పేస్టు, ఉప్పు వేసి కలపాలి. మిశ్రమం మరీ చిక్కగా అనిపిస్తే అరగ్లాసు నీళ్లు పోసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. కూటు చపాతీ, పుల్కా, అన్నంలోకి బాగుంటుంది.

**జాగ్రత్తలు**

పచ్చి శనగపప్పుకు బదులు కందిపప్పు లేదా పెసరపప్పు వేసుకోవచ్చు.

ఈ కూటులో ఒక చెంచా నెయ్యి కలిపితే కమ్మగా ఉంటుంది.

బూడిద గుమ్మడికాయలో ఎ, బి, సి, ఇ విటమిన్లతోపాటు ఐరన్, సోడియం, పొటాషియం, కాల్షియం,

జింక్ లాంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇందులో కొలెస్ట్రాల్ అసలు ఉండదు. దీనికి క్షార గుణం ఎక్కువ. అందుకే దీనిని ఆహారంగా తీసుకోవడం వల్ల కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

బూడిద గుమ్మడికాయలో ఉండే పీచు పదార్థాలు మలబద్ధకాన్ని నివారిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తాయి. వారానికి రెండు రోజులు దీనిని ఆహారంలో చేర్చుకుంటే శరీర బరువు నియంత్రణలో






## జీవిత బీమా పాలసీదారులకు రైడర్లతో మరింత రక్షణ

**న్యూఢిల్లీ-నవభూమి:**జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. హఠాత్పరిణామాలను ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉండటమే ఉత్తమ వ్యూహం. ఆపద నుంచి రక్షించే కవచాల్లో బీమా ఒకటి. అది ఉంటే మీకే కాదు.. మీ కుటుంబ భవిష్యత్‌కూ ధీమా. అయితే, ఏ బీమా పథకమైనా కొన్ని సందర్భాల్లో పాలసీదారును ఆకస్మిక అవసరం నుంచి గట్టెక్కించలేకపోవచ్చు. అలాంటప్పుడే రైడర్లు పనికొస్తాయి. పాలసీ కవరేజీని విస్తరించే అదనపు ఫీచర్ల జోడింపే రైడర్. ఇవి పాలసీ పరిధిని విస్తృతపరచడం ద్వారా సంపూర్ణ రక్షణ కల్పిస్తాయి.టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతి ఒక్కరూ పరిగణించాల్సిన పాలసీ. పాలసీదారు పాలసీ గడువు కాలంలో దురదృష్టవశాత్తు మరణిస్తే.. తన కుటుంబానికి ఆర్థిక భద్రత, భరోసాను కల్పిస్తుంది. టర్మ్ పాలసీ ద్వారా ఎంత మేర బీమా కవరేజీ కలిగి ఉండాలన్నది వ్యక్తి లేదా కుటుంబ అవసరంపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, మీ వార్షికాదాయానికి కనీసం 10-15 రెట్ల బీమా కవరేజీ కొనుగోలు చేయడం మేలు. టర్మ్ పాలసీతో పాటు అదనంగా రైడర్లను ఎంపిక చేసుకోవడం ద్వారా మీ భవిష్యత్‌కు సమగ్ర బీమా కవరేజీని పొందవచ్చు. టర్మ్ పాలసీతో పాటు పరిగణించాల్సిన మూడు కీలక రైడర్ల వివరాలు..యాక్సిడెంటల్ డెత్ అండ్ డిసేబిలిటీ బెనిఫిట్: పాలసీదారు ఒకవేళ యాక్సిడెంట్‌లో మరణిస్తే ఈ రైడర్ కలిగి ఉండటం ద్వారా నామినీకి అదనపు డెత్ బెనిఫిట్ ప్రయోజనాలు లభిస్తాయి. అంతేకాదు, యాక్సిడెంట్ కారణంగా అంగ వైకల్యం ఏర్పడిన సందర్భంలోనూ పాలసీదారుకు ఆర్థిక మద్దతును ఈ రైడర్ కల్పిస్తుంది. ముఖ్యంగా నిర్మాణ రంగం లేదా గనుల్లో పనిచేసే వారు, ఉద్యోగ రీత్యా వాహనంపై సుదీర్ఘ ప్రయాణాలు చేయాల్సిన వారికి ఈ రైడర్ ప్రయోజనకరం.




## రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ 350 వచ్చేసింది..!

### ధర, బుకింగ్, డెలివరీ ఫుల్ డిటెయిల్స్ ఇవే..!



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌కు చెందిన ప్రముఖ టూవీలర్ తయారీ కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్ పాపులర్ మోడల్ అయిన హంటర్ 350 అప్‌డేట్ వెర్షన్‌ను భారత్‌లో రిలీజ్ చేసింది. ముంబయి, ఢిల్లీల్లో 'హంటర్స్‌హుడ్' ఫెస్టివల్ నిర్వహించి.. హంటర్ 350 బైక్‌ని లాంచ్ చేసింది. ఈ బైక్ రియో వైట్, టోక్యో బ్లాక్, లండన్ రెడ్ రంగుల్లో అందుబాటులో ఉండనున్నది. పాత మోడల్‌తో పోలిస్తే ఇందులో పలు మార్పులు చేసింది. మెరుగైన రైడింగ్ కోసం ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, ట్రిప్పర్ నావిగేషన్ పాడ్, టైప్-సీ యూఎస్‌బీ సపోర్ట్ అందించింది.గ్రౌండ్ క్లియరెన్స్‌ని 10 ఎంఎంకి పెంచింది. అలాగే, రియర్‌లో సస్పెన్షన్‌లో సైతం మార్పులు చేసింది. దాంతో పాటు సీట్ కంఫర్ట్ ఉండేలా మార్పులు చేసింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ 350సీసీ రేంజ్‌లో స్లిప్పర్-అసిస్ట్ క్లచ్ ఉన్న తొలి బైక్ ఇదే కావడం విశేషం. అయితే, కంపెనీ ఇంజిన్‌లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. పాత మోడల్‌లోని 349సీసీ, ఎయిర్-ఆయిల్ కూల్డ్, జే సిరీస్ ఇంజిన్‌ను యధాతథంగా కొనసాగించింది. ఈ బైక్ 5 స్పీడ్ గేర్‌బాక్స్‌తో రానున్నది.20.2 బీహెచ్‌పీ పవర్ వద్ద 27 ఎన్ఎం టార్క్‌ని ఉత్పత్తి చేయనున్నది. ఇక ఈ బైక్ మూడు వేరియంట్లలో అందబాటులో ఉండనున్నది. ఫ్యాక్టరీ బ్లాక్ ధర రూ.1,49,900గా నిర్ణయించింది. రియో వైట్, డాపర్ గ్రే వేరియంట్ రూ.1,76,750కి అందుబాటులో ఉంటుంది. ఇక టోక్యో బ్లాక్, లండన్ రెడ్, రెబెల్ బ్లూ వేరియంట్ బైక్ రూ.1,81,750గా తెలిపింది. అయితే, ఇవన్నీ ఎక్స్‌షోరూం ధరలు (చెన్నై) మాత్రమే. ఈ హంటర్ 350 బైక్ కోసం రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్లతో పాటు కంపెనీ అధికారిక వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చని.. త్వరలోనే బైక్‌ల డెలివరీలు ప్రారంభిస్తామని కంపెనీ వెల్లడించింది.

## ఇన్వెస్టర్లకు అలర్ట్.. వచ్చే వారం రానున్న ఐపీఓలు ఇవే..




**న్యూఢిల్లీ-నవభూమి:** స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కీలక అలర్ట్ వచ్చేసింది. వచ్చే వారం (ఏప్రిల్ 28) నుంచి మార్కెట్లోకి కొత్త ఐపీఓలు రాబోతున్నాయి. ఏథర్ ఎనర్జీ ఐపీఓ సహా ఇంకొన్ని వస్తున్నాయి. ఆ వివరాలేంటో ఇక్కడ చూద్దాం.ఏథర్ ఎనర్జీ ఐపీఓ: మెయిన్‌బోర్డ్ విభాగం నుంచి వస్తున్న ఈ ఇష్యూ విలువ రూ. 2,981.06 కోట్లు. ఇది ఏప్రిల్ 28న ప్రారంభమై, ఏప్రిల్ 30న ముగుస్తుంది. మే 2న షేర్ల కేటాయింపు, మే 6న షేర్లు జాబితా చేయబడతాయి. ఈ IPOలో బిడ్డింగ్ ధర బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 304-321. లాట్ సైజు 46.

ఐవేర్ సప్లైచైన్ సర్వీసెస్ : ఈ ఇష్యూ సైజు రూ.27.13 కోట్లు, ఏప్రిల్ 28న ప్రారంభమై, ఏప్రిల్ 30న ముగుస్తుంది. ఇందులో మీరు ఒక్కో షేరుకు రూ.95 ధరకు 1200 లాట్‌లో బిడ్ చేయవచ్చు. ఇష్యూ ముగిసిన తర్వాత, మే 2న కేటాయింపు జరుగుతుంది. షేర్లు మే 6న %చీూజు నావీజు%లో లిస్ట్ చేయబడతాయి. ఈ ఇష్యూలో 28.56 లక్షల కొత్త షేర్లు మాత్రమే ఉంటాయి.

%అరుణయ ఆర్గానిక్స్ ఐపీఓ: ఇది కూడా ఏప్రిల్ 29న ప్రారంభమవుతుంది. దీని బిడ్డింగ్ షేరుకు రూ. 55-58 మధ్య ఉంటుంది. రూ. 2,000 లాట్స్ తీసుకోవాలి. ఈ పరిమాణం రూ.33.99 కోట్లు. మే 5న షేర్ల కేటాయింపు, మే 7న షేర్లు లిస్టింగ్ ఉంటుంది. ఈ ద్వారా రూ.30.51 కోట్ల విలువైన 52.60 లక్షల కొత్త షేర్లు, రూ.3.48 కోట్ల విలువైన 6 లక్షల షేర్లు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి.

కెర్నిక్ ఇండస్ట్రీస్ IPO: ఈ ఇష్యూ పరిమాణం రూ. 8.75 కోట్లు. ఈ IPO ఏప్రిల్ 29న ప్రారంభమై, మే 6న ముగుస్తుంది. మే 7న షేర్ల కేటాయింపు ఉంటుంది. ఈలో బిడ్డింగ్ ధర షేరుకు రూ. 25, లాట్ సైజు 6000. ఇష్యూ ముగిసిన తర్వాత, మే 9న షేర్లు షేర్లు లిస్ట్ చేయబడతాయి.

వ్యాగన్స్ లెర్నింగ్ : రూ. 38.38 కోట్ల ఈ ఇష్యూ మే 2న ప్రారంభమై, మే 6న ముగుస్తుంది. కేటాయింపు మే 7న ఉంటుంది. షేర్లు మే 9న లిస్ట్ కానున్నాయి. ఈ ధర బ్యాండ్ ఒక్కో షేరుకు రూ. 78-82. లాట్ సైజు 1600 షేర్లు.

## రిలయన్స్ ఆదాయం రూ.10 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఆర్ఐఎల్ ఏకీకృత నికర లాభం రూ.19,407 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.14.34) చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదైన రూ.18,951 కోట్ల (ఒక్కో షేరుకు రూ.14) లాభంతో పోలిస్తే 2.4 శాతం పెరిగింది. 2024-25లోనే డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఆర్జించిన రూ.18,540 కోట్ల లాభంతో పోల్చినా మెరుగైన వృద్ధిని నమోదు చేసింది.ఆయిల్ అండ్ కెమికల్స్ (ఓ2సీ) వ్యాపార పనితీరు బలహీనంగానే ఉన్నప్పటికీ రిలయన్స్ జియో, రిటైల్ వ్యాపారాల్లో జోరు లాభం వృద్ధికి దోహదపడింది. కాగా, క్యూ4లో ఆర్ఐఎల్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన దాదాపు 10 శాతం వృద్ధి చెంది రూ.2,64,573 కోట్లకు పెరిగింది. ఎబిటా 3.6 శాతం పెరుగుదలతో రూ.48,737 కోట్లుగా నమోదైంది.గత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి ఆర్ఐఎల్ లాభం 2.9 శాతం పెరిగి రూ.81,309 కోట్లుగా నమోదైంది. స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.1 శాతం వృద్ధి చెంది రూ.10.71 లక్షల కోట్లకు పెరిగింది. 2024-25లో రూ.10 లక్షలకు పైగా నెట్‌వర్త్ సాధించిన తొలి కంపెనీ రిలయన్సే. గత ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.5.5 డివిడెండ్‌ను ప్రకటించింది. అలాగే, నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.25,000 కోట్ల సమీకరణ ప్రణాళికకు బోర్డు ఆమోదం తెలిపింది.

## ఎలక్ట్రిక్ స్కూటర్ల కంపెనీ ఐపీఓ.. రేపే షురూ.. ఒక్కో షేరుకు ఎంతంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశీయ దిగ్గజ ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కంపెనీల్లో ఒకటైన ఏథర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఏథర్ ఎనర్జీ ఐపీఓకు సంబంధించిన బిగ్ అప్డేట్ వచ్చేసింది. ఈ కంపెనీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 28వ తేదీ సోమవారం ప్రారంభమవుతోంది. దిగ్గజ ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ తర్వాత వస్తున్న ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కంపెనీ కావడంతో ఏథర్ ఎనర్జీ ఐపీఓ పై మదుపరుల్లో ఆసక్తి నెలకొంది. మరి ఈ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ వివరాలు, జీఎంపీ, వంటి పూర్తి వివరాలు తెలుసుకుందాం.రెండు నెలల తర్వాత ప్రైమరీ మార్కెట్ మెయిన్ బోర్డు విభాగంలో వస్తున్న ఐపీఓ కావడంతో ఏథర్ ఎనర్జీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పబ్లిక్ ఆఫరింగ్ సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 28, 2025 రోజున మొదలై ఏప్రిల్ 30, 2025 బుధవారం రోజు ముగుస్తుంది. ఏథర్ ఎనర్జీ ఐపీఓ ప్రైస్ బ్యాండ్ రూ.1 ముఖ విలువ గల ఒక్కో ఈక్విటీ షేరు ధరను రూ.304-321గా నిర్ణయించారు. తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.2,626 కోట్లు సమీకరించనుంది. అలాగే ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రమోటర్లు, ఇతర వాటాదారులు 1.1 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తున్నారు.
మొత్తం ఐపీఓ ద్వారా వచ్చిన రూ.927.2 కోట్లను మహారాష్ట్రలో ఎలక్ట్రిక్ టూవీలర్ల తయారీ కేంద్రం ఏర్పాటుకు వినియోగిస్తామని కంపెనీ తెలిపింది. అలాగే రూ.40 కోట్లు రుణాల చెల్లింపుల కోసం, రూ.750 కోట్లను పరిశోధన, అభివృద్ధిలో పెట్టుబడి పెట్టేందుకు, రూ.300 కోట్లను మార్కెటింగ్ కోసం ఉపయోగించనున్నట్లు తెలిపింది. ఈ నిధులను 2026 నుంచి 2028 ఆర్థిక సంవత్సరాల్లో వినియోగించాలని భావిస్తున్నామని తెలిపింది.ఈ ఐపీఓలో 75 శాతం షేర్లను క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్‌కి, 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 10 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. ఉద్యోగుల కోసం 1 లక్ష షేర్లను పక్కన పెట్టారు. ఉద్యోగులకు ఒక్కో షేరును రూ.30 రాయితీతో అందిస్తున్నారు. అన్ లిస్టెడ్ గ్రే మార్కెట్లో ఏథర్ ఎనర్జీ ఐపీఓ షేర్ల జీఎంపీ చూసుకుంటే ప్రస్తుతం రూ.3 ప్రీమియం వద్ద ట్రేడవుతున్నాయి. ఐపీఓ ప్రైస్ బ్యాంక్ అప్పర్ ఎండ్, ప్రస్తుత గ్రే మార్కెట్ ప్రీమియం ఆధారంగా ఏథర్ ఎనర్జీ అంచనా లిస్టింగ్ ధర ప్రతి షేరుకు రూ.324గా ఉంది. ఐపీఓ ధర రూ.321తో పోలిస్తే 0.93 శాతం ఎక్కువ.

## హెచ్‌డీఎఫ్‌సీ నుంచి కొత్త స్కీమ్..




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుత రోజుల్లో ఈక్విటీ పెట్టుబడులు పెడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నేరుగా స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయలేని వారు మ్యూచువల్ ఫండ్స్ వైపు మళ్లుతున్నారు. ఒకేసారి పెద్ద మొత్తంలో లంప్‌సమ్ పెట్టుబడి పెట్టలేని వారు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా నెల నెలా కొద్ది కొద్దిగా ఇన్వెస్ట్ చేస్తున్నారు. అలాగే రిటైర్మెంట్ కోసం ప్లాన్ చేసే వారు సిస్టమాటిక్ విత్ డ్రావల్ ప్లాన్ ద్వారా పెన్షన్ మాదిరిగా వెనక్కి తీసుకుంటు న్నారు. ఇలా తమ అవసరాలకు తగినట్లుగా మ్యూచువల్ ఫండ్ స్కీమ్స్ అందుబాటులో ఉంటున్నాయి. అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు సైతం కస్టమర్ల అవసరాలు, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఫండ్స్ అందుబాటులోకి తెస్తున్నా యి.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థ, ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్?సీ మ్యూచువల్ ఫండ్ నుంచి మరో కొత్త స్కీమ్ లాంచ్ అయింది. హెచ్‌డీఎఫ్‌సీ క్రిస్ ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 3-6 మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్ పేరుతో ఈ కొత్త ఫండ్ తీసుకొచ్చింది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 28వ తేదీన మొదలవుతుంది. మే 5, 2025వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.100గా నిర్ణయించారు. అంటే మీ వద్ద వంద ఉంటే ఇందులో చేరవచ్చు.

**ఈ వారంలోనే మరో 3 కొత్త స్కీమ్స్..**

హెచ్‌డీఎఫ్‌సీతో పాటు మరో 3 కొత్త స్కీమ్స్ అందుబాటులోకి వచ్చాయి. అందులో డీఎస్‌పీ సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్ . ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ ఏప్రిల్ 28వ తేదీన మొదలై మే 9వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులోనూ కనీస పెట్టుబడి రూ.100గా నిర్ణయించింది. దీంతో పాటు వస్తున్న మరో స్కీమ్ యూటీఐ మల్టీక్యాప్ ఫండ్ ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ కోసం ఏప్రిల్ 29న వస్తోంది.

మే 13వ తేదీ వరకు ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇందులో కనీస పెట్టుబడిని రూ.1000గా నిర్ణయించారు.ఇక మూడో స్కీమ్ మిరే మ్యూచువల్ ఫండ్స్ నుంచి వస్తోంది. మిరే అసెట్ నిఫ్టీ 50 ఈక్వల్ వెయిల్ ఈటీఎఫ్ . ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ కోసం ఏప్రిల్ 30న ఓపెన్ అవుతోంది. మే 6వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.5 వేలుగా నిర్ణయించారు.

## మే నెలలో భారీగా సెలవులు.. ఫుల్ లిస్ట్ ఇదే!




**హైదరాబాద్ - నవభూమి:** ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరి వద్ద బ్యాంక్ ఖాతా ఉంటుంది. ఏదో ఒక అవసరంతో బ్యాంకుకు వెళ్తుంటాం. ఎంత డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి వచ్చినా కొన్ని పనులు పూర్తి చేయాలంటే కచ్చితంగా బ్యాంక్ బ్యాంచుకు వెళ్లాల్సి వస్తుంది. అలాగే వ్యాపారాలు నిర్వహించే వారు తరుచుగా బ్యాంకుకు వెళ్తుంటారు. బ్యాంక్ ద్వారా తమ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తారు. సాధారణ పొదుపు ఖాతా ఉన్న వారికి సైతం బ్యాంకుతో ఏదో పని ఉంటుంది. అలాంటి వారందరికీ ముఖ్యమైన గమనిక. మే నెలలో బ్యాంకులకు భారీగా సెలవులు ఉన్నాయి. ఏకంగా 12 రోజుల పాటు మూత పడనున్నాయి. మరి ఏ రోజు బ్యాంకులు మూసి ఉంటాయి ? ఏ రోజుల్లో తెరిచి ఉంటాయనే విషయాన్ని తెలుసుకోవడం కీలకం. మే నెల బ్యాంకుల సెలవుల జాబితా తెలుసుకుందాం.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన వార్షిక సెలవుల జాబితా ప్రకారం బ్యాంకులకు రాష్ట్రాల వారిగా వేరు వేరుగా సెలవులు ఉంటాయి. ప్రాంతీయ పండగలు, జాతీయ సెలవులు, రాష్ట్ర పండగల వంటివి మారుతుంటాయి. ఈ క్రమంలో మే నెలలోనే ప్రాంతాల వారీగా వేరు వేరు పండగలు ఉన్నాయి. వాటి ప్రకారమే బ్యాంకులకు సెలవులు ఇస్తుంటారు.

మే 1వ తేదీ గురువారం: మే డే అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు ఉంటుంది. అదే రోజు మహారాష్ట్ర దినోత్సవం కూడా.

మే 4వ తేదీ ఆదివారం: దేశవ్యాప్తంగా బ్యాంకులకు సాధారణ సెలవు ఉంటుంది.

మే 9వ తేదీ శుక్రవారం: రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా బ్యాంకులకు సెలవు

మే 10వ తేదీ శనివారం: నెలలో రెండో శనివారం కాబట్టి బ్యాంకులకు సాధారణ సెలవు

మే 11వ తేదీ ఆదివారం: బ్యాంకులకు వారాంతపు సెలవు

మే 12వ తేదీ సోమవారం: బుద్ధ పౌర్ణిమ సందర్భంగా పలు ప్రాంతాల్లో బ్యాంకులకు సెలవు ఇస్తారు.

మే 16వ తేదీ శుక్రవారం: సిక్కిం స్టేట్ డే సందర్భంగా ఆ రాష్ట్ర వ్యాప్తంగా సెలవు ఉంటుంది.

మే 18వ తేదీ ఆదివారం: వారాంతం కాబట్టి బ్యాంకులకు సాధారణ సెలవు ఉంటుంది.

మే 24వ తేదీ శనివారం: నెలలో నాలుగో శనివారం కాబట్టి బ్యాంకులు మూసి ఉంటాయి.

మే 25వ తేదీ ఆదివారం: వారాంతం సందర్భంగా సాధారణ సెలవు ఉంటుంది.

మే 26వ తేదీ సోమవారం: కాజీ నజ్రుల్ ఇస్లాం పుట్టిన రోజు సందర్భంగా ప్రాంతీయ సెలవు ఉంటుంది.

మే 29వ తేదీ గురువారం: మహారాణా ప్రతాప్ జయంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో బ్యాంకులకు సెలవు ఉంటుంది.

## ఈ బ్యాంకుల్లో ఏకంగా 9.10 శాతం వడ్డీ.. బంపరాఫర్.. 5 లక్షలపై ఎంతొస్తుందంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆర్బీఐ రెపో రేటు తగ్గించినప్పటికీ.. కొన్ని బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు మూడేళ్ల ఎఫ్‌డీలపై 9.1 శాతం వరకు అధిక వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. ఇది సీనియర్ సిటిజన్లకు తమ పెట్టుబడిపై మంచి రాబడి పొందే అవకాశాన్నిస్తుంది. రూ. 5 లక్షలు జమ చేస్తే.. 9.1 శాతం వడ్డీ రేటుతో మూడేళ్ల కాలానికి డిపాజిట్ చేస్తే, మెచ్యూరిటీకి ఎంతొస్తుందో తెలుసుకుందాం.

దేశంలో సాధారణంగా బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీ) వడ్డీ రేట్లను తగ్గిస్తున్నప్పటికీ, సీనియర్ సిటిజన్ల కోసం కొన్ని బ్యాంకులు ఇప్పటికీ ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. ముఖ్యంగా మూడేళ్ల పెట్టుబడి కాలవ్యవధికి ఏకంగా 9.10 శాతం వరకు వడ్డీనిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో చాలా బ్యాంకులు తమ ఎఫ్‌డీ, సేవింగ్స్ ఖాతాల వడ్డీ రేట్లను తగ్గించాయి. ఇలాంటి సమయంలో, మూడేళ్ల వంటి మీడియం టర్మ్ కోసం ఎఫ్‌డీలో పెట్టుబడి పెట్టడం తెలివైన నిర్ణయంగా నిపుణులు సూచిస్తున్నారు. ఈ వడ్డీ రేట్లు రూ. 3 కోట్ల లోపు డిపాజిట్లకు మాత్రమే వర్తిస్తాయి.సీనియర్ సిటిజెన్లకు 9.10 శాతం వడ్డీ..ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సీనియర్ సిటిజన్లకు మూడేళ్ల కాలవ్యవధి గల ఎఫ్‌డీలపై గరిష్టంగా 9.1 శాతం వడ్డీ రేటును అందిస్తోంది. ఇక్కడ రూ. 5 లక్షలు డిపాజిట్ చేసినట్లయితే 9.10 శాతం వడ్డీ లెక్కన సీనియర్ సిటిజెన్లకు మెచ్యూరిటీకి రూ. 6,54,944 వస్తుంది. ఇక్కడ వడ్డీనే రూ. 1.54 లక్షలకుపైగా వస్తుందని చెప్పొచ్చు.

నార్త్‌ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సీనియర్ సిటిజన్లకు మూడేళ్ల కాలవ్యవధి గల ఎఫ్‌డీలపై 9 శాతం వరకు వడ్డీ రేటును అందిస్తోంది. ఇక్కడ 5 లక్షలు జమ చేసినట్లయితే మెచ్యూరిటీకి చేతికి రూ. 6,53,025 వస్తుంది.ఇతర బ్యాంకుల విషయానికి వస్తే.. మూడేళ్ల టెన్యూర్ డిపాజిట్లపై జనా స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.75 శాతం, సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.75 శాతం, యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.65 శాతం, ఈక్విటస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 8.25 శాతం వడ్డీ అందిస్తుంది.కాబట్టి, సీనియర్ సిటిజన్లు తమ పెట్టుబడిపై అధిక రాబడి పొందాలనుకుంటే, ఈ బ్యాంకులను పరిశీలించవచ్చు. ఆర్బీఐ రెపో రేటు తగ్గింపు నేపథ్యంలో వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశం ఉండటంతో, ఈ అధిక వడ్డీ రేట్లను లాక్ చేసుకోవడానికి ఇది సరైన సమయం కావచ్చు. నిపుణులు కూడా ఇదే చెబుతున్నారు. ఇప్పటికీ దిగ్గజ బ్యాంకులు ముఖ్యంగా ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటివి కూడా ఇప్పటికే డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గించడంతో పాటు.. కొన్ని స్పెషల్ డిపాజిట్లను కూడా నిలిపివేశాయి.

## మే 1 నుంచి ఫ్లిప్‌కార్ట్ మెగా సేల్.. కస్టమర్లకు జాక్‌పాట్.. ఈ వస్తువులపై 50% తగ్గింపు..




**హైదరాబాద్ - నవభూమి:**ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్ త్వరలో మెగా సేల్ మొదలుపెట్టనుంది. కోట్లాది మంది కస్టమర్ల కోసం SASA LELE సేల్‌ను తీసుకురాబోతోంది. ఈ సేల్ మే 2, 2025 నుంచి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో ప్రారంభమవుతుంది.ఈ సమయంలో మీకు ఇష్టమైన స్మార్ట్‌ఫోన్‌ల నుంచి పెద్ద పెద్ద గృహోపకరణాల వరకు అన్నీ సరసమైన ధరకు కొనుగోలు చేయవచ్చు. మీరు ఫ్లిప్‌కార్ట్ ప్లస్ సభ్యులైతే ఒక రోజు ముందుగానే అంటే మే 1, 2025 నుంచి %ూాూూా రాజూాజు% సేల్‌ను సద్వినియోగం చేసుకునే అవకాశం లభిస్తుంది.

**ఎస్‌బీఐతో కార్డుంటే బంపర్ ఆఫర్..**

ఈ సేల్ కోసం ఫ్లిప్‌కార్ట్ దేశంలోని అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో చేతులు కలిపింది. SBI క్రెడిట్ కార్డ్ ద్వారా చెల్లింపు చేసే కస్టమర్లు 10 శాతం వరకూ తగ్గింపును పొందుతారు. పూర్తి చెల్లింపు లేదా EMIలో కొనుగోలు చేసే వారికీ ఈ డిస్కౌంట్ వర్తిస్తుంది. దీనితో పాటు సేల్ ఆఫర్‌లో కస్టమర్లకు ఎక్స్ఛేంజ్ ఆఫర్, నో కాస్ట్ EMI ఆఫర్లు లభిస్తాయి. ఈ సేల్‌లో ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లకు 50 శాతం వరకు భారీ తగ్గింపులను ఉండబోతున్నాయి.

**ప్రత్యేక డీల్స్**

ఈ సేల్ ఆఫర్‌లో కస్టమర్‌లు బ్లాక్‌బస్టర్ డీల్‌లు పొందవచ్చు. రోజులో అతిపెద్ద, పరిమిత కాల ఆఫర్ డీల్‌లు ఉంటాయి.

SASA LELE సేల్‌లో ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లకు బై 1 గెట్ 1 ఆఫర్‌ను కూడా అందిస్తోంది.

కొత్త సేల్‌లో కస్టమర్లకు డబుల్ డిస్కౌంట్ ఆఫర్ కూడా లభిస్తుంది. అంటే ఒకే ఉత్పత్తిపై రెండు వేర్వేరు ఆఫర్‌లు వస్తాయి.

ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లకు జాక్‌పాట్ డీల్స్ లభిస్తాయి. చాలా తక్కువ ధరకే ఖరీదైన వస్తువులను కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

ఫ్లిప్‌కార్ట్ రాబోయే సేల్‌లో టిక్‌టాక్ డీల్స్ కూడా ఉంటాయి. ఇందులో కంపెనీ కొన్ని ప్రత్యేక ఉత్పత్తులపై కొన్ని గంటల పాటు అంటే పరిమిత సమయం వరకు అద్భుతమైన ఆఫర్లు పొందవచ్చు.

చౌకగా ఐఫోన్ కొనే ఛాన్స్

మీరు ఐఫోన్ కొనాలని ప్లాన్ చేస్తుంటే ఫ్లిప్‌కార్ట్ SASA LELE సేల్ మీకు గొప్ప అవకాశాన్ని ఇవ్వబోతోంది. ఈ సేల్‌లో ఫ్లిప్‌కార్ట్ ఐఫోన్‌లపై భారీ డిస్కౌంట్లను అందిస్తోంది. దీని ద్వారా డబ్బును చాలా ఆదా చేసుకోవచ్చు. SASA LELE సేల్‌లో ఐఫోన్ 14 సిరీస్, ఐఫోన్ 15 సిరీస్‌లలో భారీ డిస్కౌంట్లు ఉంటాయి. దీనితో పాటు ఐఫోన్ 16, ఐఫోన్ 16 లలో మంచి ఆఫర్‌లు ఉంటాయి.


**భారీ డిస్కౌంట్**

ఈ సమయంలో భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోని ప్రజలు తీవ్రమైన ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. కాబట్టి ప్రస్తుతం %AC% కి డిమాండ్ ఎక్కువగా ఉంది. మీరు కొత్త కొనాలని ప్లాన్ చేస్తుంటే ఫ్లిప్‌కార్ట్ SASA LELE సేల్‌లోబ్రాండెడ్ AC లను చౌక ధరకే కొనుగోలు చేసే అవకాశం లభిస్తుంది.

## దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు ఇవీ

**హైదరాబాద్ - నవభూమి:**ఇటీవల స్వల్పంగా కరెక్షన్‌కు లోనైన బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. స్వల్ప మార్పులు మినహా రేట్లల్లో పెద్ద వ్యత్యాసం లేదు. తాజా సమాచారం ప్రకారం, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.90,00గా ఉంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.98,210గా ఉంది. ఇక కేజీ వెండి ధర రూ.1,01,800గా ఉంది. ఇక దేశంలోని ఆయా ప్రాంతాల్లో కూడా బంగారం ధరల్లో స్వల్ప మార్పులు కనిపించాయి.ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 99 వేల మార్కును చేరుకుంది. ప్రస్తుతం రూ.99, 080గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం రూ.90,450గా ఉంది. వెండి ధర లక్షకు చేరువుగా రూ.99,600గా ఉంది. ఇక విజయవాడలో 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.90,050గా, విశాఖపట్నంలో రూ.90,050గా ఉంది.

ఇతర ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (22కే, 24కే)
ఢిల్లీ: 90,170 98,310
ముంబై: 90,020 98,210
చెన్నై: 90,120 98,320
బెంగళూరు: 90,120బీ 98,320
కోల్‌కతా: 90,020బీ 98,210
అహ్మదాబాద్: 90,020బీ ?98,210



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ సోమవారం 28 ఏప్రిల్ 2025

## పహల్గాం దాడికి ముందు 22 గంటలపాటు ఉగ్రవాదుల

**శ్రీనగర్--నవభూమి:**పహల్గాం సమీపంలోని బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడి యావత్ దేశాన్ని ఉలిక్కిపాటుకు గురిచేసింది. పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన ఈ మారణహోమంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఓ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. పర్యాటకులను చంపేందుకు టెర్రరిస్టులు పెద్ద ప్రణాళికే రచించినట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులు పహల్గాంకు చేరుకునేందుకు దాదాపు 22 గంటలపాటు ట్రెక్కింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలింది. విశ్వసనీయ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. తమ ప్రణాళికను అమలుచేసేందుకు టెర్రరిస్టులు కోకెర్నాగ్



అడవుల నుంచి బైసరన్ లోయ వరకు కాలినడకన వచ్చినట్లు తెలుస్తోంది. దాడి సమయంలో ఉగ్రవాదులు స్థానికుడి నుంచి ఒకటి, పర్యాటకుడి నుంచి మరొకటి మొబైల్ ఫోన్లు దొంగలించినట్లు తేలింది. ఈ మారణహోమంలో మొత్తం నలుగురు ఉగ్రవాదులు పాల్గొన్నారు. వారిలో ముగ్గురు విదేశీయులు కాగా, మరొకడు స్థానిక ఉగ్రవాది ఆదిల్ థోకర్‌గా గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్‌బెహారాకు సమీపంలోని గురీ అనే చిన్న గ్రామానికి చెందిన ఆదిల్.. టీనేజ్‌లో ఉండగానే పలు నిషేధిత ఉగ్ర సంస్థలకు అనుగుణంగా పనిచేశాడు. 2018లో దక్షిణ కశ్మీర్‌లో ఓ ఉగ్రవాది అంతిమయాత్రలో పాల్గొన్నాడు.

## ప్రధాన ఓడరేవులో భారీ పేలుడు.. 14 మంది మృతి, 750 మందికి గాయాలు



**శ్రీనగర్--నవభూమి:**ఇరాన్‌లోని ఒక ప్రధాన ఓడరేవు శనివారం భారీ పేలుళ్లలో దద్దరిల్లింది. ఈ తర్వాత పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.క్షిపణి ఇంధనం తయారీలో ఉపయోగించే రసాయన పదార్థాల నిల్వల కారణంగా ఈ పేలుడు సంభవించినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 14మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 750 మందికి గాయాలయ్యాయి. పేలుడు జరిగిన కొన్ని గంటల తర్వాత హెలికాప్టర్లు మంటలను అదుపు చేసేందుకు నీటిని చల్లుతూ కనిపించాయి. ఇరాన్, అమెరికా దేశాలు తమ వేగంగా అభివృద్ధి చెందుతున్న అణు కార్యక్రమంపై చర్చల కోసం ఒమన్‌లో సమావేశమైన సమయంలో ఈ పేలుడు సంభవించడం గమనార్హం. %జూశ్రీంశీ =ఝు% - విష్ణు వర్సెస్ గంటా.. లడాయి ఇప్పటిది కాదుగా ..! ఈ పేలుడు దాడి వల్ల జరిగిందని ఇరాన్‌లో ఎవరూ కన్ఫాం చేయనప్పటికీ.. చర్చలకు నేతృత్వం వహిస్తున్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి బుధవారం ఒక కీలక వ్యాఖ్య చేశారు. చట్టబద్ధమైన ప్రతిస్పందన కోసం రెచ్చగొట్టేలా విధ్వంసం, హత్యాయత్నాల గత సంఘటనలను దృష్టిలో ఉంచుకుని తమ భద్రతా దళాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయని ఆయన అంగీకరించారు. ఇరాన్ హోం మంత్రి ఎస్కందర్ మొమెనీ ప్రభుత్వ టెలివిజన్‌లో మాట్లాడుతూ మృతుల సంఖ్యను వెల్లడించారు. అయితే బందర్ అబ్బాస్ వెలుపల సంభవించిన ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలపై స్పష్టమైన సమాచారం లేదు. శనివారం రాత్రి వరకు మంటలు కొనసాగాయని తెలుస్తోంది. దీని కారణంగా ఇతర కంటైనర్లు కూడా పేలినట్లు సమాచారం. ఓ భద్రతా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. ఓడరేవుకు క్షిపణి ఇంధనం కోసం రసాయనాలు దిగుమతి అయ్యాయి. విద్యార్థిగా వెళ్లి టెర్రరిస్ట్ గా తిరిగొచ్చాడు.. ఉగ్రవాది అదిల్ బ్యాగ్రౌండ్ ఇదీ ప్రైవేట్ భద్రతా సంస్థ ఎంబ్రే తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి నెలలో సోడియం పర్‌క్లోరేట్ రాకెట్ ఇంధనం సరుకు ఓడరేవుకు చేరుకుంది. ఈ ఇంధనం చైనా నుండి రెండు నౌకల ద్వారా ఇరాన్‌కు పంపబడిన సరుకులో భాగం. దీని గురించి జనవరిలో ఫైనాన్షియల్ టైమ్స్ మొదట నివేదించింది. గాజాలో హమాస్‌తో జరిగిన యుద్ధ సమయంలో ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడుల కారణంగా క్షీణించిన ఇరాన్ క్షిపణి నిల్వలను తిరిగి ఏర్పాటు చేయడానికి ఈ ఇంధనాన్ని ఉపయోగించాల్సి ఉంది. పాక్‌లో ఆ బాధ్యత ఎవరిది? ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులలో ఉపయోగించడానికి పంపబడిన ఇంధనం సరుకును సరిగ్గా నిల్వ చేయకపోవడం వల్ల ఈ అగ్ని ప్రమాదం సంభవించింది. నౌకల కదలికల డేటా ప్రకారం.. రసాయనాలను తీసుకువెళుతున్న నౌకలలో ఒకటి.. మార్చి నెలలో ఈ ప్రాంతంలో ఉన్నట్లు భావిస్తున్నారు. అయితే ఈ సరుకు చేరినట్లు ఇరాన్ ధృవీకరించలేదు. దీనిపై స్పందించాలని కోరినప్పటికీ ఐక్యరాజ్యసమితిలోని ఇరాన్ మిషన్ శనివారం సమాధానం ఇవ్వలేదు. ముఖ్యంగా 2020లో బీరూట్ ఓడరేవులో జరిగిన భారీ పేలుడు తర్వాత ఇరాన్ ఈ రసాయనాలను ఓడరేవు నుండి ఎందుకు తరలించలేదో స్పష్టంగా తెలియదు. అధికంగా పేలుడు పదార్థమైన అమ్మోనియం నైట్రేట్ మండటం వల్ల సంభవించిన ఆ పేలుడులో 200 మందికి పైగా మరణించగా, 6,000 మందికి పైగా గాయపడ్డారు.

## ట్రంప్‌కి మతిభ్రమించిందా?

### కశ్మీర్ కోసం భారత్, పాక్‌లు 1500 ఏళ్లుగా కొట్టుకుంటున్నాయా?

**శ్రీనగర్--నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్‌ల మధ్య నెలకున్న ఉద్రిక్తతల వేళ.. కశ్మీర్ సమస్యపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 1,000 లేదా 1,500 సంవత్సరాలుగా కశ్మీర్ కోసం కొట్టుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. దీంతో ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల కోసం వాటికన్‌కు వెళ్లే ముందు ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ... భారత్, పాక్ సంబంధాల గురించి ఆయన స్పందించారు. భారత్‌తోనూ, పాకిస్థాన్‌తోనూ తనకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పారు. కశ్మీర్ సమస్యకు రెండు దేశాలు ఏదో ఒక పరిష్కారం కనుగొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి చాలా బాధాకరమని ఆయన అన్నారు.

**ట్రంప్ వ్యాఖ్యల మర్మమేంటో?**

కాగా, ట్రంప్ వ్యాఖ్యలపై నెటిజన్లు స్పందిస్తూ.. 'ఆయన చాలా ఇబ్బందికరంగా మాట్లాడుతున్నారు' అని.. 'కశ్మీర్ వివాదం గురించి ఆయనకే బాగా తెలుసు' పలువురు వ్యంగ్యంగా కామెంట్లు పెడుతున్నారు. 'వివిధ కాలాల్లో భూభాగాల పేర్లు మారినా, అదే ప్రాంతంపై గిరిజన యుద్ధాలు 8వ శతాబ్దం నుంచే ఉన్నాయి. మంచి ప్రయత్నం' అని ఇంకొకరు కామెంట్ చేశారు.కొందరు విశ్లేషకులు ఆయన వ్యాఖ్యలను.. నేరుగా అమెరికా జోక్యం లేకుండానే భారత్, పాకిస్థాన్‌లు కశ్మీర్ సమస్య పరిష్కారానికి ప్రోత్సాహం ఇచ్చే ప్రయత్నంగా చూస్తున్నారు. ఇంకొంత మంది మాత్రం, ట్రంప్ వ్యాఖ్యలు భారత్ తన భద్రతా ఆందోళనలను పరిష్కరించేందుకు స్వేచ్ఛ ఇచ్చినట్లుగా భావించే అవకాశం ఉందని అంటున్నారు. గతంలో కశ్మీర్ వివాదంపై తాను మధ్యవర్తిత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు ట్రంప్ ఇచ్చిన ఆఫర్‌ను భారత్ తిరస్కరించింది. ఇది తమ అంతర్గత వ్యవహారమని, ఇందులో ఎవరి జోక్యం అవసరమ లేదని తేల్చిచెప్పింది.కానీ, కశ్మీర్ అంశాన్ని 1000-1,500 ఏళ్ల నాటి సంఘర్షణగా ట్రంప్ చిత్రీకరించిన మాటలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎందుకంటే, భారత్, పాకిస్థాన్‌లు అనే ఆధునిక దేశాలు 1947లో బ్రిటిష్ వలస పాలన ముగిసిన తర్వాత మాత్రమే ఏర్పడ్డాయి. దేశ విభజన జరిగి 75 ఏళ్లు అయ్యింది. ఆ సమయంలోనే కశ్మీర్ వివాదం మొదలైంది. ఈ లెక్కన కశ్మీర్ సమస్య మొదలై 75 ఏళ్లు అవుతుంది. మరి ట్రంప్ ఏ ప్రాతిపదిక 1000-1,500 ఏళ్లు అంటున్నారు. ఆయన చెప్పినట్టే కశ్మీర్ సమస్య 1,500 ఏళ్లుగా ఉందని అనుకుందాం.. మరి భారత్‌లోకి అరబ్బులు అడుగుపెట్టిందే క్రీ.శ 712లో. అంటే, అప్పుడే కశ్మీర్ వివాదం మొదలైందా? ఆయన ఏ ఆధారాలతో ఈ వ్యాఖ్యలు చేశారో? ట్రంప్‌నకే ఎరుక.అరబ్బుల దండయాత్ర

ఇది భారత ఉపఖండ చరిత్రలో ఒక ముఖ్యమైన సంఘటన. క్రీ.శ 8వ శతాబ్దంలో (712 సంవత్సరం), ఖలీఫా అల్-వలీద్ ఆదేశాలతో అరబ్బు సైన్యానికి చెందిన యువ సేనాధిపతి ముహమ్మద్ బిన్ కాసిమ్ సింధు దేశంపై దండయాత్ర చేశాడు. సింధు ప్రాంతంలో ఉన్న హిందూ రాజులు అరబ్బు వ్యాపార నౌకలను దోచుకున్నారని ఆరోపణ, వ్యాపార మార్గాలను సురక్షితంగా ఉంచాలనే ఉద్దేశం, ఇస్లాం మతవ్యాప్తి, ఆర్థిక వనరులు, శక్తిని పెంచుకోవాలన్న లక్ష్యంతో ఈ దండయాత్ర కాసిమ్ సాగించాడు. తొలుత ముఖ్యమైన రాజా దాహిర్ ఓడించి, ఆయన రాజధాని అలోర్ (ప్రస్తుత పాకిస్తాన్‌లోని సుక్కూర్ ప్రాంతం)ను తన అధీనంలోకి తీసుకున్నాడు. సింధు నదీ లోయలో అరబ్బులు తొలిసారి అడుగుపెట్టారు. ముస్లిం పరిపాలన, ఇస్లాం మతం ప్రవేశానికి ఇదే ఆరంభం.

**కశ్మీర్ వివాదం**

భారత ఉప-ఖండంలో 1947లో బ్రిటిష్ వలస పాలన ముగిసింది. పోతూపోతూ బ్రిటిషర్లు దేశాన్ని రెండు ముక్కలుగా చేశారు. భారత్, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు ఏర్పడ్డాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలోని 562 సంస్థానాలు ఉండేవి. స్వాతంత్ర్యం సమయంలో ఈ సంస్థానాలకు మూడు ఎంపికలు ఇచ్చారు: 1. భారతదేశంతో కలవడం. 2. పాకిస్తాన్‌తో కలవడం. 3. స్వతంత్రంగా ఉండటం. అయితే, కేవలం మూడు సంస్థానాలు తప్పా మిగతావి బేషరతుగా భారత యూనియన్‌లో విలీనమయ్యాయి. నాటి హోం మంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఈ సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన, ఆయన సెక్రటరీ వి.పి. మీనన్ కలిసి సంస్థానాధిపతులను ఒప్పించి, చాలా వరకు చర్చల ద్వారా విలీనం జరిగింది.కానీ, హైదరాబాద్, జమ్మూ కశ్మీర్, జునాగఢ్ విలీనం కాలేదు. హైదరాబాద్‌ను పాలించే నిజాం స్వతంత్రంగా ఉండాలి కోరుకున్నాడు. చివరికి 1948లో 'పోలీస్ యాక్షన్' (ఆపరేషన్ పోలో 1948) ద్వారా హైదరాబాద్ విలీనం చేశాడు. జునాగఢ్ నవాబు పాకిస్థాన్‌తో కలవాలనుకున్నాడు. కానీ భారత్‌లో చేరాలన్న ప్రజల ఒత్తిడితో విలీనానికి తలొగ్గాడు..

కానీ, జమ్మూ కశ్మీర్ సంస్థానాధీశుడు రాజా హరిసింగ్ తటస్థంగా ఉండాలని భావించారు. కానీ, ఊహించని రీతితో పాకిస్థాన్ దాడి తర్వాత మహారాజా హరిసింగ్ భారత్‌లో విలీన పత్రంపై సంతకం చేశారు. ఇది కశ్మీర్ సమస్యకు మూలకారణమైంది.

**దాయాదుల మొదటి యుద్ధం**

దీని ఫలితంగా విభజన జరిగిన ఏడాదికే భారత్-పాకిస్థాన్ మధ్య మొదటి యుద్ధం జరిగింది (1947-48).ఆ యుద్ధం తర్వాత కశ్మీర్‌లో కొంత భాగం భారత్‌లో ఉండిపోగా.. మరికొంత పాకిస్థాన్ ఆక్రమించుకుంది.


## పహల్గామ్ దాడిపై ఐరాస ప్రకటన



**శ్రీనగర్--నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి.. ఈ దారుణానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని కోరింది. అంతేకాదు, ఉగ్రవాదులకు మద్దతిస్తూ.., ఆర్థికంగా సాయపడుతోన్న వాళ్లను కూడా బాధ్యులను చేసి చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు అమెరికా ప్రతిపాదనను ఆమోదిస్తూ భద్రతా మండలికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తోన్న ఫ్రాన్స్ ఓ ప్రకటన చేసింది. ఉగ్రవాదులను శిక్షించాలని మండలి నొక్కి చెప్పింది. అయితే, 2019 నాటి పుల్వామా ఆత్మాహుతి దాడిలో భారత ప్రభుత్వానికి సహకరించాలని కోరింది.

కానీ ఈసారి భారత పేరు చెప్పకుండా 'అన్ని సంబంధిత అధికారులకు' సహకరించాలని పేర్కొంది. కానీ ఈ ప్రకటనను చైనా మద్దతుతో దాయాది నీరుగార్చడానికి ప్రయత్నించింది. పహల్గామ్ ఉగ్రదాడిలో తమ ప్రమేయం లేదని పాకిస్థాన్ బుకాయించింది. అంతేకాదు, ప్రకటనలోని పదాలను మార్చడానికి చైనా, పాక్‌లు ప్రయత్నించాయి. ఈ దాడిలో తమ ప్రమేయం లేదని చెబుతూనే.. ప్రాణనష్టంపై విచారం వ్యక్తం చేస్తున్నట్టు మొసలి కన్నీళ్లు కార్చింది.అయితే, ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించిన భద్రతా మండలి.. 'ఉగ్రవాదం అన్ని రూపాల్లో అంతర్జాతీయ శాంతికి, భద్రతకు తీవ్రమైన ముప్పుగా పరిణమించింది' అని పేర్కొంది. ఇలాంటి చర్యలు ఎక్కడ, ఎప్పుడు, ఎవరు చేసినా నేరమని యూఎన్ఎస్సీ తెలిపింది. అమెరికా ప్రతిపాదనపై ఏకాభిప్రాయం రావడానికి ముందు అనేక చర్చలు జరిగాయి. పాకస్థాన్, చైనాతో కలిసి ప్రకటనలోని పదాలను మార్చడానికి ప్రయత్నించింది. గతంలో పుల్వామా, జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు దాడి వంటి ఉగ్రదాడులను మండలి ఖండించింది. స్థానిక ప్రభుత్వానికి సహకరించాలని కోరింది.కానీ, ఐరాస ప్రకటనలో భారత ప్రభుత్వ ప్రస్తావన ఉంటే తమను ఇబ్బంది తప్పదని పాక్ భావించింది. ఈ ప్రకటనకు ముందు చైనాతో అభ్యంతరం చెప్పించింది. అలాగే, అందుకే తెలివిగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దాడిపై 'నిష్పక్షపాతంగా, పారదర్శకంగా' విచారణ జరుపుతామని చెప్పారు. అందుకే భారత ప్రభుత్వం అనే ప్రస్తావించకుండా.. సంబంధిత అధికారులకు సహకరించాలని ఐరాస తన ప్రకటనలో తెలిపింది.మరోవైపు, భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో జరుగుతున్న పరిణామాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని, దీన్ని ఐరాస నిశితంగా గమనిస్తోందని ఒక ప్రతినిధి తెలిపారు. పరిస్థితి మరింత దిగజారకుండా చూడాలని భారత్, పాక్‌లను కోరింది.ఇదిలా ఉండగా... పహల్గామ్ దాడితో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన స్థానికులు.. అనుకోని పరిస్థితులు ఎదురైతే తమను తాము రక్షించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటు న్నారు. శత్రువుల దాడుల నుంచి రక్షణగా ప్రభుత్వం కొన్నేళ్లుగా బంకర్లను నిర్మిస్తోంది. ఈ బంకర్లలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. తమ పంటలను కోసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లనున్నట్లు స్థానికులు తెలిపారు.

## ఆ నేవీ అధికారి భార్య నా స్నేహితురాలు.. యూట్యూబర్ ఎల్విష్ యాదవ్ వెల్లడి



**శ్రీనగర్--నవభూమి:**ఈ నెల 22న జమ్ముకశ్మీర్ లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. మహిళలు, పిల్లలను విడిచిపెట్టి పురుష పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఒక్కక్కరిని పేర్లు అడుగుతూ కాల్చిచంపారు. ఈ కాల్పుల్లో మరణించిన 26 మంది పర్యాటకుల్లో ఇండియన్ నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కూడా ఒకరు. లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్, ఆయన భార్య హిమాన్షి నర్వాల్ బైసరాన్ లోయలోని ఓ చోట బేల్‌పూరీ తింటుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. నర్వాల్ తలలో బుల్లెట్ దిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆ హఠాత్పరిణామానికి బిత్తరపోయిన హిమాన్షి నర్వాల్ గుండెలవిసేలా రోధించింది. ఆఖరికి అలిసిపోయి భర్త మృతదేహం పక్కనే దిక్కు తోచని స్థితిలో కూర్చుండిపోయింది. హిమాన్షి తన భర్త డెడ్ బాడీ పక్కన దీనంగా కూర్చుని ఉన్న ఆ ఒక్క ఫొటోతో క్రూరాతిక్రూరమైన పహల్గాం ఉగ్రదాడి కళ్లముందు కదలాడుతుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ యూట్యూబర్, బిగ్ బాస్ ఓటీటీ విన్నర్ అయిన ఎల్విస్ యాదవ్.. ఇటీవలి ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన నేవీ అధికారి వినయ్ నర్వాల్‌కు, తనకు ముందు ఉన్న సంబంధం గురించి వెల్లడించాడు. వినయ్ భార్య హిమాన్షి నర్వాల్, తాను ఇద్దరం క్లాస్‌మేట్స్‌మని, గుర్గావ్‌లో ఇద్దరం కలిసి చదువుకున్నామని చెప్పాడు. కాలేజీ రోజుల్లో హిమాన్షి, తాను మంచి స్నేహితులమని, ఇద్దరం కలిసి మెట్రోస్టేషన్‌కు వెళ్లేవాళ్లమని ఆయన గుర్తుచేసుకున్నాడు. 2018లో కాలేజీ పూర్తయిన తర్వాత కలుసుకోలేదని చెప్పాడు. ఉగ్రదాడి ఘటనకు సంబంధించిన ఫొటోలో భర్త పక్కన కూర్చున్న హిమాన్షిని తాను ముందుగా గుర్తుపట్టలేదని, ఆమెలా ఉందని పరిశీలించి చూడటంతో ఆమే హిమాన్షి అని గుర్తించానని తెలిపాడు. ఆమె ఫోన్ నంబర్ కూడా తన దగ్గర ఉందని, కానీ ఆ పరిస్థితుల్లో ఫోన్ చేయడం కరెక్ట్ కాదని భావించి చేయలేదని చెప్పాడు. ఆ తర్వాత తాను మా ఇద్దరికీ క్లోజ్‌గా ఉండే ఓ ఫ్రెండ్‌ను కలిశానని, అతడు 30 సార్లు కాల్ చేసినా హిమాన్షి తీయలేదని, 31వ సారికి లిఫ్ట్ చేసిందని చెప్పాడు.అప్పుడు ఆమెకు ధైర్యం చెప్పి పెట్టేశామని, ఆమె ఉన్న పరిస్థితుల్లో ప్రతి ఫోన్ లిఫ్ట్ చేసి సమాధానం చెప్పడం కష్టమేనని ఎల్విస్ యాదవ్ పేర్కొన్నాడు. కాగా ఈ నెల 16ననే వినయ్ నర్వాల్, హిమాన్షిల వివాహం జరిగింది. ఈ నెల 19న విందు కార్యక్రమం జరిగింది. ఈ నెల 21న దంపతులిద్దరూ పహల్గాంకు హనీమూన్ వెళ్లారు. 22న ఉగ్రవాదుల దాడిలో వినయ్ నర్వాల్ ప్రాణాలు కోల్పోయాడు. పెళ్లయ్యి వారం రోజులు కూడా తిరగకముందే విధి ఆ ఇద్దరినీ విడదీసింది.

## టైమింగ్‌లో ఇండిగో టాప్.. ఏడాదిలో ఫ్లైట్ జర్నీల వృద్ధి ఎంతంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో విమానయానం అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా మార్చి నెలకు సంబంధించి దేశ వ్యాప్తంగా సాగిన విమాన ప్రయాణాలకు సంబంధించిన నివేదిక సిద్ధమైంది. గత ఏడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది అదే నెలలో వృద్ధి రేటు 8.79 శాతం ఉండటం గమనార్హం. దీనికి సంబంధించిన అధికారిక గణాంకాలు తాజాగా విడుదలయ్యాయి. ఈ మార్చి మొత్తం కలిపి 1.33 కోట్ల మందికి సేవలు అందించినట్లుగా పేరకొన్నారు. దేశీయ ప్రయాణికులకు సంబంధించి తాజా రిపోర్టులో పేర్కొన్న అంశాల్ని చూస్తే.. మార్చిలో మొత్తం దేశీయ ప్రయాణాల్లో ఇండిగో టాప్ లో నిలిచింది. ఈ సంస్థకు చెందిన విమానాల్లో 93.1 లక్షల మంది ప్రయాణాలు చేశారు. మొత్తం మార్కెట్ వాటాలో ఇండిగో వాటా 64 శాతం. ఆ తర్వాతి స్థానంలో ఎయిర్ ఇండియా గ్రూపు నిలిచింది. ఈ సంస్థ కింద ఎయిర్ ఇండియా.. ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ బ్రాండ్లు ఉన్నాయి. మార్చిలో 38.8 లక్షలమంది ప్రయాణికుల్ని చేరవేయటం ద్వారా 26.7 శాతం వాటానుసొంతం చేసుకుంది. ఈ రెండు సంస్థల తర్వాత ఆకాశ ఎయిర్ 7.2 లక్షల మంది ప్రయాణికుల్ని వారి గమ్యస్థానాలకు చేరవేయటం ద్వారా ఆరు శాతం మార్కెట్ వాటాను సొంతం చేసుకుంది. ఇక.. స్పైస్ జెట్ విషయానికి వస్తే 4.8 లక్షల మంది ప్రయాణికుల్ని వారి గమ్యస్థానాలకు చేరవేయటం ద్వారా 3.3 శాతం వాటాను సొంతం చేసుకుంది. టైమింగ్ విషయంలో ఇండిగో టాప్ గా నిలిచింది. కచ్చితమైన సమయ వేళల్ని పాటించే విషయంలో ఇండిగో 88.1 శాతంతో తొలిస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో ఆకాశ ఎయిర్ 86.9 శాతంలో నిలిచింది. ఎయిరిండియా గ్రూపు 82 శాతంతో మూడో స్థానంలో.. స్పైస్ జెట్ 72.1శాతంతో తర్వాతి స్థానంలో నిలిచింది.

## చీర్‌లీడర్ల సెలెక్షన్ ఎలా జరుగుతుందో తెలుసా?



**ముంబై-నవభూమి:**ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) రసవత్తరంగా కొనసాగుతోంది. ఈ 45రోజులకు క్రికెట్ ప్రియులకు పండుగనే చెప్పాలి. మ్యాచ్ ల సమయంలో ఫోర్లు, సిక్సర్లు పడిన వెంటనే కెమెరా దృష్టి మొదట చీర్‌లీడర్స్‌పైన పడుతుంది. ఈ చీర్‌లీడర్స్ తమ జట్టు వికెట్లు లేదా ఫోర్లు, సిక్సర్లను సెలబ్రేట్ చేయడానికి ఉంటారు. మ్యాచ్ ఉత్సాహాన్ని నిలబెట్టడానికి, ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి వారి ఉత్సాహం తగ్గకుండా చూసేందుకు ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో చీర్‌లీడర్స్‌ను నియమిస్తారు. అంతేకాకుండా, చీర్‌లీడర్స్ ఆటగాళ్లలో కూడా ఉత్సాహాన్ని నింపే పని చేస్తారు. అయితే చీర్‌లీడర్‌గా మారడానికి ఎవరు ఇంటర్వ్యూ చేస్తారు..

ఏదైనా ఐపీఎల్ ఫ్రాంచైజీలో చీర్‌లీడర్ల సెలక్షన్ ప్రక్రియ చాలా కఠినంగా ఉంటుంది. టీమ్ మేనేజ్‌మెంట్ లేదా స్పాన్సర్‌లు వీరిని ఇంటర్వ్యూ చేస్తారు. ఈ ఇంటర్వ్యూలు వీడియో లేదా పర్సనల్ గా నిర్వహిస్తారు. ఇంటర్వ్యూ సమయంలో చీర్‌లీడర్ డ్యాన్స్, మోడలింగ్ నైపుణ్యాలను టెస్ట్ చేస్తారు. దీనితో పాటు, వేలాది మంది ప్రేక్షకులు నిండిన స్టేడియంలో చీర్‌లీడర్స్ ఆటగాళ్ల ఉత్సాహాన్ని ఎలా పెంచగలరో కూడా పరిశీలిస్తారు. చీర్‌లీడర్‌లను ఎన్నుకునేటప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్ వారిలో ఆటగాళ్లు, జట్టుతో సఖ్యతను ఏర్పరచుకునే కెపాసిటీ వారికి ఉందో లేదో కూడా చూస్తుంది. అలాగే వారు జట్టును మెరుగుపరచడంలో ఏ విధంగా సహాయపడగలరో కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఆదాయం విషయానికి వస్తే చీర్‌లీడర్‌లు లక్షల రూపాయల వరకు సంపాదిస్తారు. మీడియా నివేదికల ప్రకారం.. ఒక సీజన్‌లో వారి సంపాదన మూడు నుండి నాలుగు లక్షల రూపాయలు లేదా అంతకంటే ఎక్కువ కూడా ఉండవచ్చు. చీర్‌లీడర్‌లు ధరించే దుస్తులను పూర్తిగా స్పాన్సర్‌లను దృష్టిలో ఉంచుకుని తయారు చేస్తారు.

ఎందుకంటే వాటి పూర్తి ఖర్చును స్పాన్సర్‌లే భరిస్తారు. వారి దుస్తులలో టీమ్, కంపెనీల లోగోలు ఉంటాయి.

## భారత్ చర్యతో పాకిస్తాన్‌లో రోగులు విలవిల

**శ్రీనగర్--నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ తీసుకున్న చర్యలతో పాక్ కష్టాలు రోజు రోజుకు పెరుగుతు న్నాయి. భారత ప్రభుత్వం పాకిస్తాన్‌తో వాణిజ్య సంబంధాలను నిలిపివేయడంతో మందుల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఔషధాల కొరత ఏర్పడే ప్రమాదం ఉండడంతో సరఫరాను భద్రపరచడానికి పాక్ అత్యవసర చర్యలు ప్రారంభించింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్తాన్‌తో వాణిజ్య సంబంధాలను నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయం పాకిస్తాన్ ఆరోగ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. భారత్ నుండి దిగుమతి చేసుకునే మందులు, ముడిసరుకుల సరఫరా నిలిచిపోవడంతో పాకిస్తాన్‌లో ఔషధ సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన తర్వాత, పాకిస్తాన్ కూడా గురువారం నాడు న్యూఢిల్లీతో అన్ని వాణిజ్య సంబంధాలను రద్దు చేసుకుంది. దీని ఫలితంగా అవసరమైన ప్రాణాలను కాపాడే మందుల సరఫరా నిలిచిపోయింది. పరిస్థితి



తీవ్రతను గ్రహించిన పాకిస్తాన్ డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీ అత్యవసర చర్యలను ప్రారంభించింది. పాకిస్తాన్‌లో మందుల కొరత ఔషధ రంగంపై నిషేధం గురించి ఇంకా ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ జారీ చేయనప్పటికీ సంక్షోభం ఏర్పడే అవకాశం ఉండడంతో చైనా, రష్యా, అనేక యూరోపియన్ దేశాల నుండి ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను అన్వేషిస్తున్నట్లు పాకిస్తాన్ డ్రగ్ రెగ్యులేటరీ అథారిటీ తెలిపింది. ఏజెన్సీ ప్రత్యేకంగా యాంటీ-రేబీస్ వ్యాక్సిన్, యాంటీ-స్నేక్ వెనమ్, క్యాన్సర్ థెరపీ, మోనోక్లోనల్ యాంటీబాడీస్ వంటి మందుల దిగుమతులను తీసుకురావడంపై దృష్టి సారించింది. సన్నాహాలు కొంతవరకు భరోసా కలిగిస్తున్నప్పటికీ, తక్షణమే చర్యలు తీసుకోకపోతే పాకిస్తాన్ తీవ్రమైన ఔషధ సంక్షోభాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉగ్రవాది అదిల్ బ్యాగ్రౌండ్ ఇదీ ప్రభుత్వానికి విజ్ఞప్తి ఇదిలా ఉండగా, పాకిస్తాన్ ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్‌లో ప్రభుత్వ అధికారులను కలిసి ఔషధ రంగానికి వాణిజ్య నిషేధాల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరింది. అనేక ప్రాణాలను కాపాడే మందులకు అవసరమైన ముడిసరుకు కేవలం భారత్ నుండి మాత్రమే లభిస్తుందని వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారులతో జరిగిన సమావేశాలలో వారు నొక్కి చెప్పారని అధ్యక్షుడు తౌకీర్-ఉల్-హక్ తెలిపారు. రోగుల ప్రాణాలను కాపాడటానికి ఆరోగ్య రంగాన్ని నిషేధం నుండి మినహాయించాలని ప్రతినిధి బృందం ప్రత్యేక పెట్టుబడి సౌకర్యాల మండలి కి కూడా విజ్ఞప్తి చేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ సోమవారం 28 ఏప్రిల్ 2025



# అతను నా మాట మాత్రమే వింటాడు!

'కేజీఎఫ్' ఫ్రాంఛైజీ చిత్రాలతో యువతలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది కన్నడ భామ శ్రీనిధి శెట్టి. ఆమె నాని సరసన కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్-3' మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. శైలేష్ కొలను దర్శకుడు. ఈ సందర్భంగా శనివారం శ్రీనిధి శెట్టి పాత్రికేయులతో ముచ్చటించింది. 'హిట్-3'లో తాను మృదుల అనే పాత్రలో కనిపిస్తానని, స్వతంత్ర భావాలున్న యువతిగా తన పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని చెప్పింది. 'సినిమాలో నాని పోషించిన అర్జున్ సర్కార్ క్యారెక్టర్ ఎంత ఇంటెన్స్‌గా ఉంటుందో ట్రైలర్‌లో చూశారు. ఆయన పాత్రకు పూర్తి భిన్నంగా మృదుల కనిపిస్తుంది. అయితే అర్జున్ సర్కార్..మృదుల మాట తప్పితే ఇంకెవరి మాట వినడు. అలా ఎందుకో చేస్తాడో తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే' అని తెలిపింది. ఈ సినిమా కోసం తెలుగులో సొంతంగా డబ్బింగ్ చెప్పానని, అచ్చ తెలుగు అమ్మాయిలా ఎలాంటి ఉచ్చారణ దోషాలు లేకుండా డబ్బింగ్ పర్‌ఫెక్ట్‌గా వచ్చిందని శ్రీనిధి శెట్టి పేర్కొంది. 'కేజీఎఫ్-3' గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ 'ఈ సినిమాలో నేను నటిస్తున్నానా? లేదా? అనే విషయం ఇప్పుడే చెప్పలేను. కొంతకాలం నిరీక్షించాల్సిందే. హిందీ 'రామాయణ' చిత్రంలో సీత క్యారెక్టర్‌ను నేను తిరస్కరించానని వార్తలొచ్చాయి. అవన్నీ అబద్ధం. అంత గొప్ప పాత్రను రిజెక్ట్ చేసే స్థాయి నాది కాదు. అయితే ఆ సినిమా కోసం ఆడిషన్ మాత్రం ఇచ్చాను. ఆ తర్వాత వాళ్ల నుంచి ఎలాంటి పిలుపు రాలేదు. సాయిపల్లవిని సీత పాత్ర కోసం ఎంపిక చేశారు' అని శ్రీనిధి శెట్టి తెలిపింది.





# బ్రేకప్ స్టోరీల గురించి... ఎన్నో బాయ్ ఫ్రెండ్ అంటారు!

కమల్ హాసన్ వారసురాలు శృతి హాసన్ కెరీర్ ఆరంభం నుంచి తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ వచ్చింది. తండ్రి పేరును వినియోగించుకుని ఆఫర్లు దక్కించుకోవడం లేదంటే, తండ్రి పేరును వినియోగించుకుని ఇండస్ట్రీలో నిలదొక్కుకునే ప్రయత్నం ఎప్పుడూ శృతి హాసన్ చేయలేదు. ఇండస్ట్రీలో ఆమె ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాలోనే బికినీ ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి హిట్ పడే వరకు తీవ్రమైన ఒత్తిడికి గురి అయినట్లుగా శృతి హాసన్ చెబుతూ ఉండేది. హీరోయిన్‌గానే కాకుండా ఇండస్ట్రీలో నాలుగు కాలల పాటు ఉండే విధంగా ఎప్పుడూ ఏదో విధంగా ప్రేక్షకుల ముందుకు రావాలని అనుకుంటాను అంటూ గతంలో శృతి హాసన్ చెప్పుకొచ్చింది. తాజాగా ప్రముఖ నేషనల్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శృతి హాసన్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది. ముఖ్యంగా తన ప్రేమ వ్యవహారాల గురించి, తన తల్లిదండ్రులు విడిపోయిన సమయంలో ఎదుర్కొన్న పరిణామాల గురించి, ఇండస్ట్రీలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి శృతి హాసన్ డెప్త్‌గానే చెప్పుకొచ్చింది. గతంలో ఎప్పుడూ చెప్పని విషయాలను ఈసారి శృతి హాసన్ షేర్ చేసుకోవడంతో ఆమె వ్యాక్యలు వైరల్ అవుతున్నాయి. శృతి హాసన్ వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడిన ప్రతిసారీ ఆమె ప్రేమ వ్యవహారాల గురించి టాపిక్ వస్తుంది. ఆమె ఇప్పటికే రెండు మూడు సార్లు ప్రియుడికి బ్రేకప్ చెప్పింది. ఆఫ్ ది రికార్డ్ మరికొందరు కూడా ఉండి ఉండవచ్చు అంటారు. తాజాగా ఆ విషయం గురించి శృతి హాసన్ స్పందిస్తూ... నాతో ఎవరైనా కొత్త వ్యక్తి కనిపిస్తే చాలా మంది ఇతడు ఎన్నో బాయ్ ఫ్రెండ్ అని అడుగుతూ ఉంటారు. వారు ఆ నెంబర్ గురించి ఆలోచిస్తూ ఉంటారు, కానీ నేను మాత్రం నెంబర్ గురించి ఆలోచించను. నేను కోరుకునే ప్రేమ లభించే వరకు ఎన్ని సార్లు అయినా విఫలం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాను. ఒక వ్యక్తికి బ్రేకప్ అయినంత మాత్రాన తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అంతే కాకుండా ప్రేమికులు ఇద్దరు బ్రేకప్ చెప్పుకున్నప్పుడు ఒకరిని ఒకరు తప్పుపట్టకూడదు. రిలేషన్ షిప్‌లో నిజాయితీగా ఉండాలని నేను అనుకుంటాను, అవతలి వారు మొదట నిజాయితీగా ఉన్నా ఆ తర్వాత ఉండక పోవచ్చు అంది. కోరుకునే ప్రేమ లభించే వరకు వెయిట్ చేస్తానంది. తన తల్లిదండ్రులు కమల్, సారికలు విడాకులు తీసుకున్న సమయంలో తీవ్రమైన ఒత్తిడికి గురి అయ్యాను. చెన్నై నుంచి ముంబై మకాం మార్చిన సమయంలో బెంజ్ కారులో తిరిగే నేను ముంబై లోకల్ రైల్‌లో, ట్యాక్సీ కారులో తిరగాల్సి వచ్చింది. ఆ సమయంలో జీవితం చాలా నేర్పించింది. అన్ని విషయాలను గుర్తు పెట్టుకుని జీవితంలో ముందుకు సాగుతూ వచ్చాను. తిరిగి నా తండ్రి వద్దకు చేరుకునే వరకు చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. అంత ఈజీగా నా జీవితం సాగలేదని, ముందు ముందు కూడా నటిగా తనను తాను నిరూపించుకునేందుకు విభిన్నమైన పాత్రల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ బోల్డ్‌గా వ్యాఖ్యలు చేసింది.



# లక్షల్లో ఎగవేసారని శృంగార నటి లబోదిబో

లక్షల్లో ఎగవేసారని శృంగార నటి లబోదిబో హైదరాబాదీ అమ్మాయి కోటి కలలతో ముంబైలో అడుగుపెట్టింది. అక్కడ అనుకోని పరిస్థితులు ఎదురయ్యాయి. గాడ్ ఫాదర్ లేని చోట నటిగా ఎదగాలంటే చాలా వేధింపులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. బాలీవుడ్ లో తనకు అలాంటి పరిస్థితులు ఎదురయ్యాయని ఈ నటి గతంలో వెల్లడించింది. కానీ తప్పదు.. కాలగమనంలో చాలా రాజీపడాల్సి వచ్చిందని అంగీకరించింది. ప్రతిభతో కొన్నేళ్ల పాటు నటనలో కొనసాగి చివరికి శృంగార సినిమాల్లోను నటించాల్సిన వచ్చింది. నిజానికి అందం, ప్రతిభ కంటే ఇండస్ట్రీలో తన స్థాయిని, స్థానాన్ని నిర్దేశించే ఇంకా ఎన్నో విషయాలు ఉంటాయని ఈ నటి లైఫ్ నిరూపించింది. ప్రస్తుతం సోషల్ మీడియాల్లో తన గోడు వెల్లబోసుకుంటున్న ఈ బ్యూటీ పేరు షెర్లిన్ చోప్రా. అందరికీ సుపరిచితమైన నటి. టాలీవుడ్ బ్లాక్ బస్టర్ ఏ ఫిలిం బై అరవింద్‌లో తనదైన అందం, నట ప్రతిభతో కట్టి పడేసిన షెర్లిన్ ఆ తర్వాత కెరీర్ స్ట్రగుల్ నుంచి బయటపడేందుకు చాలా సాహసాలు చేసింది. ముఖ్యంగా హిందీ సినీపరిశ్రమలో రాణించాలనే తన కలను నెరవేర్చుకోలేకపోయిం ది. ఇటీవల ఈ బ్యూటీ శృంగార చిత్రాలకు పరిమితమైంది. అయితే షెర్లిన్ తనకు జరిగిన ఒకానొక మోసం గురించి బహిరంగంగా వెల్లడించింది. తనతో మూడు శృంగార చిత్రాలు తీసి చెల్లించాల్సిన 48లక్షల పారితోషికాన్ని చిత్రనిర్మాత ఎగవేసాడని షెర్లిన్ ఆరోపించింది. అమ్మాయిలతో డర్టీ పని చేయమని బలవంతం చేసి, చివరికి డబ్బు ఎగవేసారని, నైతికత టాటాల్ని చూసి నేర్చుకోవాలని షెర్లిన్ వ్యాఖ్యానించింది. డబ్బు అడిగినందుకు బెదిరించారని కూడా వాపోయింది. టాటాలు నిజాయితీగా వ్యాపారం చేస్తారు. కానీ ఇక్కడ నిర్మాతలు కళాకారులను బెదిరిస్తారని అంది. పూర్తిగా తన బకాయి వసూలు చేసే వరకూ సదరు నిర్మాతను వదిలిపెట్టేది లేదని కూడా షెర్లిన్ వార్నింగ్ ఇచ్చింది. చెల్లించకుండా ఎగ్గొట్టిన పెండింగ్ పేమెంట్ 48 లక్షలు ఎలా అయినా వసూలు చేస్తానని షెర్లిన్ శపథం చేసింది. తనకు దుర్గామాత ఆశీస్సులు ఉన్నాయని కూడా ఈ సందర్భంగా తెలిపింది.

# ఈడీ అధికారులకు నటుడు మహేశ్ బాబు లేఖ



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు నేడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు డుమ్మాకొట్టిన విషయం తెలిసిందే. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సాయి సూర్య డెవలపర్స్ అనే కంపెనీకి మహేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించినందుకు గాను ఈ నెల 22న మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు జారీ చేసింది. నోటీసుల ప్రకారం, మహేశ్ బాబు ఈరోజు ఉదయం 10:30 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే, నిర్ణీత సమయం ముగిసినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాలేదు. ఇదిలావుంటే తాజాగా మహేశ్ బాబు ఈడీ విచారణకు హాజరుకాకపోయినందుకు లేఖ రాశాడు. ఈ లేఖలో ప్రస్తుతం తాను సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండి విచారణకు హాజరుకాలేకపోయానని మహేశ్ వెల్లడించాడు. రేపు కూడా షూటింగ్ బిజీలో ఉండడంతో విచారణకు మరో తేదీని ఇవ్వాలని మహేశ్ లేఖలో కోరాడు. అసలు ఏం జరిగిందంటే..సురానా గ్రూప్, సాయి సూర్య డెవలపర్స్ కంపెనీల ప్రమోషన్ కోసం మహేశ్ బాబు చెక్కుల రూపంలో రూ. 3.4 కోట్లు, నగదు రూపంలో రూ. 2.5 కోట్లు కలిపి మొత్తం రూ. 5.90 కోట్ల పారితోషికం తీసుకున్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. మనీ లాండరింగ్‌కు పాల్పడిన ఈ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేలా ప్రజలను ప్రభావితం చేశారని, ప్రమోషన్ల పేరుతో భారీగా డబ్బులు తీసుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 22న మహేశ్ బాబుకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

# ఏపీలో నాని 'హిట్-3' టికెట్ ధరల పెంపు.?

నేచురల్ స్టార్ నాని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం హిట్ 3. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ హిట్ నుంచి వస్తున్న 3వ చిత్రమిది. ఈ చిత్రంలో నాని కథానాయకుడిగా నటించడంతో పాటు నిర్మాణ బాధ్యతలు చేపట్టాడు. శైలేశ్ కొలను దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మే 01న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

తాజాగా ఈ సినిమా టికెట్ ధరలను పెంచినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. తెలంగాణలో టికెట్ ధరలకు అవకాశం లేకపోగా.. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సినిమా టికెట్ రేట్లు పెంపునకు ప్రభుత్వం కూడా అనుమతినిచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ మూవీ టికెట్లను రూ. 50 నుంచి రూ. 75 వరకు పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇవ్వనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. కాగా దీనిపై చిత్రబృందంతో పాటు ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.



# 'కేజీఎఫ్ -3' లో ఛాన్స్



'కేజీఎఫ్' ఫ్రాంచైజీ పాన్ ఇండియాలో ఎలాంటి సంచలనాలు నమోదు చేసిందో తెలిసిందే. రెండు భాగాలు భారీ విజయం సాధించి కన్నడ ఇండస్ట్రీ పేరు పాన్ ఇండియాలో మారు మ్రోగించింది. దీంతో యశ్ పాన్ ఇండియా స్టార్ గా మారిపోయాడు. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇండియాలో బిజీ డైరెక్టర్ అయిపోయారు. కానీ ఇదే సినిమాలో హీరోయిన్ గా నటించిన కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి మాత్రం ఆ రేంజ్ లో వెలగలేకపోయింది. 'కేజీఎఫ్' తర్వాత మరో ఛాన్స్ అందుకోవడానికి నాలుగేళ్లు పటింది. విక్రమ్ హీరోగా నటించిన 'కోబ్రా'లో నటించింది. అక్కడ నుంచి టాలీవుడ్ కి ప్రమోట్ అవ్వడానికి మరో మూడేళ్లు సమయం పట్టింది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన 'హిట్ ది థర్డ్ కేసు'లో నటిస్తోంది. 'తెలుసు కదా' అనే మరో చిత్రం లోనూ ఛాన్స్ అందుకుంది. ముందుగా 'తెలుసు కదా'లోనే ఛాన్స్ అందుకుంది. ఆ తర్వాతే 'హిట్' లో అవకాశం వచ్చింది. ఇవన్నీ పక్కనబెడితే 'కేజీఎఫ్ 3' కూడా ప్రకటించిన సంగతి తెలిసిందే. అది ఎప్పుడు ప్రారంభమ వుతుంది? అన్నది తెలియదుకానీ అందులో హీరో యశ్ మాత్రం యధావిధిగా కొనసాగుతాడు. పాత పాత్రలతో పాటు కొన్ని కొత్త పాత్రలు యాడ్ అవుతాయి. ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ మరింత ప్రతిష్టా త్మకంగాను తెరకె క్కిస్తాడు. మరి హీరోయిన్ సంగతేంటి? రెండు భాగాల్లోనూ నటించిందని శ్రీనిధిని తప్పించి కొత్త భామను తీసుకుం టారా? అన్న సందేహం రావడం సహజమే. ఇదే డౌట్ శ్రీనిధికు వచ్చింది. అందుకే ప్రశాంత్ నీల్ ని కలిసిన సమయంలో ఈ విషయం గురించి అడుగుతూనే ఉందిట. ఆ మధ్య ముంబైలో ఓ సినిమా షూట్ సందర్భంగా యశ్ ని కలిసినప్పుడు కూడా ఈ విషయం గురించి సరదాగా అడిగిందిట. కేజీఎఫ్ 2లో నా పాత్రని చంపేసారు. కేజీఎఫ్ 3 ప్లాన్ ఏంటి? అని అడిగా. మరి ఉన్నానా? లేనా? అన్నది అప్పుడే క్లారిటీ రాదు. అందుకు చాలా సమయం పడుతుందని తెలిపింది.

# వేవ్స్ సమ్మిట్‌లో 'రామాయణ' ఫస్ట్ గింప్స్.!



ఇటీవలే తండేల్‌తో సూపర్ హిట్ అందుకున్న టాలీవుడ్ స్టార్ హీరోయిన్ త్వరలో సీత పాత్రలో కనిపించబోతున్న విషయం తెలిసిందే. సాయిపల్లవి, బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ కలిసి నటిస్తున్న చిత్రం 'రామాయణ'. ఈ చిత్రాన్ని నితేశ్ తివారీ దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కించబోతున్నామని నిర్మాతలు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. 2026 దీపావళికి తొలిభాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. అయితే తాజాగా ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ వైరల్‌గా మారింది. ఈ మూవీ నుంచి ఫస్ట్ గింప్స్‌ను ముంబైలోని వరల్డ్ జియో సెంటర్‌లో జరిగే ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్(లో విడుదల చేయబోతున్నట్లు సమాచారం. శ్రీరామనవమి పండుగ రోజున విడుదల చేద్దామనుకున్న అనుకోని కారణాల వలన వాయిదా పడింది. దీంతో తాజాగా వేవ్స్ సమ్మిట్‌లో రిలీజ్ చేయనున్నట్లు సమాచారం. ఏ.ఆర్.రెహమాన్‌తో పాటు హాలీవుడ్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ హన్స్ జిమ్మెర్ ఈ చిత్రాన్ని సంగీతాన్నందించబోతున్నారు. ఈ సినిమాలో రావణ పాత్రలో నటిస్తున్నట్లు కన్నడ అగ్ర నటుడు యష్ ఇటీవలే ప్రకటించారు. హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్, కైకేయి పాత్రలో లారా దత్తా నటించనున్నారని వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబయిలో వేసిన భారీ సెట్‌లో జరుగుతున్నది.

# వర్షార్పణం.. పంజాబ్, కోల్‌కతా పోరు రద్దు



**కోల్‌కతా-నవభూమి:** ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య మ్యాచ్ వర్షార్పణమైంది. శనివారం ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కల్గించాడు. ఎడతెరిపిలేని వర్షానికి తోడు బలలమైన ఈదురుగాలులతో మ్యాచ్‌ను రద్దు చేస్తూ ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. తొలుత టాస్ గెలిచిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 201/4 స్కోరు చేసింది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్‌సింగ్(49 బంతుల్లో 83, 6ఫోర్లు, 6సిక్స్‌లు), ప్రియాంశ్ ఆర్య(35 బంతుల్లో 69, 8ఫోర్లు, 4సిక్స్‌లు) అర్ధసెంచరీలతో విజృంభించారు. లీగ్‌లో తమ సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తూ ప్రియాంశ్, ప్రభ్‌సిమ్రన్..కోల్‌కతా బౌలర్లపై విరుచుకుపడ్డారు. వైభవ్ ఆరోరా(2/34) రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన కోల్‌కతాకు వరుణుడు అడ్డంకిగా నిలిచాడు. తొలి ఓవర్ ముగియగానే అందుకున్న వర్షం మ్యాచ్‌ను విడిచిపెట్టలేదు. యాన్సెన్ వేసిన తొలి ఓవర్‌లో కోల్‌కతా ఏడు పరుగులు చేయగా, గుర్బాజ్(1), నరైన్(4) నాటౌట్‌గా నిలిచారు. ఎంతసేపటికి వాన తెరిపినియ్యకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్..పంజాబ్‌కు అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఇన్నింగ్స్ తొలి, చివరి బంతులను బౌండరీలుగా బాదిన ప్రియాంశ్ తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. ఓ ఎండ్‌లో ప్రియాంశ్..ఎదురైన బౌలర్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ బౌండరీలతో చెలరేగుతుంటే మరో ఎండ్‌లో ప్రభ్‌సిమ్రన్ ఒకింత ఆలస్యంగా పోటీలోకి వచ్చాడు. సకారియా 4వ ఓవర్‌లో భారీ సిక్స్‌తో ప్రభ్‌సిమ్రన్ బ్యాటు ఝులిపించగా, ఇద్దరు పోటీపడీ బౌండరీలు బాదారు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి పంజాబ్ వికెట్ కోల్పోకుండా 56 పరుగులు చేసింది. వీరి దూకుడుకు కళ్లెం వేసేందుకు కోల్‌కతా కెప్టెన్ రహానే బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. ఈ తరుణంలో హర్షిత్ రానా 10వ ఓవర్‌లో వరుసగా 4, 6, 4 బాదిన ప్రియాంశ్ 27 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇక ఈసారి తనవంతు అన్నట్లు ప్రభ్‌సిమ్రన్ కూడా జతకలువడంతో పంజాబ్ స్కోరు ఊపందుకుంది. బౌలింగ్ మార్పుగా వచ్చిన రస్సెల్‌ను సిక్స్ బాదిన ప్రియాంశ్ ఆ మరుసటి బంతికే ఆరోరాకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో 120 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది.

# ధోనీ తదుపరి ప్లాన్ ఇదే.. సురేశ్ రైనా కీలక కామెంట్స్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ సీజన్‌లో చెన్నై ఎంత దారుణంగా ఆడుతోందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆడిన తొమ్మిది మ్యాచుల్లో కేవలం రెండే గెలిచి పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరుకుంది. ప్లేఆఫ్స్ ఆశలు ఇక లేనట్టే. దీంతో, వచ్చే సీజన్‌లో చెన్నై జట్టులో సమూల మార్పులు, ధోనీ రిటైర్మెంట్‌పై చర్చ మొదలైంది. అయితే, తదుపరి జరగబోయేదేంటో చెన్నై జట్టు చిన్న తలా సురేశ్ రైనా చెప్పేశాడు. సీఎస్‌కే తరపున ధోనీ కనీసం మరో సీజన్ అయినా ఆడతాడని పేర్కొన్నారు. వచ్చే సీజన్‌లో అయినా సీఎస్‌కే పటిష్ఠ ప్లానింగ్‌తో అడుగుపెడుతుందని తాను విశ్వసిస్తున్నట్టు సురేశ్ రైనా అన్నాడు." వచ్చేసారైనా వారు మంచి ప్రణాళికతో వస్తారని అనుకుంటున్నా. ఇక ధోనీ కూడా కనీసం మరో సీజన్ అయినా చెన్నై తరపున ఆడతాడు. ఇక జట్టు కూర్పు విషయంలో ధోనీదే తుది నిర్ణయం అని వారు అంటుంటారు. కానీ నిజం చెప్పాలంటే నేను ఇప్పటివరకూ ఏ ఆక్షన్‌కూ హాజరు కాలేదు. ఆ చర్చల్లో నేను భాగం కాలేదు. ఓ ప్లేయర్‌పై ఎమ్ఎస్ సలహాలు వాళ్లు అడుగుతూ ఉండొచ్చు. కానీ అతడు ఈ వ్యవహారంలో అంత ఎక్కువగా ఇన్‌వాల్వ్ అయ్యాడని నేను అనుకోను. ఆక్షన్ వ్యవహారాన్ని కోర్ గ్రూప్ హ్యాండిల్ చేస్తుంది. తనకు ఏ ప్లేయర్లు కావాలో ధోనీ సలహా ఇస్తూ ఉండొచ్చు. అందులో కొందరిని జట్టులో కొనసాగిస్తూ ఉండొచ్చు" అని అన్నాడు.

# 'మాడ్రిడ్'లో జొకోవిచ్‌కు షాక్



**మాడ్రిడ్-నవభూమి:** కెరీర్‌లో 100వ టైటిల్‌పై గురిపెట్టిన టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్‌కు మాడ్రిడ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ఈ సెర్బియా యోధుడు అనూహ్యంగా ఆరంభ రౌండ్లోనే కంగుతిన్నాడు. ఇటలీకి చెందిన 44వ ర్యాంకర్ మ్యాటో అర్నాల్డి 5-3, 6-4తో 4వ సీడ్ జొకోవిచ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించాడు. ఇటీవలి కాలంలో వరుసగా విఫలమవుతున్న 37 ఏళ్ల జొకోవిచ్.. ఆరంభ మ్యాచ్‌లో ఓడడం గత ఐదు ఈవెంట్లలో అతనికిది నాలుగోసారి కావడం గమనార్హం.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**